5-8Pg1exHMNWJQE_5-8Pg1exHMNWJQE.qxd 05/Aug/26 12:01 AM Page 1

గత వారం రోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

fb.com/vaartha Digital

Published from Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-8-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 186 పేజీలు: 12 వెల: 6.50

డిసెంబరులో క్వాంటం వ్యాలీ: సిఎం చంద్రబాబు 2లో

ఉదయనిధి స్టాలిన్ అరెస్టు, విడుదల 9లో

## వడివడిగా 'జల్‌జీవన్'

● తీరప్రాంత గ్రామాల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం ● రెండు ప్రాజెక్టులకు రూ. 270 కోట్ల వ్యయం ● 400 కి.మీ. పైగా పైప్‌లైన్ నిర్మాణం ● ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించిన డి.సిఎం పవన్

**విజయవాడ.ఆగస్టు 4,ప్రభాతవార్తప్రతినిధి:** ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో జల్ జీవన్ మిషన్ కింద అమరజీవి జలధార ప్రాజెక్టు ద్వారా ఆయా జిల్లాల పరిధిలోని తీర ప్రాంత గ్రామాల మంచినీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించనుందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖలను నిర్వహిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 33 లక్షల మందికి దాహార్తి తీర్చే బలమైన సంకల్పాన్ని ఈ ప్రాజెక్టుల ద్వారా ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. నిర్ణీత గడువులోపు ముఖ్యమైన నిర్మాణాలు పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు



రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ జల్ జీవన్ పనుల వేగం >>2

# మళ్లీ వృద్ధిబాటలోకి రాష్ట్రం

సంక్షేమం, అభివృద్ధిలో సమతౌల్యం పాటిస్తున్నాం
పేదరికాన్ని నిర్మూలించే దిశలో అడుగులు
2019-24 మధ్య రాష్ట్రంలో అంతా విధ్వంసమే
కేంద్రం అండతో కోలుకుంటున్నాం
పిపిపిని వ్యతిరేకిస్తూ భోగాపురం క్రెడిట్ కావాలంటారు..
రెండేళ్ల పాలనపై సిఎం చంద్రబాబు ప్రోగ్రెస్ రిపోర్ట్

**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** విభజన నాటి కంటే 2019-24 మధ్యన జరిగిన విధ్వంసం వల్లే ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నష్టపోయిందని, ఈ సమస్యను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. తన జీవితంలో ఎన్నడూ పడనంత కష్టాన్ని గత రెండేళ్లల్లో పడ్డానని తెలిపారు. ఈ రెండేళ్ల కాలంలో రాష్ట్రాన్ని మొత్తంగా గాడిలో పెట్టేశామని చెప్పడంలేదన్న సిఎం, రాష్ట్రాన్ని అభివృద్ధిబాట పట్టించేలా పోయిన బ్రాండ్‌ను ఎస్టాబ్లిష్ చేశామన్నారు. ఆర్థిక వెసులుబాటు లేకున్నా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమాన్ని అందిస్తున్నామని సిఎం తెలిపారు. రాష్ట్ర ఆర్థికపరిస్థితి, ఆదాయ వ్యయాలు.. ప్రభుత్వ భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలు ప్రజలకూ తెలియాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా కాన్ఫరెన్స్‌లో రెండేళ్ల ఆర్థిక స్థితిగతులపై సిఎం చంద్రబాబు ప్రోగ్రెస్ రిపోర్ట్ ప్రజెంట్ చేశారు. 2019-24 మధ్య రాష్ట్రంలో వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని, ప్రజలు, అధికారులు, ఉద్యోగులు భయపడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఆ పాలనపై



ప్రజల్లో వచ్చిన నిశ్శబ్ద విప్లవమే 2024 ఎన్నికల ఫలితాలని చెప్పారు. 2024 ఎన్నికల సమయంలో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, బ్రాండ్ ఎపిని తిరిగి తీసుకొస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని సిఎం గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. చెప్పిన విధంగా.. ఇచ్చిన తేదీల్లో సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. సంక్షేమంతో పాటు రాష్ట్రానికి ఆదాయం సమకూర్చే అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి ఆదాయం పెరగాలంటే ముందుగా అభివృద్ధి జరగాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అందుకే పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతులు, కొత్త రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఆ మేరకు కొత్తపాలసీలు తెస్తుందని సిఎం వివరించారు.

**సమర్థవంతంగా పనిచేస్తే ప్రజలు సహకరిస్తారు:** ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తే ప్రజలు కూడా అభివృద్ధిలో ఏ స్థాయిలో భాగస్వాములు అవుతారో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం చాటిచెప్పిందని ముఖ్యమంత్రి అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి రెక్కలు వచ్చిన భావన ప్రజల్లో ఏర్పడిందన్నారు. ఉత్తరాంధ్రను అంతర్జాతీయ అవకాశాలకు గేట్‌వేగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. దీన్ని ప్రజలు గ్రహించారు కాబట్టే ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి ప్రజల నుంచి చక్కటి మద్దతు లభించిందని ముఖ్యమంత్రి అన్నారు. పిపిపిపద్ధతిలో ప్రాజెక్టులు చేపడుతుంటే వ్యతిరేకించిన వారు, అదే పిపిపి పద్ధతిలో చేపట్టిన భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ క్రెడిట్ మాత్రం తమదని చెప్పుకుంటున్నారని సిఎం విమర్శించారు. పెట్టుబడులు వస్తే పరిశ్రమలు >>2

## నాన్ ఆక్వాజోన్‌కూ రాయితీ విద్యుత్

### యూనిట్ రూ. 1.50 చొప్పున ఈ నెలనుంచే అమలు

ఆగస్టు 7 నుంచి రైతులకు అవగాహన కార్యక్రమాలు: సమీక్షలో సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు4,ప్రభాతవార్తప్రతినిధి:** ఈ నెల నుంచే నాన్ ఆక్వా జోన్‌లో ఉన్న ఆక్వా రైతులకూ రాయితీపై విద్యుత్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆక్వా జోన్ పరిధిలో ఇస్తున్నట్లే నాన్ ఆక్వా జోన్ లో ఉన్న రైతులకూ యూనిట్ విద్యుత్ ను రూ.1.5కే ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ నెల నుంచి దీనిని అమలు చేయాల్సిందిగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో ఇక జోన్లకు మాత్రమే పరిమితం కాకుండా ఆక్వా రైతులందరికీ రాయితీ విద్యుత్ అందుబాటులోకి రానుంది. ఈ నిర్ణయంతో 12,500 మంది ఆక్వా రైతులకు లబ్దికలగనుంది. సచివాలయంలో మంగళవారం రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, లోటు వర్షపాతం, పంటల సాగు, జల వనరులు తదితర అంశాలపై వ్యవసాయ శాఖతో సిఎం సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో సంక్షోభ నివారణ ప్రణాళికతో రాష్ట్రంలోని ప్రతీ రైతు వద్దకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. దీనికి సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, రైతులు అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ ప్రణాళికల్ని వారికి వివరించాలని సూచించారు. ఆగస్టు 7వ తేదీ నుంచి రైతులకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఎల్ నినో కారణంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో అక్టోబర్ మాసం వరకూ లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ ప్రణాళికలు అనుసరించేలా చర్యలు చేపట్టాలని సిఎం సూచించారు. ప్రత్యేకించి పీఎండీఎస్ విధానంలో సాగు చేసేందుకు ఉన్న అవకాశాలను రైతులకు వివరించేలా రైతుల వద్దకు వెళ్లాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఎల్ నినో లాంటి తీవ్ర వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో స్పష్టమైన విధానాన్ని రైతులకు అందించాలని అన్నారు. రైతు యాప్ ద్వారా పూర్తి సమాచారాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు వేగంగా అందించాలని స్పష్టం చేశారు. వర్షపాతం తగ్గి, సాగు విస్తీర్ణం పెరుగుతోందని క్షేత్రస్థాయిలో వస్తున్న ఈ మార్పులకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎల్ నినో ఎఫెక్ట్ మిటిగేషన్ యాక్షన్ ప్లాన్ పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. పశువుల దాణా విషయంలోనూ వీబీ జీ రామ్ జీ అనుసంధానించాలన్నారు. ఆఫ్ స్టైల్ పొగాకుపై కిలోకు రూ.10 మద్దతు ధర ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రేపటి నుంచే ఇది అమల్లోకి >>2

విజయవాడ నుంచి అమరావతి దేవస్థానం వరకు ఐకానిక్ రోప్‌వే
సిఎం అధ్యక్షతన సిఆర్‌డిఎ సమావేశంలో పలు నిర్ణయాలు 2లో




## ఇథనాల్ పెట్రోల్‌పై ఆందోళన వద్దు

పూర్తిస్థాయిలో తనిఖీలు
87 వేల బంకుల్లో రోజూ దాదాపు 12 సార్లు పరీక్షలు
కేంద్రం వెల్లడి

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ నాణ్యత, కలుషితానికి సంబంధించిన ఆందోళనలపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ సమగ్ర వివరణఇచ్చింది. దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా వ్యవస్థలో అమలు చేస్తున్న కఠినమైన నాణ్యత నియంత్రణ చర్యలను మంగళవారం కేంద్రంవెల్లడించింది. వాహనయజమానులు ఆందోళనచెందాల్సిన అవసరంలేదని, ఇంధన నాణ్యతను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నాయని స్పష్టం చేసింది. ఇప్పటికే అమల్లోఉన్న పరీక్షా విధానాలతో పాటు.. ఇంధనంలో కల్తీ, కలుషితాన్ని అడ్డుకునేందుకు అదనపు తనిఖీలను కూడా చేపట్టి >>2

## పోలీసు విచారణకు మాజీమంత్రి సీదిరి

### పలాసలో రోజంతా ఉత్కంఠ



**పలాస (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 4 ప్రభాతవార్త :** అసలు ఏమి జరిగింది... ఇప్పుడు ఏమి జరుగుతోంది.. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఇంగిలిగాం పారిశ్రామిక వాడ దగ్గర పాత హైవేలో గత నెల 10న జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదానికి సంబంధించి వాస్తవాలు తారుమారు చేశారనే ఆరోపణపై అదే కేసులో ఎ3గా ఉన్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును గత నెల 22న పోలీసులు అరెస్టు చేసి 23న అంపోలు జైలుకు రిమాండ్‌కు పంపించారు. ఆయన తరుపున న్యాయవాదులు కోర్టులో బెయిల్ పిటిషన్ వేసినప్పటికీ కోర్ట్‌లో తిరస్కరించారు. కాగా కాశీబుగ్గ పోలీసులు పలాస జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో డా. సీదిరికి పోలీసు విచారణకు అవకాశం కల్పించాలని పిటీషన్ దాఖలు చేసిన నేపద్యంలో ఈ కేసుకు సంబంధించి సోమవారం పలాస కోర్టులో వాదోపవాదనలు జరిగాయి. దీనిపై జడ్జ్ యు.మాధురి మాజీ మంత్రి డా. సీదిరి అప్పలరాజుకు కాశీబుగ్గ పోలీసులకు ఒక్క రోజుకు విచారణ జరిపేందుకు అనుమతించారు. దీంతో పోలీసులు మంగళవారం అప్పలరాజును కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి కోర్టు ఇచ్చిన సమయం మేరకు విచారణ చేపట్టి తిరిగి డా. అప్పలరాజును జిల్లా జైలుకు తరలించారు. డా. అప్పలరాజును జూలై 23న 14 రోజులు కోర్టు రిమాండ్‌కు పంపించారు. రిమాండ్ ఈ నెల 5 నాటికి పూర్తి అయ్యి డా. సీదిరి ను కోర్టులో హాజరు పర్చాల్సి ఉంది. ఇప్పటికే డాక్టర్ అప్పలరాజుకు బెయిల్ మంజూరు చేయాలని సొంపేట కోర్టులో ఆయన తరుపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేయగా ఈ సమయంలోనే కాశీబుగ్గ పోలీసులు కస్టడీకి కోరుతూ పలాస కోర్టులో పిటీషన్ దాఖలు చేయడంతో సొంపేట కోర్టు బెయిల్ ఫిటీషన్ కొట్టి వేశారు. ఇదే కేసులో ఎ1, ఎ2 గా ఉన్న డా. అప్పలరాజు కుమారుడు అరవ్ వర్మ మరియు సిద్ధార్థ త్యాడీలకు ఇటీవల బెయిల్ మంజూరు కావడంతో వారు జైలు నుంచి విడుదలఅయ్యారు. వీరు జైలులో ఉన్న సమయంలోనే వీరికి కస్టడీకి ఇవ్వాలని కాశీబుగ్గ పోలీసులు పిటీషన్ దాఖలు చేసినప్పటికీ పలాస కోర్టు న్యాయమూర్తి ఈఫిటీషన్ తిరస్కరిం >>2

## పులి వేట కేసు: ఏడుగురి అరెస్టు

**గిద్దలూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త :** గిద్దలూరు ప్రాజెక్ట్ టైగర్ డివిజన్ పరిధిలో సంచలనం సృష్టించిన పులి వేట కేసును అటవీ శాఖ కేవలం నాలుగు రోజుల్లోనే ఛేదించింది. రాచర్ల మండలం జెల్లివారి పుల్లలచెరు అటవీ ప్రాంతంలో నాటు తుపాకీతో పులిని కాల్చి చంపి, దాని కాళ్లు, పంజాలు నరికివేసి కళేబరాన్ని అడవిలో పడేసిన ఘటనలో ఏడుగురు నిందితులను అటవీ అధికారులు అరెస్టు చేశారు. వారి నుంచి పులికి చెందిన ఏడు పంజాలు, అవయవాల ఎముకలు, ఒక దేశీయ నాటుతుపాకీ, ఒకగొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. జూలై 31 తెల్లవారుజామున గుండ్లకమ్మ రేంజ్‌లోని రాచర్ల బీట్‌లో పులి కళేబరం లభ్యమవడంతో అటవీ శాఖ వెంటనే అప్రమత్తమైంది. ఎన్‌టిసిఎ మార్గదర్శకాల ప్రకారం సంఘటన స్థలాన్ని భద్రపరిచి, పులి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఫోరెన్సిక్ పరీక్షల కోసం నమూనాలను సేకరించి పంపగా, అది పూర్తి ఎదిగిన మగ పులిగా అధికారులు నిర్ధారించారు. డి.సిఎం పవన్, రాష్ట్ర ప్రధాన అటవీ సంరక్షణాధికారి ఆదేశాల మేరకు, ఎన్ఎస్‌టిఆర్ ఫీల్డ్ డైరెక్టర్ పర్యవేక్షణలో గిద్దలూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు రంగంలోకిదిగాయి. గిద్దలూరు సబ్ డిఎఫ్ఒ, గుండ్లకమ్మ ఎఫ్ఆర్ఒ, ఏఆర్ఒ, పశువైద్య నిపుణులు, అటవీ సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయిలో విస్తృత దర్యాప్తు చేపట్టారు. డాగ్‌స్క్వాడ్‌సహాయం, సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారాన్ని సమన్వయం చేస్తూ నిందితుల జాడను గుర్తించారు. విచారణలో నిందితులు నాటు తుపాకీతో పులిని వేటాడి, దాని పంజాలు, గోళ్లను నరికివేసి, కళేబరాన్ని అడవిలోనే వదిలేసినట్లు వెల్లడైంది.

## వాము, జీలకర్ర, లవంగాలు అన్నీ కల్తీ!

### హైదరాబాద్‌లో భారీగా పట్టుబడిన మసాలా పదార్థాలు, ముగ్గురు అరెస్టు

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మరోసారి భారీగా మసాల దినుసులు, ఆహార వస్తువులు పట్టుబడ్డాయి. ఈ సందర్భం గా వీటిని తయారు చేస్తున్న ముగ్గురు వ్యాపారులను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీం (హెచ్..ఫాస్ట్), బల్దియా అధికారులు సంయుక్తంగా దాడులు చేసి ఈ గోల్‌మాల్‌ను రట్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.సి సజ్జన్నర్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. జంట నగరాలలో కల్తీ ఆహార వస్తువుల తయారీ, విక్రయాలపై హెచ్..ఫాస్ట్, బల్దియా సంయుక్తంగా నిఘా వుంచి, వరుసగా దాడులు చేస్తుండడం తెలిసిందే. ఈ క్రమంలో కాటేదాన్, బాలాపూర్ పరిధుల్లో మూడు ప్రాంతాలలో కల్తీ మసలా దినుసులు, ఇతర ఆహార వస్తువులు, ఇంకొన్ని ఉత్పత్తులు తయారవుతున్నట్లు సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు సోమవారం రాత్రి హెచ్..ఫాస్ట్, బల్దియా సిబ్బంది సంయుక్తంగా దాడి చేశారు. దాడుల సందర్భంగా 7920 కిలోల కల్తీ వాము, 6700 కిలోల జీలకర్ర, 550 కిలోల లవాంగాలు, 2280 కిలోల సాజీర, 540 కిలోల సోంపు, 4960 కిలోల ఆవాలు, 65 వేల కిలోల జీలకర్ర పొడి, 13,460 కిలోల మెంతులు, పది వేల కిలోల తెల్లనువ్వులు, 90 కిలోల >>2



మంగళవారం హైదరాబాద్‌లో పట్టుబడిన కల్తీ మసాలా దినుసులు

## మద్యం కుంభకోణం కేసు: కిరణ్ కుమార్ రెడ్డికి రిమాండ్

### కీలక అంశాలు వెల్లడించిన సిట్

**విజయవాడ,ఆగస్టు 4,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసు నిందితుడు కిరణ్ కుమార్ రెడ్డికి విజయవాడ ఎసిబి కోర్టు మంగళవారం రెండు వారాలు పాటు రిమాండ్ విధించింది. రాష్ట్రంలో 2019 నుంచి 2024 మధ్య కాలంలో జరిగిన భారీ మద్యం కుంభకోణం కేసులో అజ్ఞాతంలో ఉన్న కీలక నిందితుడైన కిరణ్‌కుమార్‌రెడ్డి పాత్రతో సహా ప్రభుత్వ ఆదాయానికి రూ. వేల కోట్ల దోపిడి పాల్పడిన సిండికేట్ కుట్రను సిట్ అధికారులు బయటపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డిని సిట్ అధికారులు నిన్న అర్ధరాత్రి సమయంలో హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్టులో అరెస్ట్ చేశారు. మంగళవారం విజయవాడలోని ఎసిబి కోర్టులో హాజరు పర్చారు. అతని రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు వెల్లడించింది. మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు, లంచాల సొమ్ము దారి మళ్లించేందుకు భారీగా డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసాడు మద్యం నగదు రవాణాలో ఈశ్వర్ ప్రధాన పాత్ర పోషించాడని సిట్ తెలిపింది. ఈ కేసులో ఇప్పటికే పలువురు అరెస్ట్ కావటం, ఎక్కువ కాలం విదేశాల్లో ఉండటానికి, తప్పించుకునేందుకు అవకాశం లేకపోవటంతో కిరణ్ కుమార్‌రెడ్డి ఇటీవల సుప్రీం కోర్టులో ముందస్తు బెయిల్ పిటీషన్ దాఖలు చేశారు. ముందస్తు బెయిల్ ఇవ్వటానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. వెంటనే దర్యాప్తు అధికారి ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో కిరణ్ దుబాయ్ నుంచి బయలుదేరి శ్రీలంక మీదుగా భారత్‌కు వస్తుండగా అతనిపై లుక్ అవుట్ సర్క్యులర్ ఉండటంతో శంషాబాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారుల పట్టుకు న్నారు. అనంతరం సిట్ అధికారు >>2




మంగళవారం విజయవాడలో స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల్లో ప్రసంగిస్తున్న వెంకయ్యనాయుడు

## తెలుగు భాషకు అంకితం 'మండలి'

**విజయవాడ,ఆగస్టు4,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలు, ప్రభుత్వం, పత్రికలు కలిసి పనిచేస్తేనే తెలుగు భాషకు పూర్వవైభవం వస్తుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఉద్ఘాటించారు. రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి బాషా (సంస్కృతిక శాఖ) మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తుమ్మల పల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు కాంస్య విగ్రహాన్ని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మండలి వెంకట కృష్ణారావు స్మృతికి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.మండలి వెంకట కృష్ణారావు వంటి మహనీయుల సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని అమలు చేయాలన్నారు. దివిసీమ ఉప్పెన సమయంలో ఆయన చేసిన సేవలు అద్భుతమని కొనియాడారు. గాంధేయవాదిగా ఆయన పనితీరును చూసే అదృష్టం తనకు దక్కిందన్నారు. ఏ శాఖ మంత్రిగా ఉన్నా ప్రతి పనిలో తనదైన ముద్ర వేశారని చెప్పారు. తెలుగు భాష పరిరక్షణకు మండలి బుద్ధప్రసాద్ కృషి చేస్తూ తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్నారని అన్నారు. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.వెంకట కృష్ణారావు జీవిత విశేషాలతో రేగుళ్ళ మల్లిఖార్జునరావు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించామని వెంకయ్యనాయుడు చెప్పారు. మహనీయుల జీవితాల్లో జరిగిన ముఖ్య ఘట్టాలను ఇటువంటి పుస్తకాల ద్వారానే నేటి తరం తెలుసుకోవాలని అన్నారు. తెలుగు భాష పరిరక్షణ కోసం ఆయన ఎంతో పరితపిస్తూ కృషి చేసేవారని తెలిపారు. నేటి రోజుల్లో రాజకీయ నేతలకు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ >>2

5-8pg2exHMNWJQE_5-8pg2exHMNWJQE.qxd 05/Aug/26 12:03 AM Page 1





మంగళవారం న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతికి 'అమరావతి విజన్' పుస్తకాన్ని అందజేస్తున్న టిడిపి ఎంపీలు

# ఉపరాష్ట్రపతికి 'అమరావతి విజన్' పుస్తకాన్ని అందజేసిన టిడిపి ఎంపీలు

**విజయవాడ.ఆగస్టు4, ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ టిడిపి పార్లమెంట్ సభ్యుల బృందం నేడు న్యూఢిల్లీలోని భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విజన్, పురోగతి, మరియు భవిష్యత్తు ప్రాధాన్యతలను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేకపుస్తకాన్ని ఉపరాష్ట్రపతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, రాజ్యసభ సభ్యులు సానాసతీష్, భాష్యం రామకృష్ణ, మరియు చింతకాయల విజయ్‌తో పాటు పలువురు ఇతర టిడిపి ఎంపీలు పాల్గొన్నారు. ఎంపీలతో ఎంతో ఆత్మీయంగా ముచ్చటించిన ఉపరాష్ట్రపతి, అమరావతిపై వారుచేపట్టిన చొరవను ప్రత్యేకంగా అభినందించారు.

# వాము, జీలకర్ర, లవంగాలు అన్నీ కల్తీ!

>> షైనింగ్ పౌడర్, 12 లీటర్ల రైస్ బ్రాన్ ఆయిల్, 1.5 కిలోల సింథటిక్, ఫ్యాబ్రిక్ డై, మూడు రోలింగ్ యంత్రాలు పట్టుబడ్డాయి. ఈ సందర్భంగా వీటిని తయారు చేస్తున్న కాటేదాన్‌కు చెందిన రాహుల్ బాటి, బేగంబజార్‌కు చెందిన విశాల్ పన్వార్, దులీచంద్ కచ్చావాలు పట్టుబడ్డారు. ఈ ఘటనపై సజ్జనార్ మాట్లాడుతూ ఆహార పదార్థాలలో పారిశ్రామిక రంగులు, సింథటిక్ రంగులు, టాల్కం పౌడర్ వంటివి కలుపుతున్నారని, దీనివల్ల వీటిని వాడుతున్న వారు తీవ్రఅనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. కాలేయం, మూత్ర పిండాల సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన తెలిపారు. ఆహార పదార్థాలలో రసాయనాలు కలపడం వల్ల క్యాన్సర్ సోకే ప్రమాదం ఎక్కువగా వుందని ఆయన వెల్లడించారు. కడుపునొప్పి, అలెర్జి, జీర్ణకోశ, చర్మ వ్యాధులు, నరాలు దెబ్బతినే ప్రమాదం వుందని ఆయన అన్నారు. దీంతో పాటు శరీరం రోగ నిరోధక శక్తి కోల్పోతుందని సజ్జనార్ తెలిపారు.

# నాన్ ఆక్వాజోన్‌కూ రాయితీ విద్యుత్

>> రావాలని సిఎం దిశానిర్దేశం చేశారు. 94 మిలియన్ కేజీల ఆఫ్ స్టైల్ పొగాకును కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీని ద్వారా 44 వేల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని స్పష్టం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, టొబాకో బోర్డు, రైతులు సహా 5గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి సమీక్షి ంచాలని సీఎం నిర్దేశించారు. రైతులను ఆదుకునేలా బ్యారెల్ కు రూ.50 వేల రుణం ఇచ్చే కార్యక్ర మాన్ని ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. ఫిష్ మీల్ ఎగుమతులను 50 శాతానికి తగ్గించేలా కేంద్రంతో సంప్ర దింపులు జరుపుతున్నామని సీఎం స్పష్టంచేశారు. కేంద్రం నిర్ణయం తీసుకునేంత వరకూ రొయ్యమేత ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమను ఉద్యాన హబ్ గా తీర్చిదిద్దే అంశంపై వేగంగా ప్రణాళికలు అమలు చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే 201 ఉద్యాన క్లస్టర్లను ప్రారంభించ నున్నట్టు తెలిపారు. ఇక నుంచి ప్రతీ మంగళవారం వ్యవసాయం, అనుబంధ రంగాలపై, ఎల్ నినో ప్రభావం నియంత్రణా చర్యలపై సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. ఈ సమీక్షకు మంత్రి కె.అచ్చెన్నా యుడు, సీఎస్ సాయి ప్రసాద్, వ్యవసాయ, జల వనరులు, ఆర్థిక శాఖ

# ఎన్‌ఓసి లేకున్నా గృహాలకు విద్యుత్ కనెక్షన్ల మంజూరు ఇవ్వాలి: హైకోర్టు

**విజయవాడ,ఆగస్టు4,ప్రభాతవార్తప్రతినిధి:** అనధికార లేఅవుట్లలో నిర్మించిన గృహాలకు విద్యుత్ కనెక్షన్ల మంజూరుపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. గ్రామ పంచాయతీ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసి) లేదన్న ఏకైక కారణంతో విద్యుత్ కనెక్షన్‌ను నిరాకరించకూడదని విద్యుత్ పంపిణీ సంస్థలను (డిస్కంలు) ఆదేశించింది. ఈ తీర్పుతో రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి సమస్యలను ఎదుర్కొంటున్న వేలాది మందికి భారీ ఊరట లభించింది.

# ఎపికి ప్రత్యేక పెట్టుబడుల పథకం కింద రూ.19,619 కోట్ల సాయం

**న్యూఢిల్లీ,అమరావతి, ఆగస్టు 4:** ప్రత్యేక మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రాలకు కేంద్రం అందించే స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (శీతిశీది) పథకం కింద గత రెండున్నరేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు విడుదలైనట్లు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో వెల్లడించింది.ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వైఎస్సార్‌సీపీ ఎంపీ పీవీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. దీనిపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక నివేదిక విడుదలచేసింది. 2020 నుంచి 2024 వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఇదే పథకం కింద లభించిన రూ.11,386 కోట్లతో పోలిస్తే, ప్రస్తుత టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి రెండున్నరేళ్లలో లభించిన నిధులు 72 శాతం అధికం. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో, ఆర్థిక క్రమశిక్షణ, ప్రాజెక్టుల సకాలంలో రూపకల్పన, వేగవంతమైన అమలు వల్లే కేంద్రం నుంచి అధిక నిధులు పొందగలిగామని పేర్కొంది. అర్హత కలిగిన మూలధన పెట్టుబడి ప్రతిపాదనలను సమయానికి సమర్పించడం, వాటి అమలును వేగంగా పూర్తి చేయడం ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధికి గణనీయమైన నిధులను రాష్ట్రం సమీకరించగలిగిందని తెలిపింది. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, 202021 నుంచి ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌కు ఎస్ఏఎస్‌సీఐ పథకం కింద మొత్తం రూ.31,005.47 కోట్లు విడుదలయ్యాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత విడుదలైన మొత్తం రూ.19,619 కోట్లు. వాటిలో:202425లో రూ.7,901.56 కోట్లు 2025-26లో రూ.8,289.61 కోట్లు2026-27లో (ఆగస్టు 1 వరకు) రూ.3,428.14 కోట్లు విడుదలయ్యాయి.

# డిసెంబరులో క్వాంటం వ్యాలీ

**విజయవాడ,ఆగస్టు4,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పునర్నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో కీలకంగా మారిందని సిఎం చంద్రబాబు అన్నారు.సచివాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి పనులను మళ్లీ గాడిలో పెట్టామని, నిర్మాణ పనులు వేగంగా చేపడుతున్నామని తెలిపారు. గతంలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రం నవ్వుల పాలైందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ప్రపంచంలో అమరావతికి గుర్తింపు తీసుకొచ్చే ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. డిసెంబరులో క్వాంటం వ్యాలీని ప్రారంభిస్తామని, 2028లో అమరావతి ఫేజ్1ను ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని సీఎం స్పష్టం చేశారు. పోలవరంతోనే ఆగకుండా రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రూ.37,766 కోట్లతో 36 ఇరిగేషన్ ప్రాజెక్టు లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు.

# మళ్లీ వృద్ధిబాటలోకి రాష్ట్రం

>> వస్తాయని, పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు, ఆదాయం పెరుగుతాయని, ఆదాయం పెరిగితే మరింత సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

**గుంతల రోడ్లు.. గుదిబండ అప్పులు:**

2019-24 మధ్య రాష్ట్రాన్ని విషవలయంలోకి నెట్టారని, రోడ్లన్నీ గుంతలమయమయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడంతోపాటు అభివృద్ధి వేగాన్ని నిలిపివేశారని అన్నారు. ఆదాయాలు తగ్గి, ఖర్చులు పెరిగిన పరిస్థితుల్లో అప్పులు పెంచుకుంటూ వెళ్లారని, చివరకు రాష్ట్రం దివాళా తీసే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. 2019లో పరిపాలన ప్రారంభించిన తీరు ప్రజా వేదిక కూల్చివేతతోనే స్పష్టమైందని పేర్కొన్నారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ పెట్టి మరీ ప్రజా వేదికను కూల్చారు. దీన్ని గర్వం అనాలా? మదం అనాలా? దీనికి పేరే లేదేమో? అని సిఎం ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాలనలో విధానపరమైన నిర్ణయాల కంటే విధ్వంసకర చర్యలకే గత ప్రభుత్వంలో ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శించారు. 2019-24 మధ్య రాష్ట్రాన్ని అన్ని విధాలుగా వెనక్కి నెట్టారని సిఎం అన్నారు. మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో పురోగతి ఆగిపోయిందని, రోడ్ల నిర్వహణ సరిగాలేక గుంతలమయంగా మారాయని తెలిపారు. శాంతిభద్రతల పరిస్థితి దెబ్బతినడంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం తగ్గిందన్నారు. పరిశ్రమలు రావాల్సిన చోట ఉన్నవి కూడా వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందని, కొత్త పెట్టుబడులు లేకుండా పోయాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత ప్రభుత్వం తీవ్రంగా దిగజార్చిందని చంద్రబాబు విమర్శించారు. నాటి ప్రభుత్వ నిర్వాకం వల్ల అప్పులు రూ.9.74 లక్షల కోట్లకు చేరాయని, అప్పులు తీర్చే సామర్థ్యం లేని రాష్ట్రంగా నీతి ఆయోగ్ పేర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆదాయాలు తగ్గుతున్నా ఖర్చులు మాత్రం పెరిగాయని, ప్రభుత్వ ఆస్తులు, భూములను తాకట్టు పెట్టి మరీ అప్పులు తెచ్చారని ఆరోపించారు. రాష్ట్రం దివాళా తీసే స్థాయికి చేరడంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

**కేంద్ర నిధులూ దారి మళ్లించారు:**

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన పథకాల నిధులను కూడా గత ప్రభుత్వం దారి మళ్లించిందని సిఎం ఆరోపించారు. కేంద్ర నిధుల వినియోగంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానం కారణంగా కేంద్రం ప్రత్యేకంగా చట్టం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. కేంద్రం ఇచ్చే నిధులను నిర్దేశిత ప్రయోజనాలకే వినియోగించేలా వ్యవస్థను కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. మద్య నిషేధం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నాటి ప్రభుత్వం, చివరకు మద్యం ఆదాయాన్ని ముందుగానే తాకట్టు పెట్టి రూ.25 వేల కోట్లు అప్పులు తెచ్చిందని చంద్రబాబు విమర్శించారు.

గత ప్రభుత్వ హయాంలో అమరావతి నగర నిర్మాణాన్ని నిలిపివేశారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి పనులను మళ్లీ గాడిలో పెట్టామని, నిర్మాణ పనులు వేగంగా చేపడుతున్నామని తెలిపారు. గతంలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రం నవ్వుల పాలైందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ప్రపంచంలో అమరావతికి గుర్తింపు తీసుకొచ్చే ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. డిసెంబరులో క్వాంటం వ్యాలీని ప్రారంభిస్తామని, 2028లో అమరావతి ఫేజ్1ను ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని సిఎం స్పష్టం చేశారు. పోలవరంతోనే ఆగకుండా రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రూ.37,766 కోట్లతో 36 ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ఎపిలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని, ట్రిపుల్ రీజియన్ ప్రణాళికతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అమరావతి, తిరుపతి, విశాఖ కేంద్రంగా ఎకనమిక్ రీజియన్ల వారీగా అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు.

**టెక్నాలజీని అడ్డుకోవద్దు**

గతంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి)ను రాష్ట్రానికి తీసుకొచ్చామని, ఇప్పుడు ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఎ)ను ఏర్పాటు చేస్తున్నామని సిఎం తెలిపారు. ఐఎస్ఎ ఏర్పాటుకు రిలయన్స్ ముందుకొచ్చిందని వెల్లడించారు. డేటా సెంటర్లు వస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. మాకెందుకు స్టీల్ ప్లాంట్? మాకెందుకు ఎఐ? మాకెందుకు డేటా సెంటర్లు అంటూ పేదరికంలోనే బాధపడాలా? అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. యువతకు ఉద్యోగాలు, ప్రజలకు ఆదాయం, రాష్ట్రానికి సంపద తీసుకొచ్చే పరిశ్రమలు, సాంకేతిక రంగాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల జీవితాలను మార్చేలా పబ్లిక్ పాలసీలు ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. సంక్షేమం ఎంత ముఖ్యమో, అభివృద్ధి కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. మంచి రోడ్లు వేయాలన్నా.. మౌలిక వసతులు కల్పించాలన్నా.. సంపద సృష్టించాల్సిందేనని తెలిపారు. సంపద సృష్టికి కొత్త మార్గాలను అన్వేషించడంతోపాటు.. పెట్టుబడులను ఆకర్షించే విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాలని ఆకాంక్షి ంచారు. పరిశ్రమలు వస్తే ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు వస్తుందో కియా కార్ల పరిశ్రమను ఉదాహరణగా సిఎం ప్రస్తావించారు.

# మాజీమంత్రి సీదిరి

>> చడంతో వారికి బెయిల్ మంజూరు అయ్యింది. అయితే ఎ3 నిందితుడుగా ఉన్న అప్పలరాజుకు కస్టడీకి ఇవ్వాలని మరో మారు కాశీబుగ్గ పోలీసులు పిటీషన్ దాఖలు చేయడం వెనుక డా. అప్పలరాజుకు బెయిల్ మంజూరు జరగకూడదనే పిటీషన్ దాఖలు చేసినట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎ1, ఎ2,ల కస్టడీ పిటీషన్ కొట్టి వేసిన పలాస కోర్టు ఎ3గా ఉన్న డా. అప్పల రాజుకు ఒక్క రోజు కస్టడీకి అనుమతించారు. పలాస కోర్టులో డా. అప్పలరాజు కస్టడీ పిటీషన్ తిరస్కరించినట్లయితే సొంపేట కోర్టులో కొత్తగా ఆయన తరుపున న్యాయవాదులు బెయిల్ పిటీషన్ దాఖలు చేసినట్టయితే సొంపేట కోర్టు అప్పలరాజుకు తప్పని సరిగా బెయిల్ మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయని ఆయన తరుపున న్యాయ వాదులుతెలిపారు. కానీ కాశీబుగ్గ పోలీసులు అత్యుత్సాహంతో డా. అప్పలరాజును ఎక్కవ రోజులు జైలులో ఉంచేందుకు బెయిల్ రాకుండా చేసేందుకు కస్టడీ పిటీషన్ వేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అప్పలరాజును ఒక్క రోజు విచారణ చేపట్టినప్పటికీ ఎలాంటి కొత్త విషయాలు సీదిరి నుండి రాబట్టారో తెలియాల్సి ఉంది. ఏదిఏమైనా డా. అప్పల రాజు బెయిల్‌పై బయటకు రాకూడదనే దురుద్దేశ్యం పోలీసులలో కనిపిస్తున్నట్లు సష్టంగా తెలుసుందని వైకాపా నాయకులు ఆరోపిస్తున్నారు.

# రిమాండ్

>> లకు అప్పగిం చారు. వాస్తవానికి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 నవంబరులో ఇతడు దుబాయ్‌కి పారిపోయాడు. అనంతరం అతనిపై లుక్ అవుట్ సర్క్యులర్ జారీ అయింది. అప్పటి నుంచి అతను విదేశాల్లోనే దాక్కున్నాడు. మిగతా నిందితులకూ దుబాయ్‌లో ఆశ్రయమిచ్చాడు. కేసులో ఏ9గా ఉన్న ఈశ్వర్‌కిరణ్ కుమార్ రెడ్డి మద్యం రవాణా దోపిడీ, ఈడీ కేసుల్లోనూ కీలక పాత్రధారి. రాజ్ కెసిరెడ్డితో కలసి 'టెక్కర్' అనే డొల్ల కంపెనీని ఏర్పాటు చేశాడు. దీని ద్వారా కొల్లగొట్టిన ముడుపుల సొమ్మును దారి మళ్లించాడు. ఇతడిని విచారిస్తే మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. తిరుపతికి చెందిన ఈశ్వర్ కిరణ్‌కుమార్ కానిస్టేబుల్ కుమారుడు. రాజ్ కెసిరెడ్డిద్వారా ఈ కుంభకోణంలో కీలక పాత్రధా రిగా మారాడు. మరో నిందితుడు సైఫ్ అహ్మద్‌కూడా భారత్‌కు వస్తు న్నట్లు సమాచారం. అతను ఇప్పటికే విజయవాడ ఎసిబి కోర్టులో లొంగుబాటు పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటిషన్‌పై కోర్టు ఇంకా ఉత్తర్వులు ఇవ్వలేదు. అయినా భారత్‌కు తిరిగి వస్తున్నట్లు తెలిసింది.

## వారం - వర్జ్యం

05-08-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేష కార్తె,
తి.సప్తమి రా.8.38 న.అశ్వని రా.9.14
వ.సా.5.20-సా.6.54
దు.ఉ.11.47-మ.12.38
రాహు. మ.12.00-మ.1.30
శుభ ఉ.6.00-ఉ.7.00

## వార్తాఫలం

**మేషం :** దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. వస్తులాభం. సోదరుల కలయిక.

**వృషభం :** ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి. శత్రువులుసైతం మిత్రులుగా మారతారు. సభలలో పాల్గొంటారు.

**మిథునం :** మాటల చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకొనే పనులు పూర్తి చేస్తారు. వస్త్రాలు కొనుగోలు.

**కర్కాటకం :** సంతాన విషయమై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు. క్రమశిక్షణ పాటించడం వలన లాభ పడతారు.

**సింహం :** మీలోని ప్రతిభా పాటవాలు వెలుగు చూసే దిశగా ప్రయాణం సాగిస్తారు. సంఘ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కన్య :** ఒకానొక రహస్య సమాచారం తెలుసుకుంటారు. జీవిత భాగస్వామితో చర్చలు జరిపి కొన్ని ముఖ్య నిర్ణయాలు చేస్తారు.

**తుల :** విధుల నిర్వహణలో, వ్యాపార రంగాలలో అభివృద్ధిని సాధిస్తారు. ఆరాధనలు, యాత్రలు సంభవము.

**వృశ్చికం :** దూర ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. దీర్ఘ కాలిక సమస్యలు తీరుతాయి.

**ధనుస్సు :** మాట పట్టింపులతో ఎంతో కాలంగా దూరమైన సన్నిహితులను కలుసుకుంటారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**మకరం :** ముఖ్య కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. వస్త్రాలాభం.

**కుంభం :** సంఘంలోని పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. స్వల్ప ధన లాభం. వాహన సౌలభ్యం.

**మీనం :** చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం తెలుసుకుంటారు. రాజకీయ పరపతి పెరుగుతుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# విజయవాడ నుంచి అమరావతి దేవస్థానం వరకు ఐకానిక్ రోప్‌వే

**విజయవాడ,ఆగస్టు4,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి ప్రాంతంలో కీలకమైన పలు అభివృద్ధి పనులకు సిఆర్‌డిఎ అథారిటీ అనుమతులు మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 64వ సిఆర్‌డిఎ అథారిటీ సమావేశంలో ఆమోదించిన నిర్ణయాలను సచివాలయంలో నాల్గవ భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర 64వ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ అథారిటీ సమావేశంలో అమరావతి రాజధాని పునర్నిర్మాణం, మౌలిక వసతులు,సాంకేతిక అభివృద్ధి,పర్యాటక రంగానికి సంబంధించి అనేక కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు.అమరావతిని గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రూ.1,280 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించనున్న క్వాంటం ఫెసిలిటీ ప్రాజెక్టు టెండర్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టి (లార్సన్ అండ్ టూబ్రో) దక్కించుకోగా, ఈ ప్రతిపాదనకు అథారిటీ అధికారిక ఆమోదం తెలిపిందని వివరించారు.రాజధాని అనుసంధానానికి అత్యంత కీలకమైన ఇన్నర్ రింగ్ రోడ్డు మరియు నూతన రైల్వే లైన్ నిర్మాణానికి భూమి సేకరించాల్సి రాగా, గుంటూరు జిల్లా మోతడక గ్రామస్థులు ముందుకు వచ్చి తమ గ్రామంలోని 2,344 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చేందుకు ఏకగ్రీవ తీర్మానం చేయడంపట్ల అథారిటీ హర్షం వ్యక్తం చేసి ఆమోదముద్ర వేసిందన్నారు. విజయవాడ నగరంలో ట్రాఫిక్ రహిత రవాణాతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహించేలా పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్ షిప్ మోడల్‌లో విజయవాడ రైల్వే స్టేషన్ నుండి పండిట్ నెహ్రూ బస్ స్టాండ్ వరకు, బస్టాండ్ నుండి ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయం వరకు, దుర్గమ్మ గుడి వద్ద నుండి కృష్ణా నది ఒడ్డున ఉన్న పున్నమి ఘాట్ వరకు అక్కడి నుండి భవాని ఐలాండ్ వరకు అక్కడి నుండి అమరావతిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాయం వరకు ఐకానిక్ రోప్‌వే ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నామన్నారు.



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ అయిన టిడిపి ఎంపీలు

# కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌తో టిడిపి ఎంపీలు భేటీ

**విజయవాడ.,ఆగస్టు4,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యుల బృందం మంగళవారం కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఐటీ,కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ బృందంలో లోక్‌సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, భాష్యం రామకృష్ణ, మరియు చింతకాయల విజయ్‌లతో పాటు మరికొందరు టిడిపి ఎంపీలు ఉన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విజన్, అభివృద్ధి పురోగతి, అలాగే భవిష్యత్తులో దాని ప్రాధాన్యతను ప్రతిబింబించే ఒక ప్రత్యేక పుస్తకాన్ని ఎంపీల బృందం కేంద్ర మంత్రికి అందజేశారు. ఎంపీల బృందంతో ఎంతో సుహృద్భావ వాతావరణంలో ముచ్చటించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్.. అమరావతి ప్రాముఖ్యతను నలుదిశలా తెలియజేసేలా రూపొందించిన ఈ ప్రత్యేక పుస్తకాన్ని, అలాగే ఎంపీల చొరవను ప్రత్యేకంగా కొనియాడారు.

# వడివడిగా 'జల్‌జీవన్'

>> మరింత పెంచాలని స్పష్టం చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో చేపట్టిన జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుల పురోగతిపై పవన్ కల్యాణ్ సమీక్షించారు. ఇన్ టేక్ వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్లతోపాటు పైప్‌లైన్ల నిర్మాణంవంటి కీలకపనులపురోగతికి సంబంధించిన వివరాలపై ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులతో చర్చించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో రూ.3,050 కోట్లతో చేపట్టిన పనులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సాగుతుండడంపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో రూ.1,650కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మెగావాటర్‌గ్రిడ్ పథకాన్ని 10 నియోజకవర్గాల పరిధిలో సుమారు 20 లక్షల మందికి మంచినీరు అందించే లక్ష్యంతో ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రెండు ఇంటేక్ వెల్స్, యాక్సెస్ బ్రిడ్జిల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. 111 ఎంఎల్‌డి, 75 ఎంఎల్‌డి సామర్థ్యాలతో ఏర్పాటు చేస్తున్న నీటి శుద్ధి కేంద్రాల్లో ఒకటి నిర్మాణ దశలో ఉన్నట్టు వివరించారు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు కోసం రూ.151 కోట్లకు పైగా ప్రభుత్వం వెచ్చించగా, 182 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం పూర్తయింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో రూ.1,400 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు ద్వారా సుమారు 13.50 లక్షల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీనికి సంబంధించి ఇంటేక్ వెల్, యాక్సెస్ బ్రిడ్జి, 155 మిలియన్ లీటర్ల సామర్థం కలిగిన నీటి శుద్ధి ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. రెండు పథకాల కింద సుమారు 400 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం పూర్తయినట్టు అధికారులు తెలిపారు. ఇందుకు స్పందిస్తూ పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో గత యేడాది డిసెంబర్‌లో పశ్చిమ గోదావరి జిల్లా పెరవలిలో రూ.3,050 కోట్ల అంచనా వ్యయంతో అమరజీవి జలధారకు శ్రీకారం చుట్టాం. రెండు మెగా వాటర్ గ్రిడ్ పథకాల నిర్మాణంలో కీలకమైన ఇంటేక్ వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్లు, పైప్‌లైన్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. పనులన్నీ నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా సంబంధిత శాఖలతో సమన్వయంతో పని చేయాలి' అన్నారు.

**ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లతో నిరంతర పర్యవేక్షణ.**

కేటాయింపుల ప్రక్రియ పూర్తయి నత్తనడకన నడుస్తున్న పనులపై దృష్టి సారించాలి. ముఖ్యంగా పైపు లైన్ల నిర్మాణానికి సంబంధించి ఇతర శాఖల అనుమతులు పెండింగ్‌లో ఉంటే ఆ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి. ఆర్ అండ్ బి, జాతీయ రహదారి అథారిటీ, పంచాయతీరాజ్ శాఖలు, అవసరం ఉన్న చోట అటవీశాఖలతో సమన్వయం చేసుకుంటూ, పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ల ద్వారా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, రాష్ట్ర కార్యాలయానికి సమాచారం ఇవ్వాలి. ముఖ్యంగా నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న తీర ప్రాంత గ్రామాల్లో పనుల వేగం పెంచాలి. అదే సమయంలో నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ పడవద్దని, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడతా. నిర్మాణ పనులకు సంబంధించి నాణ్యతాపరమైన తనిఖీలు స్వయంగా నిర్వహిస్తాం. ప్రధాని నరేంద్రమోడీ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో ఏలూరు డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు కోసం రూ.12.60 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. జనవాణి, వారాహి యాత్రల్లో పవన్ దృష్టికి డిగ్రీ కళాశాల సమస్యలు. చెట్ల కింద పాఠాలు చెబుతున్న దుస్థితిపై స్పందించిన పవన్ నిర్దిష్టమైన హామీనిచ్చారు.

# ఇథనాల్ పెట్రోల్‌పై ఆందోళన వద్దు

>> నట్లు పెట్రోలియం శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న 87 వేలకుపైగా పెట్రోల్ బంకుల్లో రోజుకు 8 నుంచి 12 సార్లు ఇంధనంలోకి నీరు చేరిందా లేదా అనే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. క్లోరైడ్, సల్ఫైడ్ కలుషితాన్ని గుర్తించేందుకు ఇప్పటివరకు 2 వేలకుపైగా ఇంధన నమూనాలను ప్రత్యేకంగా పరీక్షించినట్లు పేర్కొంది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు కేవలం రెండు ప్రాంతాల్లో మాత్రమే క్లోరైడ్ కలుషితానికి సంబంధించిన వేర్వేరు ఘటనలు గుర్తించినట్లు తెలిపింది. ఆ రెండు పెట్రోల్ బంకుల్లో ఇంధన విక్రయాలను వెంటనే నిలిపివేసినట్లు వెల్లడించింది. ఇంధనంలో కలుషితం లేదా కల్తీకి పాల్పడినట్లు తేలిన ఏ రిటైల్ అవుట్‌లెట్‌పైనా కఠిన చర్యలు తీసుకుంటామని పెట్రోలియం శాఖ హెచ్చరించింది. ఇంధన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసింది. వాహనాల ట్యాంకుల్లోకి ఇంధనం చేరడానికి చాలా ముందే నాణ్యత పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపింది.

# అసోంలో సిఆర్‌పిఎఫ్ క్యాంప్ వద్ద దారుణం

## తోటి జవాన్లపై కాల్పులు జరిపి ఆత్మహత్య చేసుకున్న ఎపి అధికారి

**హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త:** అస్సాం రాష్ట్రంలో సిఆర్‌పిఎఫ్ క్యాంప్ వద్ద మంగళవారం ఉదయం ఎపికి చెందిన ఓ ఏఎస్ఐ తోటి జవాన్లపై ఇన్సాస్ తుపాకితో కాల్పులు జరపడంతో ఇద్దరు చనిపోగా మరొకరు గాయపడ్డారు. ఈ ఘాతుకం తరువాత సదరు ఏఎస్ఐ తనను తాను కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అస్సాంలోని నాగావ్ జిల్లా కతిమెరి వద్ద గల సిఆర్‌పిఎఫ్ 34వ బెటాలియన్ ప్రధాన గేట్ డ్యూటీలో వున్న ఎపికి చెందిన ఏఎస్ఐ బల్లాని ప్రేమాంబరం ఉదయం ఏడు గంటల సమయంలో వున్నట్లుండి తన చేతిలో వున్న ఇన్సాస్ తుపా కితో విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఎస్ఐ రాంనవాల్ సింగ్, హెడ్ కానిస్టేబుల్ విష్ణుప్రసాద్ బహేల్‌లు ఘటనా స్థలం లోనే మరణించగా ఏఎస్ఐ గోవింద్ శ్రీపుల్ తీవ్రంగా గాయపడ్డాడు. కాల్పుల ఘటన తరువాత ఏఎస్ఐ ప్రేమాంబరం తన వద్ద వున్న ఇన్సాస్ తుపాకితో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సిఆర్‌పిఎఫ్ క్యాంప్ కార్యాలయం వద్ద సంచలనం రేపింది.

# తెలుగు భాషకు అంకితం 'మండలి'

>> కార్యక్రమంలో శాసనసభాపతి గౌరవ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. మండలి వెంకటకృష్ణారావు శతజయంతి సందర్భంగా ఆయన చేసిన సేవా కార్యక్రమాలను స్మరించుకున్నారు. తెలుగు భాషను కాపాడుకోవడం మన బాధ్యత అని శాసనసభలో ప్రతి ఎమ్మెల్యే కూడా తెలుగులోనే మాట్లాడాలని, తెలుగులో మాట్లాడితేనే మైక్ ఆన్ చేస్తానని సభాపతిగా నిబంధన విధించినట్లు తెలిపారు. అలాగే అసెంబ్లీకి రాకుండా ఉండే సభ్యులపై కూడా తగిన చర్యలు ఉండాలని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... జీవితాంతం తెలుగు భాషా వికాసానికి అంకితమైన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవ్వడం ఎంతో సముచితమని, ఈ సభకు వన్నె తెచ్చిందని తెలిపారు. తెలుగు భాషను జాతీయ, అంతర్జాతీయస్థాయిలో విశ్వవ్యాప్తం చేయడానికి మొట్టమొదటి తెలుగు మహాసభలను నిర్వహించిన మహానుభావుడు మండలి వెంకటకృష్ణారావు అని మంత్రి కొనియాడారు. ఆయన సేవలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం అధికారభాషా సంఘానికి ఆయన పేరు పెట్టడం ఎంతో గౌరవప్రదమైన విషయమన్నారు. అలాగే తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ మండలి బుద్ధప్రసాద్ కూడా తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని శ్లాఘించారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ... మండలి వెంకటకృష్ణారావు బహుముఖ ప్రజ్ఞాపాటవాలు, వారి సుదీర్ఘ ప్రజాసేవ నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శనీయమని కొనియాడారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, జెడ్పీ ఛైర్మన్‌గా, వివిధ శాఖల మంత్రిగా ఏ బాధ్యత నిర్వహించినా దానికి పరిపూర్ణ న్యాయం చేశారని కొనియాడారు.

అంతేకాకుండా తెలుగు భాషా పరిరక్షణకు, సాంస్కృతిక వికాసానికి ఆయన చేసిన కృషి అమూల్యమైనదని... హైదరాబాద్ మరియు మలేషియాలో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒకే తాటిపైకి తెచ్చారని మంత్రి గుర్తుచేశారు.ఇటువంటి మహోన్నత నాయకుడి శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కి, ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా రూపుదిద్దిన మండలి బుద్ధప్రసాద్ కి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

5-8Pg3exHMNWJQE_5-8Pg3exHMNWJQE.qxd 05/Aug/26 12:04 AM Page 1





## డి.సిఎం పవన్‌తో బిజెపి నేత శివ్‌ప్రకాష్ భేటీ

**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను భారతీయ జనతా పార్టీ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి శివ్‌ప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఇటీవల భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో మరింత చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ భేటీలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ మధుకర్ పాల్గొన్నారు.

## మెగా డిఎస్సీపై పిల్... జోక్యానికి హైకోర్టు నిరాకరణ

**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** మెగా డిఎస్సీ 2025పై సిబిఐ విచారణకు ఆదేశించాలంటూ వైసిపి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వేసిన పిల్‌పై జోక్యానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిరాకరించింది. స్పోర్ట్స్ కోటా వల్ల నష్టపోయిన అభ్యర్థులు నేరుగా కోర్టుకు ఎందుకు హాజరు కావడం లేదని ప్రశ్నించింది. బాధిత అభ్యర్థులు నేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు భయపడుతున్నారనే వాదనతో ఏకీభవించలేమని తెలిపింది. మెగా డిఎస్సీ నోటిఫికేషన్, నియామకాలను సవాల్ చేస్తూ ఇప్పటివరకు 335 పిటిషన్లు దాఖలయ్యాయని హైకోర్టు పేర్కొంది. ప్రజా ప్రయోజన వ్యాజ్యమనేది చాలా విలువైన సాధనమని హైకోర్టు అభిప్రాయపడింది. రాజకీయ ప్రయోజనాల కోసం దానిని వినియోగించడానికి అనుమతిస్తే పిల్ ఉద్దేశం దెబ్బతింటుందని హెచ్చరించింది. ఈ పిల్‌పై వాదనలు కొనసాగిస్తారా?, ఉపసంహరించుకుంటారా? పిటిషనర్ నుంచి ఇన్‌స్ట్రక్షన్స్ తీసుకొని తమ ముందుకు రావాలని న్యాయస్థానం సూచించింది. ఈ మేరకు వైసిపి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాదికి న్యాయస్థానం వెల్లడించింది. మెగా డిఎస్సీ 2025పై సిబిఐ విచారణకు ఆదేశించాలంటూ హైకోర్టులో చంద్రశేఖర్‌రెడ్డి హైకోర్టులో ఇటీవల పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

## కడప జిల్లాలో జంట హత్యలు

- కుమార్తెను, కన్నతల్లిని కడతేర్చిన వైనం
- సిసి కెమెరాలు తనిఖీ చేసిన పోలీసులు
- నిందితుడి కోసం ముమ్మర గాలింపు

**సిద్దవటం, ఆగస్టు 4 ప్రభాతవార్త:** కడప జిల్లాలో పరువు హత్యలు కలకలం రేపాయి. అనుమానంతో కుమార్తెను కడతేర్చి నవ మోసాలు మోసి, పెంచి పెద్ద చేసిన తన కన్నతల్లినే అతి కిరాతకంగా హత్య చేసిన సంఘటన మంగళవారం మాచుపల్లి పొలాల్లో వెలుగు చూసింది. సిద్ధవటం మండలంలోని మాచుపల్లి సమీపంలోని వరి పంట పొలంలో ఓబుళమ్మ(50) అనే మహిళ మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మహిళ మృతదేహం వద్ద ఉన్న పర్సులో మైదుకూరు గ్రామంలోని, బంగారం దుకాణం అడ్రస్‌తో కూడిన సమాచారం లభ్యం కావడంతో మృతురాలు వనిపెంట ఎస్సీ కాలనీకి చెందిన ఓబుళమ్మగా గుర్తించారు. ఓబులమ్మకు వెంకటరమణ, బాబు, రఘునాథ్ ముగ్గురు కొడుకులు. బాబు కడప నగరంలో పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఓబుళమ్మ కుమారుడు రఘునాథ్ కథనం మేరకు, సోమవారం రాత్రి 7 గంటలకు తన అన్న బాబు ద్విచక్ర వాహనంలో వనిపెంట నుండి తల్లి ఓబులమ్మను తీసుకొని వచ్చాడు. కూతురు హారిక(21)పై అనుమానం పడేవారు. తల్లి ఓబులమ్మను తన కూతురు వద్దే ఉండమని చెప్పేవాడని, అయితే వృద్ధాప్య పెన్షన్ కోసం తల్లి ఓబుళమ్మ వనిపెంటకు వచ్చిందన్నారు. కూతురిపై అనుమానంతో హతమార్చాడని రఘునాథ్ పేర్కొన్నారు. అదే కోపంతో తల్లిని ద్విచక్ర వాహనంలో తీసుకు వచ్చి హత్య చేసినట్లు అనుమానం కలిగిస్తుందన్నారు. భార్య అయ్యవారమ్మను కూడా హత్య చేయాలని చూశాడన్నారు. మృతుల కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. సిసి కెమెరాలు పరిశీలిస్తున్నారు. జంట హత్యలపై డిఎస్‌పి బాలస్వామి రెడ్డి నేతృత్వంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐలు హారిక, శ్రీనివాసులు విచారణ చేపట్టారు.

## మండలి వెంకటకృష్ణారావుకు అయ్యన్న నివాళి



**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మండలి వెంకట కృష్ణారావు శత జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర శాసనసభలో ఆయనకు నివాళి అర్పించారు. అసెంబ్లీ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొని కృష్ణారావు చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఇది కేవలం ఒక వ్యక్తిని స్మరించుకునే కార్యక్రమం మాత్రమే కాదని, ఒక గొప్ప ఆదర్శాన్ని గుర్తుచేసుకునే అరుదైన సందర్భమని కొనియాడారు. మండలి వెంకట కృష్ణారావు కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, నిజమైన ప్రజల మనిషి అని అన్నారు. నిస్వార్థ ప్రజా సేవకు అంకితమైన ఆయనను ప్రజలందరూ ఎంతో ప్రేమగా "దివిసీమ గాంధీ" అని పిలుచుకునేవారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు, విష్ణుకుమార్ రాజు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర పాల్గొన్నారు.

## నెల్లూరులో యువతి దారుణ హత్య

**నెల్లూరు(క్రైమ్), ఆగస్టు 4 ప్రభాతవార్త:** నెల్లూరు రూరల్ మండలంలో వివాహేతర సంబంధాన్ని కొనసాగించేందుకు నిరాకరించిన ఓ వివాహితను దారుణంగా హత్య చేసిన ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు, మనుబోలు మండలం బిరుదవోలు గ్రామానికి చెందిన మద్దూరు వెన్నెల (25)కు మట్టెంపాడు గ్రామానికి చెందిన కాకుమూరు శ్రీహరితో గతంలో వివాహేతర సంబంధం ఉండేది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెన్నెలను మందలించడంతో ఆమె ఆ సంబంధాన్ని పూర్తిగా విరమించుకుంది. అప్పటి నుంచి శ్రీహరి తిరిగి తనతో సంబంధాన్ని కొనసాగించాలని ఆమెపై ఒత్తిడి చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో ఆగస్టు 3వ తేదీ రాత్రి వెన్నెల మట్టెంపాడు గ్రామానికి వెళ్లిన అనంతరం తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. తెల్లవారుజామున నెల్లూరు-పొదలకూరు రహదారిలోని ఎంఎస్ఎంఈ పార్క్ సమీపంలో వెతుకుతుండగా ఓ మహిళ కేకలు వినిపించడంతో అక్కడికి వెళ్లి చూడగా, కాకుమూరు శ్రీహరి చెక్క కర్రతో వెన్నెల తలపై దాడి చేస్తున్నట్లు మృతురాలి బంధువులు చల్లా తేజా, గుంజి వెంకట కృష్ణ గుర్తించారు. గమనించిన నిందితుడు తన మోటార్‌సైకిల్‌పై అక్కడి నుంచి పరారయ్యాడు. వెన్నెల తీవ్ర రక్తస్రావ గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతురాలి తల్లి చల్లా మంగమ్మ ఫిర్యాదు మేరకు నెల్లూరు రూరల్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 103(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలానికి నెల్లూరు రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు, సిఐ గుంజి వేణు చేరుకుని పరిశీలించారు.

# నైతిక విలువలతోనే విద్యా వికాసం

- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో మర్యాదపూర్వక భేటీలో ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు



**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రవచన చక్రవర్తి, నైతిక విలువల సలహాదారులు చాగంటి కోటేశ్వరరావు మంగళవారం ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీ సందర్భంగా సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి నైతిక విలువలతో కూడిన విద్య ఎంతటి కీలకమైనదో చాగంటి కోటేశ్వరరావు మంత్రికి వివరించారు. చిన్ననాటి నుంచే పిల్లలలో మానవీయ విలువలు, క్రమశిక్షణ, నైతికతను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు చాగంటి కోటేశ్వరరావు దిశా నిర్దేశంలో రూపకల్పన చేసిన నైతిక విలువల పాఠ్యాంశాలను 'నో బ్యాగ్ డే' రోజు బోధిస్తున్నారు. నైతిక విలువల విద్యతోనే సమగ్ర విద్యా వికాసం సాధ్యమని నమ్మిన ఎపి ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగం కావడం పట్ల చాగంటి కోటేశ్వరావు సంతోషం వ్యక్తం చేశారు. భేటీ అనంతరం ఇంటి నుంచి కారు వద్దకు వచ్చి చాగంటి కోటేశ్వరావుని మంత్రి నారా లోకేష్ వినయపూర్వకంగా సాగనంపారు.

## మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ గాయని శోభారాజు



**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రఖ్యాత శాస్త్రీయ సంగీత కళాకారిణి, పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల ఆలాపన, ప్రచారంలో విశేష ప్రావీణ్యం సంపాదించిన పద్మశ్రీ శోభారాజు మంగళవారం ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్‌కి శోభారాజు అన్నమాచార్యులు చిత్రపటాన్ని బహుకరించారు. శ్రీవారి ప్రతిమను అందజేసి శోభారాజుని గౌరవించారు. తెలుగు సంస్కృతి, సనాతన ధర్మం, ఆధ్యాత్మిక ప్రచారం, అన్నమయ్య సంకీర్తనా వైభవాన్ని భావితరాలకు అందించడంలో శోభారాజు చేస్తున్న సేవలను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు.

# తెలుగుజాతి గర్వించేలా అమరావతి

- 2028 నాటికి నిర్మాణాలు పూర్తి
- అద్భుతంగా మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాసాలు
- జోరుగా రాజధాని రహదారుల నిర్మాణాలు
- మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత

**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు జాతి గర్వించేలా రాజధాని అమరావతిని సీఎం చంద్రబాబు నిర్మిస్తున్నారని, 2028 ఆగస్టు నాటికి మొదటి విడత నిర్మాణాలు పూర్తి చేస్తామని రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఎస్.సవిత తెలిపారు. అబద్ధపు పునాదులపై ఏర్పడిన వైసీపీ ఆనాడు అమరావతి గ్రాఫిక్స్ అని తప్పుడు ఆరోపణలు చేసి పబ్బం గడుపుకుందన్నారు. గ్రాఫిక్స్‌కు, వాస్తవాలకు జగన్‌కు తేడా తెలియదా..? అని ప్రశ్నించారు. జగన్ విధ్వంసపు క్రెడిట్ ఎవ్వరికీ అక్కర్లేదని, తమ ప్రభుత్వానికి అభివృద్ధి అని స్పష్టం చేశారు. చదువు గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని, స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీలో చదువుకున్న మంత్రి నారా లోకేశ్ తో ఆయనకేంటి పోలికని ఎద్దేవా చేశారు. రాజధాని అమరావతి పనులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, ఎస్.సవిత మంగళవారం పరిశీలించారు. తొలుత మంత్రుల నివాసాలను తరవాత సచివాలయం, హెచ్ ఓడీ ఐకానిక్ టవర్లను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల టవర్లను పరిశీలించారు. ఇప్పటికే పూర్తయిన మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాసాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై మంత్రులు ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా తమను కలిసిన విలేకరులతో మాట్లాడారు.

ముందుగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, అబద్ధపు పునాదులపై ఏర్పడిన వైసీపీ అమరావతిలో గ్రాఫిక్స్ నిర్మాణాలంటూ తప్పుడు ప్రచారాలు చేసిందన్నారు. గ్రాఫిక్స్ కు, వాస్తవాలకు జగన్ కు తేడా తెలియదా..? అని ప్రశ్నించారు.



చదువు గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీలో చదువుకున్న ఉన్నత విద్యా వంతుడితో మంత్రి నారా లోకేశ్ తో ఆయనకు పోలికే లేదన్నారు. మంత్రి నారా లోకేశ్ ఎందుకు రాజీనామా చేయాలని వైసీపీనుద్దేశించి మంత్రి అనగాని ప్రశ్నించారు. విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చినందుకా... రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నందుకా? అని నిలదీశారు. మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ హితవు పలికారు. తెలుగుజాతి గర్వించేలా అమరావతి నిర్మాణాన్ని సీఎం చంద్రబాబు చేపట్టారని మంత్రి సవిత తెలిపారు. సచివాలయం, హెచ్ ఓడీ టవర్లతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాలు అద్భుతం నిర్మిస్తున్నారన్నారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాలు పూర్తయ్యాయని, ఈ నెల 15 తేదీన జీఏడీకి అప్పగించనున్నారని తెలిపారు. 2028 నాటికి సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ తదితర ఐకానిక్ భవనాల నిర్మాణాలను పూర్తి చేయబోతున్నామన్నారు. రాజధాని పనుల్లో ముఖ్యమైన రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ప్రజలకు అన్ని సేవలు ఒకేచోట లభించేలా సచివాలయం, హెచ్ ఓడీ కార్యాలయాలను నిర్మిస్తున్నామన్నారు. గతంలో హైటెక్ సిటీ సైబరాబాద్ ను నిర్మించిన సీఎం చంద్రబాబు నాయుడు అమరావతిని కూడా పూర్తి చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మంత్రి సవిత కొనియాడారు. ప్రపంచం మెచ్చేలా గ్రీన్ ఫీల్డ్ రాజధానిని సీఎం చంద్రబాబు నిర్మిస్తుండడం చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. జగన్ ది విధ్వంసం క్రెడిట్ అని, తమ ప్రభుత్వానికి అభివృద్ధి క్రెడిట్ అని అన్నారు. రప్పా రప్పా నరకడం, విధ్వంసం, దోపిడీ, అరాచకం ఇవి జగన్ క్రెడిట్ అని అన్నారు. ఆ క్రెడిట్ ను ఎవ్వరూ ఆశించరన్నారు. ప్రజలు ఛీ కొట్టడంతో ఇప్పుడు మావిగన్ అంటూ మరో డ్రామా ఆడుతున్నారన్నారు. మావిగన్ ఎక్కడుందో కూడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శించారు. నిరసనల పేరుతో రాష్ట్రంలో జగన్, వైసీపీ నాయకులు విధ్వంసం సృష్టిస్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మనమిత్ర ద్వారా సదరం స్లాట్ బుకింగ్ ఇక సరళతరం

**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు మరింత సులభంగా పొందడానికి వీలుగా ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రభుత్వం మరింత సరళతరం చేసింది. దివ్యాంగులు ఇకపై సదరం స్లాట్ బుకింగ్ కోసం మీ సేవా కేంద్రాలు, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా వారు తామున్న చోటు నుంచి కేవలం తమ మొబైల్ ఫోను ద్వారా ఇకపై ఈ పనులు నిర్వహించుకోవచ్చు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల ప్రకారం దివ్యాంగుల కొరకు సదరం సేవలను మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పొందే వీలు కల్పించినట్లు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) ఒక ప్రకటనలో తెలిపింది. దీనివల్ల దివ్యాంగులు ఇకపై సదరం స్లాట్ బుకింగ్, స్లాట్ లభ్యత సమయం, సర్టిఫికెట్ డౌనులోడు సేవల కోసం వారు ఏ కార్యాలయానికి వెళ్లనవసరం ఉండదు. వారున్న చోటు నుంచే తమ మొబైల్ ఫోనులోని మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా క్షణాల్లో ఈ పనులు చక్కబెట్టుకోవచ్చని ఆర్టీజీఎస్ అధికారులు తెలిపారు. ఎలా తెలుసుకోవచ్చు అంటే ముందుగా మీ మొబైల్ నంబరులోని వాట్సాప్ ఓపెన్ చేయాలిఅందులో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ..9552300009కు హాయ్ అని మెసేజ్ పంపాలి. తర్వాత మీకు మొబైల్ ఫోనులో కనిపించే సిటిజన్ సర్వీసుల్లో సదరం సర్వీసులను ఎంపిక చేసుకోవాలి. అందులో మీకు సదరం స్లాట్ అవైలబిలిటీ, సదరం స్లాట్ బుకింగ్, సదరం సర్టిఫికెట్ డౌన్ లోడు అనే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. అందులో మీకు ఏది అవసరమైతే దాన్ని ఎంపిక చేసుకోవాలి.అందులో మీరు స్లాట్ బుకింగ్ చేసుకోవాలనుకుంటే స్లాట్ బుక్ చేసుకోవచ్చు సదరం సర్టిఫికెట్ కావాలంటే మీరున్న చోటునుంచే సర్టిఫికెట్ డౌన్‌లోడు చేసుకోవచ్చు. దివ్యాంగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# మహిళలపై వేధింపులు తీవ్రమైన నేరం

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ పర్సన్ డా.రాయపాటి శైలజ





**అనంతపురం, ఆగస్టు 4 ప్రభాతవార్త బ్యూరో:** నేటి సమాజంలో స్టాకింగ్ (మహిళలపై వేధింపులు) నివారణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు గుర్తించాలని రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ డా.శైలజ తెలిపారు. మంగళవారం ఎస్.కె.యులోని ఇంజనీరింగ్ విభాగ సమావేశ మందిరంలో జాతీయ మహిళా కమిషన్ సహకారంతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళల వేధింపుపై వేధింపులు, స్టాకింగ్ (మహిళల వేధింపు) సైబర్ స్టాకింగ్ నివారణ అంశాలపై విద్యార్థినీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్మన్ శైలజ పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా అనంతపురం పిటిసి ప్రిన్సిపాల్ సుప్రజ, సీనియర్ ఏపీపీ ఎన్.సి.సంగీత, మానసిక నిపుణులు డా.సురేఖ, ఉమెన్ కమిషన్ సలహాదారులు సూయాజ్, ఐసిడిఎస్ పిడి సాజిదా బేగం, ఎస్కేయు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర తదితరులు అలాగే పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా పలువురు పారిశ్రామి కవేత్తలు మహిళలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్ పర్సన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ స్టాకింగ్ గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా స్టాకింగ్ అంటే ఎవరి ఇష్టానికి వ్యతిరేకంగా అయినా, వారిని నిరంతరం వెంబడించడం, గమనించడం, లేదా వారి ప్రమేయం లేకుండా వారి వ్యక్తిగత జీవితంలోకి చొరబడడానికి ప్రయత్నిం చడాన్ని స్టాకింగ్ అంటారని ఇది చట్టరీత్యా ఒక తీవ్రమైన నేరం అని పేర్కొన్నారు.

సమాజంలో చాలా మంది యువతులు మహిళలకు స్టాకింగ్ అంటే ఏమిటి అది ఏ ఏ రూపాల్లో జరుగుతుందో తెలియక వేధింపుల ను భరిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వ్యక్తి పదే పదే వెంబడించడం, వద్దని చెప్పిన ఆగకుండా మెసేజ్‌లు, ఫోన్ కాల్స్, గిఫ్టులు, లేఖలు పంపడం, సోషల్ మీడియా ద్వారా ఇబ్బంది పెట్టడం, ఫోన్ లేదా అకౌంట్లను హ్యాక్ చేయడం నకిలీ అకౌంట్లు సృష్టించి వేధించడం వంటి చర్యలన్నీ స్టాకింగ్ కిందకే వస్తాయని వివరించారు. గతంలో ఎక్కువగా ఫిజికల్ స్టాకింగ్ ఉండేదని, ప్రస్తుతం సైబర్ స్టాకింగ్ కేసులు వేగంగా జరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులు మొదట స్టాకింగ్‌ను గుర్తించడం, ఆధారాలను భద్రపరచడం, వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం ఎంతో ముఖ్యమని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న పిటిసి ప్రిన్సిపల్ సుప్రజ ఐపిఎస్ వివిధ కేస్ స్టడీలను వివరించారు. వివాహిత మహిళలు కూడా స్టాకింగ్ గురవుతున్నారని పేర్కొన్నారు. కొన్నిసార్లు ఈ వేధింపుల కారణంగా కుటుంబాలు విచ్ఛిన్నమవడం తీవ్ర మానసిక ఒత్తిడికి గురి కావడం ఆత్మహత్యలకు కూడా దారి తీసిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. అలాగే న్యాయవాదులు టాకింగ్ సంబంధించిన చట్టాలు ఫిర్యాదు చేస్తే అమలయ్య విధానాన్ని సీనియర్ ఏపీపీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే డా.సురేఖ సైకియాట్రిస్ట్ మాట్లాడుతూ.. బాధితుల్లో ఏర్పడే మానసిక ప్రభావాలపై విద్యార్థినీలకు అవగాహన కల్పించారు.

## డిగ్రీ అడ్మిషన్లకు గ్రీన్ సిగ్నల్

### నాలుగు నెలల ఆలస్యానికి తెర

### నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

### 126 కళాశాలల్లో 26,755 సీట్లు అందుబాటులో

**తిరుపతి(విద్య), ఆగస్టు 4 ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలై నాలుగు నెలలు గడిచినా డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్ జారీ కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అనిశ్చితిలో చిక్కుకున్నారు. ఎట్టకేలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయడంతో తిరుపతి జిల్లాలో సుమారు 30 వేల మంది విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. బుధవారం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుండగా, అడ్మిషన్ల ప్రక్రియకు మార్గం సుగమమైంది.

ప్రవేశాల షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు ఈ నెల 11వ తేదీ వరకు ఓఏఎండీసీ (ఆన్‌లైన్ అడ్మిషన్స్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్) ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. 15 నుంచి 19వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం ఉండగా, 20న వెబ్ ఆప్షన్లలో మార్పులు చేసుకునే వెసులుబాటు కల్పించారు. 26న మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్ల కేటాయింపు చేపట్టనుండగా, 27 నుంచి 29వ తేదీ వరకు విద్యార్థులు కేటాయించిన కళాశాలల్లో రిపోర్ట్ చేసి అదే రోజు నుంచి తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ ఏడాది కూడా గతంలో అమల్లోకి తీసుకొచ్చిన సింగిల్ మేజర్ విధానాన్నే కొనసాగిస్తూ ప్రవేశాలు చేపట్టనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ పీజీసెట్, లాసెట్, ఐసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌పై ఇప్పటికీ స్పష్టత లేకపోవడంతో ఉన్నత విద్యలో చేరాలనుకునే విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆయా కళాశాలల అధ్యాపకులు ఆన్‌లైన్‌లో నమోదు చేయనుండగా, ఇంకా దరఖాస్తు చేయని విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. సందేహాలు ఎదురైతే సమీప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.జిల్లాలో డిగ్రీ విద్యకు విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 17 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 104 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు, 5 టీటీడీ డిగ్రీ కళాశాలలు కలిపి మొత్తం 126 కళాశాలలు ఉన్నాయి. వీటిలో 21 విభాగాల్లో మొత్తం 26,755 సీట్లు అందుబాటులో ఉండగా, ఈ విద్యాసంవత్సరానికి ఆ సీట్ల భర్తీ ప్రక్రియ ఇప్పుడు ప్రారంభమైంది. దీంతో వేలాది మంది విద్యార్థులు తమ అభిరుచికి అనుగుణంగా కళాశాలలు, కోర్సులను ఎంపిక చేసుకునే అవకాశం లభించనుంది.

# ఘనంగా శ్రీచైతన్య కావూరి హిల్స్ జోన్ రోర్ వేడుకలు

**హైదరాబాద్, ఆగస్టు 4 ప్రభాతవార్త:** విద్యా రంగంలో నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవంతో ఘనమైన వారసత్వాన్ని కలిగిన శ్రీచైతన్య విద్యా సంస్థలు తమ కావూరి హిల్స్ జోన్ ఆధ్వర్యంలో రైజ్ ఆఫ్ అచీవర్స్ అండ్ రాక్ స్టార్స్ 2026 ఫ్రెషర్స్ డే వేడుకలు, ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ కాంపిటీషన్స్ మంగళవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు సాగిన ఈ వేడుక విద్యార్థులలో నూతన ఉత్సాహాన్ని, ఉన్నత లక్ష్యాల పట్ల కొత్త ఆకాంక్షలను రగిలించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన, సైబరాబాద్ డెప్యూటీ పోలీస్ కమిషనర్ రీతిరాజ్ హాజరయ్యారు. అతిథులు తమ ప్రసంగంలో... భవిష్యత్ విజేతలను తీర్చిదిద్దడంలో శ్రీచైతన్య విద్యాసంస్థలు పడుతున్న నిరంతర శ్రమను కొనియాడారు. శ్రీచైతన్య అందిస్తున్న ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థను విద్యార్థులు సరైన రీతిలో ఉపయోగించుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి పరీక్షలలో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతి ఏటా సాధిస్తున్న అద్భుతమైన విజయాలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఇటువంటి వేడుకలు కేవలం విద్యా ప్రయాణానికి ఆరంభంగా నిలవడమే కాకుండా, విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని నింపి ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు.ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రముఖ సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ తన ఉత్తేజపూరితమైన ప్రసంగంతో విద్యార్థులలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. ఓటమికి భయపడకుండా అనుకున్న లక్ష్యం దిశగా అడుగులు వేయాలని, యువత తమ కలలను నిజం చేసుకునే వరకు విశ్రమించకూడదని పిలుపునిచ్చారు. ఈ వేడుకలో శ్రీచైతన్య విద్యా సంస్థల



డైరెక్టర్లు ముఖ్య భూమిక పోషించి, విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. సుష్మా బొప్పన, అకాడమిక్ డైరెక్టర్, శ్రీచైతన్య విద్యా సంస్థలు మాట్లాడుతూ.. "జాతీయ స్థాయి ర్యాంక్‌లలోనూ, అగ్రశ్రేణి ఫలితాల్లోనూ కావూరి హిల్స్ జోన్ ఒక చిరునామాగా (హబ్) మారిందంటే, అది ఇక్కడి విద్యార్థుల శ్రమ, ఉపాధ్యాయుల నిరంతర తోడ్పాటు, టాప్ ర్యాంకులే లక్ష్యంగా రూపొందించిన ప్రోగ్రాముల ఫలితమేనని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో శ్రీచైతన్య విద్యార్థులు తమ గెలుపు జెండాను ఎగురవేస్తున్న తీరును గుర్తుచేశారు. విద్యార్థులంతా పక్కా ప్రణాళిక, ఆత్మవిశ్వాసంతో తమ గమ్యాల వైపు అడుగులు వేయాలని శ్రీచైతన్య కల్పిస్తున్న అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను సంపూర్ణంగా వినియోగించుకుని విజేతలుగా

వార్త

తక్కువ పదాలతో ఎక్కువ విషయాలు చెప్పడం మేధావుల లక్షణమైతే.. చెప్పేదేమీ లేకపోయినా ఎక్కువ పదాలు వినియోగించడం మూర్ఖుల లక్షణం.

న- కాల్టన్

# జాప్యం వలయంలో 'న్యాయం'!

భారత న్యాయవ్యవస్థ ముందు పెండింగ్ కేసుల సమస్య అతిపెద్ద సవాలుగా మారింది. న్యాయం వేగంగా అందినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. న్యాయ వ్యవస్థపై రోజురోజుకూ పెరుగుతున్న భారంతో కేసుల పెండింగ్ ఆందోళనకర స్థాయికి చేరుకుంది. జాతీయ న్యాయ డేటా గ్రిడ్ ప్రకారం దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టు, దేశంలోని 25 హైకోర్టులు, జిల్లా/అనుబంధ కోర్టులలో కలిపి జిల్లా, అనుబంధ కోర్టుల్లోనే దాదాపు 5.64 కోట్ల పెండింగ్ కేసులు పెండింగ్లో ఉన్నాయి. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో కూడా లక్షల సంఖ్యలో కేసులు విచారణ కోసం ఎదురుచూస్తున్నాయని నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ పేర్కొంది. కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌కు ఇచ్చిన తాజా సమాచారం ప్రకారం ప్రస్తుతం సుప్రీంకోర్టులో దశాబ్ద కాలం నాటి 10 వేలకుపైగా కేసులు, మూడు దశాబ్దాలకు చెందిన 80,660 కేసులు హైకోర్టులలో పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాయి. సుప్రీం కోర్టులో 96వేలకు పైగా కేసులు పెండింగ్లో ఉన్నాయని రాజ్యసభలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. అలాగే, 558 కేసులు 20యేళ్లకు పైగా పెండింగ్లో ఉండగా, అత్యున్నత న్యాయస్థానంలో 26 కేసులు 30 యేళ్లకు పైగా పరిష్కారం కాలేదని ఆయన వివరించారు. ఇది న్యాయవ్యవస్థలో పెండింగ్లో ఉన్న కేసుల తీవ్రతను తెలియజేస్తోంది. అన్ని రంగాల్లోనూ సంస్కరణలు జరుగుతున్నట్లు ప్రజాస్వామ్యంలో అతి ప్రధానమైన న్యాయ రంగాల్లోనూ సంస్కరణలు జరుగుతున్నా అవి ప్రజలకు చేరడంలోనూ ఎంతో జాప్యం అవుతోంది. జాప్యానికి కారణాలేమిటంటే కేసుల సంక్లిష్టత,సమర్థ పరిష్కారం ఆధారపడి ఉంటుందనిమేఘ్వాల్ అన్నారు. హైకోర్టులు, దిగువ న్యాయవ్యవస్థలో ఖాళీలు కొనసాగుతున్నాయి. న్యాయమూర్తులు, న్యాయాధికారులు, సహాయక సిబ్బంది లభ్యతతో సహా, తగినంత న్యాయ సిబ్బంది, మౌలిక సదుపాయాలపై కూడా కేసుల కాల పరిష్కారం ఆధారపడి ఉంటుందని కేంద్రం పేర్కొంది. భారతీయ కోర్టులలో పెరుగుతున్న ఖాళీల కారణంగానే పెద్ద సంఖ్యలో కేసులు పెండింగ్లో ఉన్నాయని తెలుస్తోంది. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. సీజేఐ సహా జడ్జీల సంఖ్యను 34 నుంచి 38కి పెంచేందుకు ఈ బిల్లును రూపొందించి తగినంత మంది కోర్టు సిబ్బంది, మౌలిక సదుపాయాల లభ్యతపై కూడా కేసుల సకాల పరిష్కారం ఆధారపడి ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం 25 హైకోర్టులలో మంజూరైన 1,122 మంది న్యాయమూర్తులకు గాను 341 న్యాయమూర్తుల ఖాళీలు ఉండగా, దిగువ న్యాయమూర్తులకు 7,311 ఖాళీలు కోర్టులలో మంజూరైన 30,868 మంది ఉన్నాయి. కేసుల పరిష్కార, వేగం ఖాళీలు కార్యాచరణ, విధానపరమైన అంశాలచే ప్రభావితమవుతుందని, కేంద్ర న్యాయశాఖ మంత్రి చెప్పారు. భారత రాజ్యాంగం ప్రతిపౌరుడికి హామీ ఇచ్చిన 'సకాలంలో న్యాయం' అనే ప్రాథమిక విలువను సాకారం చేయాల్సిన జాతీయ కర్తవ్యం. పెండింగ్ కేసులకు అనేక కారణాలున్నాయి. న్యాయమూర్తుల ఖాళీలు, కొత్త కోర్టుల కొరత, విచారణల్లో తరచూ వాయిదాలు, ప్రభుత్వశాఖలే అత్యధికంగా దావాలు వేయడం, దర్యాప్తు సంస్థల ఆలస్యం, సాక్షులు హాజరు కాకపోవడం, సాంకేతిక సిబ్బంది కొరత వంటి అంశాలు సమస్యను మరింత క్లిష్టం చేస్తున్నాయి. ప్రతి కేసు వెనుక ఒక కుటుంబం, ఒక బాధితుడు, ఒక వ్యాపారం లేదా ఒక పౌరుని హక్కు దాగి ఉంటుంది. న్యాయం కోసం సంవత్సరాల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. ప్రభుత్వం కూడా పార్లమెంట్లో ఇదే కారణాలను ప్రస్తావించింది. దేశంలో అత్యధిక జనాభా ఉన్న రాష్ట్రాల్లో కేసుల పెండింగ్ మరింత తీవ్రంగా ఉంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బీహార్,కర్ణాటక,గుజరాత్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో లక్షల నుంచి కోట్ల వరకు కేసులు పెండింగ్లో ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ఐదేళ్లకు పైగా పెండింగ్లో ఉన్న కేసుల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. అత్యంత ఆందోళనకర అంశం ఏమిటంటే, కొన్నికేసులు 20నుంచి30 సంవత్సరాలుగా కూడా తుది తీర్పు కోసం ఎదురుచూస్తున్నాయి. ఇటీవల వెల్లడైన వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా 20సంవత్సరాలకు పైగా పెండింగ్లో ఉన్న కేసుల సంఖ్య 11లక్షలకు మించిపోయింది. ఇది న్యాయవ్యవస్థ వేగంపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. అయితే ఆశాజనక పరిణామాలు కూడా ఉన్నాయి. న్యాయమూర్తుల నియామకాలను వేగవంతం చేయడం, ఖాళీలను భర్తీచేయడం, ప్రత్యామ్నాయవివాద పరిష్కార వ్యవస్థలు లోక్‌అదాలత్‌లను మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ వ్యాజ్యాలను తగ్గించడం,కేసుల నిర్వహణలో సమర్థత పెంచడం వంటి నిర్మాణాత్మక సంస్కరణలు అత్యవసరం.దర్యాప్తు సంస్థల ఆలస్యం, సాక్షులు హాజరు కాకపోవడం, ఫోరెన్సిక్ నివేదికలు ఆలస్యంగా రావడం, మౌలిక వసతుల కొరత వంటి అంశాలు కూడా విచారణను నెమ్మదింపజేస్తున్నాయి.భూవివాదాలు పరిష్కారం కాక రైతులు,పెట్టుబడిదారులు నష్టపోతారు. వాణిజ్య కేసులు ఆలస్యమైతే పరిశ్రమలు పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజ వేస్తాయి. క్రిమినల్ కేసుల్లో ఆలస్యం వల్ల బాధితులకు న్యాయం దూరమవుతుండగా, నిర్దోషులు కూడా సంవత్సరాల తరబడి విచారణను ఎదుర్కోవాల్సి వస్తుంది.జైళ్లలో విచారణ పూర్తికాకుండానే వేలాది మంది ఖైదీలు ఉండటం మరో పెద్ద సమస్య. ఇది మానవహక్కుల కోణంలో కూడా ఆందోళన కలిగించే అంశం. పెండింగ్ సమస్యను పరిష్కరించాలంటే తాత్కాలిక చర్యలు సరిపోవు. సమగ్ర సంస్కరణలు అవసరం.



ఎన్నో కష్టనష్టాలు అనుభవించిన తరువాత కానీ, మనిషికి వినయం, వివేకం రాదు.

ఫ్రాంక్లిన్



సమర్థులైనవారే ఎప్పుడూ నాయకత్వం వహిస్తారు. అందరికీ మార్గదర్శకులవుతారు.

రాధాకృష్ణన్

# ప్రజావాక్కు

### మారుతున్న జీవనశైలి

భారతీయుల్లో అధిక శాతం మంది రక్తంలోని కొవ్వు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారనివెల్లడించిన ఐసీఎంఆర్ నివేదిక ప్రతి ఒక్కరికీ ఒకహెచ్చరికగా భావించాలి. మారుతున్న జీవనశైలి, శారీరక శ్రమ తగ్గడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పెరుగుతున్న ఒత్తిడి, క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు చేయించుకోకపోవడం వల్ల గుండె జబ్బులు, పక్షవాతం వంటి సమస్యల ప్రమాదం పెరుగుతోంది. ముఖ్యంగా యువతలో కూడా ఈ సమస్యలు కనిపించడం ఆందోళన కలిగించే విషయం. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స చేయడం ఎంత ముఖ్యమో, వాటిని ముందుగానే నివారించడం కూడా అంతే అవసరం. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారకార్యక్రమాలునిర్వహించాలి. పాఠశాలలు, కార్యాలయాల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలి.క్రమంతప్పకుండా లిపిడ్‌పరీక్షలు చేయించుకోవడం,ప్రతిరోజూ వ్యాయామం చేయడం వంటి అలవాట్లు ఆరోగ్య పరిరక్షణకు దోహదపడతాయి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### విలువల పతనం

ఎన్నికల్లో ఓడిపోయినపార్టీకి చెందిన ఎమ్మెల్యే, ఎమ్.పి, మంత్రులు కిందిస్థాయి నాయకులు అధికారంలోకి వచ్చిన పార్టీలోకి క్యూ కడుతున్నారు. తమకు అవకాశం ఇచ్చి ప్రోత్సహించిన వారి పట్ల తమ రాజకీయ ఎదుగుదలకు కారణమైన వారిపట్ల ఏమాత్రం కృతజ్ఞత చూపకుండా వెన్నుపోటుపొడుస్తున్నారు.అన్నిరాష్ట్రాల్లో ఇలా జరగటం సర్వసాధారణమైపోయింది. వీరు క్షమార్హులు కాదు.

- మిథునం, హైదరాబాద్

### మన భాషను మనమే అభివృద్ధి చేయాలి

మన మాతృభాష తెలుగు ప్రాముఖ్యాన్ని పెంచే పుస్తక మహోత్సవాలు,భాషాభివృద్ధి సభలు జరుగుతున్న సందర్భాల్లో మనంహాజరుకాకపోవడం కన్నా దాన్ని మనం, మనపిల్లలు ఆంగ్లంతో పాటు మాతృభాష మరింత పట్టు వచ్చేట్లు ఇంటివద్ద నేర్పించాలి. ఉపాధి దృష్టిలో పరీక్షల కోసం ఆంగ్లం అవసరమైన ,తెలుగులో కూడా పరిజ్ఞానం విషయాలను మనస్సులో అర్థంచేసుకునేందుకు సులువుగా ఉంటుంది. దీనివల్ల అనువాద ప్రక్రియ సులువుగా ఉంటుంది. మన భాషను మనమే అభివృద్ధి చేయడం విద్యావంతులు, తల్లి తండ్రులు బాధ్యత వహించాలి.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

### 'సర్'పై దుష్ప్రచారం

మహాభారతంలో శకుని మాయపాచికలతో పాండవులను మోసం చేసి వారి రాజ్యాన్ని కాజేసినట్టు ఎన్నికలు వచ్చినప్పుడల్లా బిజెపి వాల్లు తమ అధికార బలాన్ని ఉపయోగించి తిమ్మిని బమ్మిని, బమ్మిని తిమ్మిని చేస్తూ ఓట్లను అటుఇటు చేస్తూ మొత్తానికి ఎలాగోలా తాము అనుకున్నది సాధిస్తున్నారు. తమ ప్రత్యర్థులను గెలవకుండా చేస్తున్నారు. వారిని శాశ్వత అజ్ఞాన వాసులుగా మారుస్తున్నారు. ఒక వంక నీతి న్యాయం, సనాతనధర్మం రాముడుదేవుడు అనే కబుర్లు చెబుతూ మరోవంక అధికారంకోసం అడ్డదారులు తొక్కుతున్నారు.

- శాస్త్రి, హైదరాబాద్

### పెరుగుతున్న వలసలు

మొరాకో నుండి స్పెయిన్ దేశానికి వలసలు వెల్లువలా కొనసాగుతున్నాయి. ఉపాధి లేక వాళ్ళుసముద్రాల ద్వారా స్పెయిన్ దేశానికి చేరుకుంటున్నారు. ఈ ఇదులాటలో 20 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఒక వైపు సంపన్న దేశాలు తమ ఉనికిని కాపాడుకోవడం కోసం చేసే ప్రయత్నం ఒకవైపు కొన్ని దేశాలు సంపన్న దేశాలుగా ఉండి తన స్థిరత్వం కోసం పోరాడుతున్నాయి. దేశాలు ఉపాధి కల్పించడం లో విఫలం అయినందువల్లే ఈవలసలు కొనసాగుతున్నాయి. ఎందుకంటే ఉపాధి అనేది మౌలిక సమస్య అది గుర్తించి తగు విధంగా చర్యలు తీసుకోవాలి. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమానికి చలించని ప్రభుత్వం ఇప్పుడెందుకు చలించింది.ఈ ఉద్యమంలో మధ్యతరగతి వర్గం పిల్లలు మాత్రమేకాదు వారి తల్లి దండ్రులు కూడాపాల్గొన్నారు.అదేవారికి కనువిప్పు అయింది.

- భారత అవినాష్, జనగామ

### ఉద్యమకారులకు ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలి

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ప్రజల్లో నుండి పౌరులను, ఉద్యమకారులుగా గుర్తించాలి. తెలంగాణ రాష్ట్ర సాధనఉద్యమంలో పౌరులు,మీడియా,రచనపరు, జర్నలిస్టులు, రిపోర్టర్లు, ఫోటోజర్నలిస్టులు, కెమెరామెన్‌లు, మీడియా యాజమాన్యాలు ఎన్నో కష్టనష్టాలను భరిస్తూ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ఉద్యమ స్ఫూర్తిని ప్రతి గ్రామానికి చేర్చడంలో, తెలంగాణఆకాంక్షను దేశవ్యాప్తంగా వినిపించడంలో అత్యంత కీలకమైన పాత్ర పోషించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ఉద్యమకారు పౌరులతోపాటు రచయితలు మీడియా కూడా ఒక ఉద్యమ శక్తిగా పనిచేశారు. ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగ భద్రత లేని పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటిచెప్పారు.

-సింగు. లక్ష్మీనారాయణ, కరీంనగర్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం ఏమిటి?

**అందరికీ సమాన నాణ్యతతో కూడిన విద్య, భూమి వంటి ఉత్పాదక వనరులపై న్యాయమైన ప్రాప్యత, వివక్ష లేని ఉపాధి, సంపదలో తీవ్రమైన అసమానతలు తగ్గిన ఆర్థిక వ్యవస్థ, అన్ని వర్గాలకు సహజమైన ప్రాతినిధ్యం, ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే రిజర్వేషన్ల అవసరం సహజంగానే తగ్గుతుంది. కానీ ఈ పరిస్థితులను సృష్టించకుండా రిజర్వేషన్లను మాత్రమే తొలగించడం అంటే వ్యాధిని అలాగే ఉంచి మందులు తీసేయడమే. అందుకే భారత ప్రజాస్వామ్యం ముందున్న అసలు సవాలు రిజర్వేషన్లను సమర్థించాలా వ్యతిరేకించాలా అనేది కాదు. సమానత్వాన్ని నిరంతరం వాయిదా వేస్తున్న సామాజిక నిర్మాణాన్ని మార్చగలదా లేదా అనేదే. రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం రిజర్వేషన్లను రద్దు చేయడం కాదు. వాటి అవసరాన్ని అనవసరం చేసే వ్యవస్థను నిర్మించడం.**

ఆయిరబోయిన బిక్షపతి

కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పేముందు ఆ ప్రశ్న సరైనదేనా అని అడగాలి ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ప్రతి చర్చ ఒకే విధంగా పుట్టదు. కొన్ని చర్చలు సమాజం అవసరం వల్ల వస్తాయి. మరికొన్ని రాజకీయాల అవసరం వల్ల వస్తాయి. ఈ రెండింటి మధ్య తేడా గుర్తించకపోతే సమాధానం ఎంత సరైనదైనా అది అసలు ప్రశ్న నుంచి తప్పించుకోవచ్చు. నేడు రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చ కూడా అలాంటిదే. పైకిచూస్తే అది ఒక విధానం గురించి చర్చలా కనిపిస్తుంది. కానీ కొంచెం లోతుగా చూస్తే అది భారత ప్రజాస్వామ్యం తన గురించి తాను వేసుకోవాల్సిన ఒక పెద్ద ప్రశ్నను తాకుతుంది. అదే 'సామాజిక న్యాయం పూర్తయిందా'? ఈ ప్రశ్నకు సమాధానం తెలియకుండా దాన్ని సాధించే విధానాలపై తీర్పు చెప్పడం అంటే గమ్యానికి చేరామో లేదో చూడకుండానే ప్రయాణాన్ని ఆపేయాలని నిర్ణయించడం లాంటిది. జర్మన్ తత్వవేత్త యుర్గన్ హెబెర్మాస్ ఆధునికతను ఒక అసంపూర్ణ ప్రాజెక్టుగా అభివర్ణించాడు. ఈ భావనలోని అసలు బలం ఒకే మాటలో ఉంది. అసంపూర్ణమంటే విఫలం అని కాదు. ఇంకా పూర్తి చేయాల్సిన బాధ్యత మిగిలి ఉందని అర్థం. ప్రతిఅసంపూర్ణ ప్రాజెక్టుకు ముందు రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి అది పూర్తి కాలేదు అని చెప్పి విఫలమైందని ప్రకటించడం. రెండోది ఎందుకు పూర్తికాలేదో అర్థం చేసుకొని దాన్ని పూర్తి చేసే బాధ్యతను స్వీకరించడం. భారత ప్రజాస్వామ్యం ముందు కూడా నేడు అదే ఎంపిక ఉంది. రిజర్వేషన్లపై చర్చ చివరికి ఆ ఎంపిక గురించే. రాజ్యాంగ నిర్మాతలు ఒక గొప్ప నైతిక సత్యాన్ని గుర్తించారు. చట్టం సమానత్వాన్ని ప్రకటించగలదు. కానీ చరిత్రను రద్దు చేయలేదు.ఎందుకంటే అసమానత అనేది కేవలం వర్తమాన సమస్య కాదు, వర్తమానంపై గతం చూపే ప్రభావం. అందుకే శతాబ్దాలుగా అవకాశాలకు దూరమైన వర్గాలకు ఇప్పటినుంచి అందరూ సమానం అని చెప్పడం న్యాయం కాదని వారు అర్థం చేసుకున్నారు. అందుకే సమానత్వాన్నీ కేవలం హక్కుల భాషలోనే కాదు అవకాశాల భాషలో కూడా నిర్వచించారు. రిజర్వేషన్లు ఆ తర్కం నుంచే పుట్టాయి. అవి ప్రత్యేక హక్కులు కాదు. చరిత్ర మూసివేసిన తలుపులను ప్రజాస్వామ్యం మళ్లీ తిరిగి రాయడానికి నిర్మించిన రాజ్యాంగబద్ధ వంతెన. ప్రపంచ ప్రజాస్వామ్యాల అనుభవం కూడా ఇదే చెబుతుంది. అమెరికా బానిసత్వం తర్వాత, దక్షిణాఫ్రికా అపార్థెయిడ్ తర్వాత, బ్రెజిల్ వర్ణ అసమానతల నేపథ్యంలో, కెనడా స్థానిక ప్రజల హక్కుల విషయంలో, న్యూజిలాండ్ మావోరీ ప్రజల రాజకీయ ప్రాతినిధ్యంలో. రూపాలు,పేర్లు వేరు కావచ్చు. కానీ ప్రతి సమాజం ఒకే సత్యాన్ని ఎదు ర్కొంది. చరిత్ర సృష్టించిన అసమానతులను మార్కెట్ స్వయంగా సరిచేయదు. పోటీ కూడా సరి చేయదు. అంద రికీ సమాన అవకాశం అనే నినాదం ఒకటే వాటిని తొలగిం చదు. ప్రజాస్వామ్యం కొన్నిసార్లు చరిత్రతో వాదించాల్సి వస్తుంది. ప్రత్యేక అవకాశాల విధానాలు ఆ వాదనలో భాగం. అవి సమానత్వానికి మినహాయింపులు కాదు. సమానత్వాన్ని వాస్తవం చేయటానికి ఉపయోగపడే మార్గాలు. రిజర్వేషన్లపై ప్రతి చర్చలో 'మెరిట్' అనే పదం తప్పనిసరిగా వినిపిస్తుంది. కానీ మెరిట్ అనేది అవకాశాల నుంచి వేరు చేసుకోగలిగే గుణం అయితే సమాజం ఎప్పుడో న్యాయబద్ధమై ఉండేది. నిజానికి మెరిట్ కూడా ఒక సామా



జిక నిర్మాణమే. ఒక పిల్లవాడు ఏ పాఠశాలలో చదివాడు, ఇంట్లో చదివే గదిఉందా, తల్లిదండ్రుల విద్యాస్థాయి ఏంటి, అతను ఆకలితో పాఠశాలకు వెళ్లాడా లేక ఆత్మవిశ్వాసంతో వెళ్ళాడా, కులం కారణంగా అవమానాన్ని ఎదుర్కొన్నాడా లేదా ఇవన్నీ అతని సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల ప్రతిభను మాత్రమే చూసి మెరిట్‌ను కొలవడం అంటే అవకాశాలను కల్పించినట్లు నటించడం. అసమాన ప్రారంభ రేఖలతో పందెం పెట్టి గెలిచిన వారిని ప్రతిభావంతులని ప్రకటించినట్టే. ప్రపంచానికి మరో నైతిక కొలమానం ప్రాతినిధ్యం. ప్రాతినిధ్యం రాజకీయ నినాదం కాదు. ప్రజాస్వామ్య నైతికత. న్యాయస్థానాల్లో, విశ్వవిద్యాలయాల్లో, శాసనసభల్లో, పరిపాలన వ్యవస్థలో,సమాజంలోని అన్ని వర్గాలు కనిపించాలి. ఎందుకంటే రాష్ట్రం కేవలం అధికారం నిర్మాణం కాదు. సమాజం తనను తాను చూసుకునేఅద్దం. ఆ అద్దంలో కొన్ని వర్గాలు మాత్రమే కనిపిస్తే మిగిలినవారికి ప్రజాస్వామ్యం ఒక వాగ్దానంగా మిగులుతుంది.అనుభవంగా మారదు. అందుకే ప్రాతినిధ్యం అనేది రాజకీయ రాయితీ కాదు. ప్రజాస్వామ్య నాణ్యతకు అవసరమైన షరతు.అయితే రిజర్వేషన్ల గురించి ఏ నిర్ణయానికైనా రాకముందు ఆషరతు నిజంగా నెరవేరిందా అనే కనీస ప్రాథమిక ప్రశ్నలనైనా మనకు మనమే వేసుకోవాలి. అది కులం మనిషి అవకాశాలను, ఆత్మ గౌరవాన్ని, జీవిత గమనాన్ని, ఏమాత్రం ప్రభావితం చేయడం లేదని ధైర్యంగా ప్రకటించగలమా? పుట్టుక కాదు ప్రతిభ మాత్రమే ప్రతి వ్యక్తి భవిష్యత్తును నిర్ణయిస్తుందని నిస్సందేహంగా చెప్పగలమా? మొత్తానికి సామాజిక న్యాయం పూర్తయిందని నిజంగా చెప్పగలమా? ఈ ప్రశ్నలు దీనికైనా నిజాయితీగా 'అవును' అని చెప్పగలిగితేనే రిజర్వేషన్ల అవసరం ముగిసింది అని చెప్పవచ్చు. లేకపోతేసమస్య ఇంకా కొనసాగుతుండగానే పరిష్కారం పూర్తయిందని ప్రకటించినట్లు అవుతుంది. ఇలాంటి సమయంలోనే రిజర్వేషన్లపై చర్చ మళ్ళీ రాజకీయ కేంద్రంగా మారడం గమనించదగిన విషయం. రాజకీయాలు ఎప్పుడు సమస్యలు మాత్రమే పరిష్కరించవు. ప్రజలు ఏ సమస్య గురించి మాట్లాడాలో కూడా నిర్ణయిస్తాయి. నిరుద్యోగం, పరీక్షల నిర్వహణ, విద్యాసంక్షోభం, పెరుగుతున్న అసమానతలు చర్చలో ఉన్న ఈ సమయంలో రిజర్వేషన్లను కేంద్ర అంశాలుగా నిలబెట్టడం వెనుక రాజకీయ సందర్భాన్ని విస్మరించడం కష్టం. రిజర్వేషన్ల పట్ల విముఖతను వ్యక్తం చేస్తూ వచ్చిన రాజకీయ సైద్ధాంతిక వైఖరి నేపథ్యంలో ఈ చర్చను విశ్లేషించడం సహజమే. అయితే రాజకీయ ఉద్దేశం ఏదైనా కావచ్చు. కానీ సమాజం అడగాల్సిన ప్రశ్న మాత్రం వేరే. 'రిజర్వేషన్ల స్థానంలో సామాజిక న్యాయాన్ని మరింత సమర్థంగా సాధించే వ్యవస్థ ఏమిటి'? ఈ ప్రశ్నకు సమాధానం ఇప్పటివరకు స్పష్టంగా వినిపించలేదు. ఎందుకంటే ప్రత్యామ్నాయం అనేది ఒక నినాదం కాదు. ఒక సామాజిక నిర్మాణం. కులం అవకాశాలను నిర్ణయించనీ సమాజం. అందరికీ సమాన నాణ్యతతో కూడిన విద్య. భూమి వంటి ఉత్పాదక వనరులపై న్యాయమైన ప్రాప్యత. వివక్ష లేని ఉపాధి. సంపదలో తీవ్రమైన అసమానతలు తగ్గిన ఆర్థిక వ్యవస్థ, అన్ని వర్గాలకు సహజమైన ప్రాతినిధ్యం, ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే రిజర్వేషన్ల అవసరం సహజంగానే తగ్గుతుంది. కానీ ఈ పరిస్థితులను సృష్టించకుండా రిజర్వేషన్లను మాత్రమే తొలగించడం అంటే వ్యాధిని అలాగే ఉంచి మందులు తీసేయడమే. అందుకే భారత ప్రజాస్వామ్యం ముందున్న అసలు సవాలు రిజర్వేషన్లను సమర్థించాలా వ్యతిరేకించాలా అనేది కాదు. సమానత్వాన్ని నిరంతరం వాయిదా వేస్తున్న సామా జిక నిర్మాణాన్ని మార్చగలదా లేదా అనేదే. రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం రిజర్వేషన్లను రద్దు చేయడం కాదు. వాటి అవసరాన్ని అనవసరం చేసే వ్యవస్థను నిర్మించడం. కానీ ఆ సమాజాన్ని నిర్మించే దిశగా మనం నిజంగా ప్రయాణిస్తున్నామా? లేక రిజర్వేషన్లనే ప్రశ్నిస్తూ వాటిని అనివార్యం చేసిన సామాజిక నిర్మాణాన్ని యథాతథంగా కొనసాగిస్తున్నామా? భారత ప్రజాస్వామ్యం చివరికి సమాధానం చెప్పాల్సింది ఈ ప్రశ్నకే. •

# ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ రానున్నదా?


దాడిశెట్టి శ్యామ్ కుమార్

విద్యా వ్యవస్థలో ఆధునిక పోకడలకు అనుగుణంగా ప్రభుత్వాలు విద్యపై ప్రత్యేక దృష్టి సారించడం తద్వారా ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే రీతిలో రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యావిధానం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందనే భిన్నాభిప్రాయాలు లేకపోలేదు. ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు విద్యావిధానంలో బోధనా అభ్యసనంలో విద్యార్థుల ప్రగతికి తోడ్పడే విధంగా తెలుగు,ఇంగ్లీష్ మాధ్యమాల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశలో ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఉండడం గమనార్హం. విద్యలో డిజిటల్ విద్యా విధానం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించడం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను ఆకర్షించే రీతిలో ఉంటున్నాయని అనిపిస్తుంది. విద్యార్థులకు విశాలమైన ఆట స్థలాలు మౌలిక సదుపాయాలు మెరుగైన శానిటేషన్ వ్యవస్థ, త్రాగునీరు, మధ్యాహ్న భోజనంతోపాటు కొన్ని రాష్ట్రాలు పైలెట్ ప్రాజెక్టుగాఅల్పాహారం అందిస్తున్న క్రమంలో ఉపాధ్యాయులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయడం విద్యార్థులు తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలపై తమ పిల్లలపై శ్రద్ధ వహించే రీతిలో ప్రభుత్వ పాఠశాలలు ఉంటున్నాయనే భావన కల్పించే రీతిలో ప్రధానంగా విద్యాశాఖను నిర్వహిస్తున్నటువంటి మంత్రులు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను సమాజం గుర్తించే విధంగా రాజకీయాలకతీతంగా తోడ్పాటు అందిస్తుండడంతో అన్నివర్గాల ప్రజలు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించడానికి ఆసక్తిని కనబరుస్తున్నారు అనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి విద్యా కమిటీలు గ్రామయువజన సంఘాలు స్థానికంగా ఉన్నటువంటి విద్యార్థులతల్లిదండ్రులు ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థుల నమోదుఉంటేనే భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాల మనుగడకు అవకాశం ఉంటుందనే విషయ అవగాహన చేసుకోవాలి. స్థానికంగాఉండే ప్రభుత్వ పాఠశాలను మెరుగుపరుచుకునే రీతిలో ప్రభుత్వ పథకాలను సాధ్యమైనంతగా వినియోగించుకుంటూ బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలవైపు మొగ్గుచూపే విధంగా ఉపాధ్యాయులు, విద్యా కమిటీలు సంయుక్త సహకారంతో బడిబాట లాంటి కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు విద్యార్థులను అధిక సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు చేర్పించి నాణ్యమైన విద్యను అందించే విధానంలో బాధ్యతాయుతమైన పాత్రను మరింత పోషించాల్సి ఉంది. ఈ క్రమంలో సమాజంలోని వారందరూ ఆర్థికస్తోమతతో నిమిత్తం లేకుండా తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే రాబోవు కాలంలో ప్రవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు ఉచితమైన నాణ్యమైన విద్యా విధానం ప్రతి ఒక్కరికి పూర్తిస్థాయిలో అందుతుందని అనుకునేవారు లేకపోలేదు. విద్యావ్యవస్థలో వస్తున్న మార్పుల గురించి అవగాహనతో ఉన్న సంబంధిత శాఖఅధికారులు, మంత్రులు ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నతమైన విద్యా బోధనను విద్యార్థులకు అందించే రీతిలో ఏర్పాటైన విద్యా కమిటీలు కూడా ప్రభుత్వంతో సమన్వయంగా ఉంటూ ఆశించిన స్థాయిలో విద్యా సంస్కరణల అమలు విధానాల పైన ఎప్పటికప్పుడు స్పందిస్తూ విద్యావిధానంలో ఎదురయ్యే సమస్యలపై విభిన్న కోణాల్లో ఆలోచిస్తూ ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులకు ఆధునిక బోధనా విధానాలను అమలుపరచడంలో సఫలీకృతం కావడానికి మరింత ప్రయత్నించాలి అని కోరుకునే వారు లేకపోలేదు. అంతేకాకుండా సంబంధిత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో ఆధునిక నూతన భావనలను కలిగించడానికి శాస్త్రసాంకేతిక విద్యపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవడానికి ప్రభుత్వ విద్యారంగంలో అన్నిపాఠశాలలో క్రమక్రమంగా సాంకేతిక ఉపకరణాలు వినియోగించుకునే అవకాశంఉండడంతో సంబంధిత ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణఇస్తుండటంతో రాబోవు కాలంలో ప్రభుత్వ పాఠశాలలు మరింత ఆధునికతను సంతరించుకుంటాయి అనిఅనిపిస్తుంది.విద్యారంగ అభివృద్ధికి ఎమ్మెల్సీల పాత్రకూడా చాలా ముఖ్యమైనది. రాజకీయాలకతీతంగా రాష్ట్రాల్లో విద్యను ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధానంలో విద్యా శాఖకు సంబంధించి శాసనమండలి సభ్యులు కూడా చాలా వరకు ప్రభుత్వ పాఠశాలలో నూతన సంస్కరణల విషయంలో ప్రభుత్వానికి సలహాలుసూచనలు ఇస్తూనే ఎదురవుతున్న సమస్యలపై మరింత ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈక్రమంలో తరచూ ఉపాధ్యాయ సంఘాలు ఎమ్మెల్సీలు ప్రభుత్వపాఠశాల బలోపేతానికి కావలసినఅంశాలపై వీలైనప్పుడల్లా సంబంధిత విద్యాశాఖతో చర్చ జరుపుతూ ఉండడం రాబోకాలంలో ప్రభుత్వ పాఠశాల విద్య మరింత బలోపేతం కావడానికి అవకాశం ఉంటుంది. •

# ఇథనాల్ మిశ్రమ పెట్రోలు ఎంతవరకు మేలు?

తిప్పర్తి శ్రీనివాస్

దేశ అభివృద్ధికి ఇంధనం ఎంత ముఖ్యమో, ఇంధన భద్రత అంతకంటే ముఖ్యమైనది. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు రాజకీయ, ఆర్థిక పరిణామాలకు అనుగుణంగా తరచూ మారుతూ ఉంటాయి. చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడే భారతదేశం వంటి దేశానికి ఈ పరిస్థితి తీవ్రమైన సవాలుగా మారుతోంది. ఇలాంటి సమయంలో ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్నిప్రోత్సహించడం కేంద్ర ప్రభుత్వానికి ఒక వ్యూహాత్మక అవసరంగా మారింది. ఈ క్రమంలోనే పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపివినియోగించే విధానాన్ని ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోంది. అయితే ఈ నిర్ణయం దేశ ప్రయోజనాలకు ఎంత వరకు ఉపయోగపడుతుంది? వినియోగదారులపై దీని ప్రభావం ఏమిటి? అనే అంశాలపై సమగ్ర చర్చ అవసరం. ఇథనాల్ అనేది చెరకు, మొక్కజొన్న, విరిగిన బియ్యం, ఇతర ధాన్యాలు, అలాగే వ్యవసాయ అవశేషాల నుంచి తయారయ్యే జీవ ఇంధనం. పెట్రోల్‌లో దీనిని నిర్దిష్ట శాతంలో కలిపి వినియోగిస్తారు. ప్రస్తుతం ఇ10, ఇ20 వంటి మిశ్రమ ఇంధనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. అంటే వరుసగా 10 శాతం, 20 శాతం ఇథనాల్ కలిగిన పెట్రోల్ అన్నమాట. ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పటికే ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాయి. భారత్ కూడా ఇంధన దిగుమతుల వ్యయాన్ని తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను నియంత్రించడం, రైతులకు అదనపు ఆదాయం కల్పించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌కు ఉన్న ప్రధాన ప్రయోజనం విదేశీ చమురుపై ఆధారపడటాన్నితగ్గించడమే. ప్రతి సంవత్సరం ముడి చమురు దిగుమతుల కోసం దేశం లక్షల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యాన్ని వెచ్చిస్తోంది. పెట్రోల్‌లో కొంత భాగాన్ని దేశీయంగా ఉత్పత్తి చేసిన ఇథనాల్‌తో భర్తీచేయడం ద్వారా ఆ వ్యయాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనం మాత్రమే కాదు,ఇంధన భద్రతను బలోపేతం చేసే చర్య కూడా.అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగినా, దేశీయ ఇంధన సరఫరాపై కొంత మేర ప్రభావం తగ్గుతుంది. వ్యవసాయ రంగానికి కూడా ఈ విధానం కొత్త అవకాశాలను తెరుస్తోంది. చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు అదనపు డిమాండ్ ఏర్పడటం వల్ల రైతులకు మార్కెట్ విస్తరిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇథనాల్ ఉత్పత్తి పరిశ్రమలు ఏర్పడితే ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. రైతుల ఆదాయా న్ని పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ఇది ఒక ముఖ్యమైన అడుగుగా చెప్పవచ్చు. పర్యావరణ పరిరక్షణ కోణంలో చూస్తే కూడా ఇథనాల్ మిశ్రమ ఇంధనం కొంత మేర ప్రయోజనకరమే. పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్ దహ నం సమయంలో కొన్ని హానికర ఉద్గారాలు



తగ్గుతాయి. వాతా వరణ మార్పులను నియంత్రించేందుకు ప్రపంచ దేశాలు చేస్తున్న ప్రయత్నాల్లో ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగం కీలకంగా మారింది. ఆ దిశగా భారతదేశం తీసుకుంటున్న ఈ చర్యను సానుకూలంగానే చూడాలి. అయితే ఈ విధానానికి విమర్శలు కూడా లేకపోలేదు. ఇథనాల్‌లో శక్తిసాంద్రత పెట్రోల్ కంటే తక్కువగా ఉం టుంది. అందువల్ల కొన్ని వాహ నాల్లో మైలేజ్ స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. సాధారణ వినియోగదారుడు ముందుగా గమనించే అంశం ఇదే. ఇంధనం ఆదా అవుతుందని భావించిన చోట, ఎక్కువ ఇంధనం వినియోగించాల్సి వస్తే అసంతృప్తి సహజం. కాబట్టి ఈ విషయంపై ప్రభుత్వం, ఆయిల్ కంపెనీలు పారదర్శకంగా సమాచారం అందించాల్సిన బాధ్యత ఉంది. ప్రస్తుతం తయారవుతున్న అనేక కార్లు, ద్విచక్ర వాహనాలు ఇ20 ఇంధనానికి అనుగుణంగా రూపొందించ బడుతున్నాయి. కానీ పది లేదా పదిహేనేళ్ల క్రితం తయారైన వాహనాల్లోని కొన్ని రబ్బరు భాగాలు, సీల్స్, ఫ్యూయల్ పంపులు అధిక ఇథనాల్ మిశ్రమాన్ని తట్టుకునేలా ఉండకపోవచ్చు. ఇలాంటి వాహనాల్లో దీర్ఘకాలం అధిక ఇథనాల్ కలిగిన పెట్రోల్ ఉపయోగిస్తే నిర్వహణ వ్యయం పెరిగే అవకాశాన్ని పూర్తిగా తోసిపుచ్చలేం. అందువల్ల తయారీ సంస్థ సూచనలను పాటించడం అత్యంత అవసరం. ప్రభుత్వం కూడా ఈ మార్పును ప్రజలపై బలవంతంగా మోపకుండా, అవగాహనతో అమలు చేయాలి. ఏ వాహనాలు ఇ-20కు అనుకూలం? పాత వాహనాల యజమానులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి? మైలేజ్‌లో ఎంత మార్పు రావచ్చు? వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానా లు ఇవ్వాలి. ప్రజల్లో అవగాహన పెరిగితే అపోహలు తగ్గుతాయి. లేకపోతే సాంకేతిక కారణాల కంటే పుకార్లే ఎక్కువ ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఇథనాల్ ఉత్పత్తి విష యంలో కూడా సమతుల్య దృష్టి అవసరం. ఆహార పంటలను అధికంగా ఇంధన ఉత్పత్తికి మళ్లిస్తే భవిష్యత్తులో ఆహార భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉంది. కాబట్టి వ్యవసాయ వ్యర్థాలు, బయోమాస్, ఇతర రెండో తరం ముడిపదార్థాల నుంచి ఇథనాల్ ఉత్పత్తిని ప్రోత్సహించడం మరింత స్థిరమైన పరిష్కారం అవుతుంది. ఇది రైతులకు, పర్యావరణానికి, దేశ ఆర్థికవ్యవస్థకు దీర్ఘకాలంలో మరింత మేలు చేస్తుంది. మొత్తంగా చూస్తే, ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ అనేది దేశఇంధన విధానంలో ఒక ముఖ్యమైన సంస్కరణ. దీనిని కేవలం మైలేజ్ కోణంలో మాత్రమే అంచనా వేయడం సరైందికాదు. అలాగే జాతీయ ప్రయోజనాల పేరుతో వినియోగదారుల ఆందోళనలను విస్మరించడం కూడా సమంజసం కాదు. దేశ ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ, రైతుల సంక్షేమం, వాహనదారుల విశ్వాసం ఈ నాలుగు అంశాల మధ్య సమతుల్యత సాధించినప్పుడే ఈ విధానం ఆశించిన ఫలితాలను ఇస్తుంది. ఇంధన స్వావలంబన ఒక్కరోజులో సాధ్యమయ్యే లక్ష్యం కాదు. అది సాంకే తికత, శాస్త్రీయ ప్రణాళిక, ప్రజల సహకారం, పారదర్శక పాలన అనే నాలుగు స్తంభాలపై నిలబడాలి. ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ ఆ ప్రయాణంలో ఒక కీలక అడుగు. ఆ అడుగు ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ ముందుకు సాగితేనే అది నిజమైన విజయంగా

# క్రెడిట్ చోరీ..అనే వింత జబ్బుతో బాధపడుతున్న జగన్: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు 4, (ప్రభాతవార్త): ఎల్ నినో ప్రభావంతో బియ్యం ధరలపై ప్రజలు ఆందోళన చెందాల్సిన పనిలేదని, బియ్యం సహా, ఇతర నిత్యావసరాల పెరుగుదల నియంత్రణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. సోమవారం ఆయన చిలకలూరిపేట రైతు బజార్ లో ప్రభుత్వరైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సబ్సిడీ బియ్యం విక్రయకేంద్రాన్ని ప్రారంభించారు.



తెల్లరేషన్ కార్డుదారులకు స్వయంగా బియ్యం పంపిణీ చేసిన అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు. అవినీతి సంపాదన.. అసత్యాల మీడియాను అడ్డుపెట్టుకొని జగనే ప్రభుత్వ విజయాల్ని క్రెడిట్ చోరీ చేస్తున్నాడు మాజీ ముఖ్యమంత్రి జగన్.. ఈ మధ్య క్రెడిట్ చోరీ అనే వింతజబ్బుతో బాధపడుతున్నారని, ఇతరుల మంచి, గొప్పతనాన్ని తనవిగా చెప్పుకోవడం ఆ జబ్బు ప్రధాన లక్షణమని ఎమ్మెల్యే ప్రత్తిపాటి ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడా జరగని విధంగా ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయ ఖ్యాతి మొత్తం తనదేనని జగన్ నిస్సిగ్గుగా చెప్పుకుంటున్నారని, అసలైన క్రెడిట్ చోరీ జగనే చేస్తున్నాడన్నారు. చేతిలోని అవినీతి సంపాదనతో అనుకూల మీడియా, అసత్యాల సోషల్ మీడియాలో ప్రభుత్వ విజయాలను తనవిగా దుష్ప్రచారం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాడని ప్రత్తిపాటి మండిపడ్డారు. భోగాపురం విమానాశ్రయం విషయంలో తానున్నప్పుడే అన్నీ చేశానని, కోర్టుకేసుల్ని తొలగించానని జగన్ చెప్పడం.. పచ్చి అబద్ధమన్నారు. రెండేళ్లుగా చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ లు రాష్ట్రం కోసం పడుతున్న కష్టాన్ని, మోదీ అందిస్తున్న సహకారాన్ని ప్రజలు గమనిస్తున్నారని ప్రత్తిపాటి తెలిపారు. జగన్ వైఫల్యాల్ని బీజేపీ ఎత్తిచూపుతున్నా..... వైసీపీ నేతలు సిగ్గులేకుండా విమర్శలు చేస్తున్నారన్నారు. జగన్.. వైసీపీనేతలు ఇప్పటికైనా పరుల కష్టాన్ని తమదిగా చెప్పుకోవడం మానుకోవాలని ప్రత్తిపాటి హితవుపలికారు. చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమంలో రాకెట్ స్పీడ్ లో దూసుకెళ్తున్న రాష్ట్రాన్ని చూసి మోదీ గర్విస్తుంటే.. జగన్, వైసీపీనేతలు అసూయ చెందడం సిగ్గుచేటన్నారు. ప్రత్తిపాటి ఆసహనం వ్యక్తం చేశారు. బియ్యం ధరలపై ఆందోళన చెందాల్సిన పనిలేదు.. ఎల్ నినో దృష్ట్యా వరిసాగు మందగించిన నేపథ్యంలో బహిరంగ మార్కెట్లో బియ్యం ధరలు పెరుగుతున్నాయని ఆందోళన అవసరం లేదని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని ప్రత్తిపాటి చెప్పారు. మార్కెట్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టిందని, బియ్యంతో పాటు, ఇతర నిత్యావసరాల ధరలు పెంపుదలపై ప్రత్యేక నిఘా పెట్టిందని ప్రత్తిపాటి తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, ముల్లా కరిముల్లా, మురకొండ మల్లిబాబు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# జూనియర్ వైద్యుల స్టైపెండ్ పెంపునకు ప్రభుత్వ వైద్యుల సంఘం మద్దతు

## ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి

గుంటూరు మెడికల్ , ఆగస్టు 4 ప్రభాతవార్త: రాష్ట్రంలోని జూనియర్ వైద్యుల స్టైపెండ్ పెంపు డిమాండ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం (ఏపీజీడీఏ) బహిరంగ మద్దతు ప్రకటించింది. జూనియర్ వైద్యులు వ్యక్తం చేస్తున్న డిమాండ్లు పూర్తిగా న్యాయమైనవేనని పేర్కొంటూ, ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. డి. జయధీర్ బాబు, ప్రధాన కార్యదర్శి డా. బి. రమేష్ సంయుక్తంగా వినతిపత్రం సమర్పించారు. వినతిపత్రంలో ఆంధ్రప్రదేశ్‌లో జూనియర్ వైద్యులకు అందుతున్న స్టైపెండ్, తెలంగాణ, కర్ణాటక వంటి పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే గణనీయంగా తక్కువగా ఉందని తెలిపారు. అయితే రాష్ట్రంలో జూనియర్ వైద్యులు నిర్వర్తిస్తున్న విధులు, పని భారం మాత్రం ఇతర రాష్ట్రాలకు ఏమాత్రం తీసిపోవడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో స్టైపెండ్ పెంపుపై ప్రభుత్వం ఆలస్యం చేయకుండా సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. అలా చేస్తే ప్రతిపాదిత ఆందోళనను నివారించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. జూనియర్ వైద్యుల న్యాయమైన డిమాండ్లకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైద్యుల సంఘం సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేసిన సంఘం, భవిష్యత్తులో ఏపీ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీజూడా) తీసుకునే న్యాయమైన నిర్ణయాలకు కూడా తమ సహకారం కొనసాగుతుందని తెలిపింది.

# కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఉద్యోగుల మద్దతు

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్4, ప్రభాతవార్త: కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌ల రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం 16వ రోజుకు చేరుకున్నాయి. విశ్వవిద్యాలయాల్లో బోధన చేస్తున్న రాష్ట్రంలోని ఆల్ యూనివర్సిటీ కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్



పిలుపుమేరకు శాంతియుత ఆందోళన నిర్వహిస్తున్నారు. యూజిసి పే స్కేల్స్ అమలు చేయాలి.. సమాన పనికి సమానవేతనం ఇవ్వాలి.. రాష్ట్ర ప్రభుత్వం 2023 జూన్‌లో ఇచ్చిన జీఓ ఎంఎస్.నెం.20ను రద్దుచేయాలని కోరుతున్నారు. మంగళవారం ఏఎన్‌యులోని దినసరి వేతన ఉద్యోగుల సంఘం రిలే దీక్షలు చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లకు మద్దతు తెలిపారు. వారిన్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, పరిష్కరించాలని కోరారు.

# టైం స్కేల్ కోరుతూ కోర్టుకు ఏఎన్‌యు ఉద్యోగులు

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం, ఆగస్ట్4, ప్రభాతవార్త: ఏఎన్‌యులో డైలీవేజ్ వర్కర్‌లుగా విధులు నిర్వహిస్తున్న 39మంది ఉద్యోగులు కోర్టును ఆశ్రయించారు. తాము ఎన్నో సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్నామని, తమకు టైం స్కేల్ విధానం అమలు చేయాలని కోరారు. దీనిపై కోర్టు నుంచి యూనివర్సిటీకి నోటీసులు అందాయి. నోటీసులపై వర్సిటీ అధికారులు సమాధానం ఇవ్వాల్సి ఉంది. వర్సిటీలో దాదాపు 360మంది వరకు డైలీవేజ్ విధానంలో విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా ఒకేసారి కోర్టును ఆశ్రయిస్తే అంతమందికి టైం స్కేల్ ఇవ్వడం కష్టసాధ్యమని ఆలోచించి 39మంది వరకు మాత్రమే కోర్టును ఆశ్రయించినట్లు తెలిసింది.

# వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సు

ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయం,ఆగస్ట్4, ప్రభాతవార్త: ఏఎన్‌యులో ఎంబిఏ హాస్పటల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం రెగ్యులర్ విధానంలో సాయంకాలం కోర్సును ప్రారంభిస్తున్నట్లు వీసి ఆచార్య కె.గంగాధరరావు తెలిపారు. ఈమేరకు కోర్సులో ప్రవేశాలకు



సంబందించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి ఆచార్య బట్టు నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య యూనివర్సిటీతో కలిసి ఈ కోర్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్ఇపి 2020లో భాగంగా డిగ్రీ అర్హత, ఇండస్ట్రీలో రెండేళ్ళ అనుభవం ఉన్నవారు, ప్రభుత్వ, ప్రవేట్ రంగాలలో డాక్టర్‌లు, పారా మెడికల్ సిబ్బంది కూడా ఈ కోర్సులు చేరవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంలో ఓఎస్‌డి ఆచార్య రవికుమార్, సిడిసి డీన్ ఆచార్య వి.రవికుమార్ విభాగం అధ్యాపకులు డాక్టర్ పి.శ్రీనివాస్, డాక్టర్ చడుండి ప్రసాద్, డాక్టర్ సాధిక్ సయ్యద్, డాక్టర్ శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు వార్త



# తెనాలి పట్టణాభివృద్ధికి 10 కోట్లతో అభివృద్ధి పనులు: మంత్రి మనోహర్

తెనాలి మున్సిపాలిటీ ఆగస్టు 4(ప్రభాతవార్త): తెనాలి మున్సిపాలిటీని ఆధునిక నగరంగా తీర్చిదిద్దడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి, తెనాలి శాసనసభ్యులు నాదెండ్ల మనోహర్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,అభివృద్ధి విషయంలో ఎలాంటి వెనుకడుగు వేయకుండా, ఆర్థిక పరిమితులు



ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ తో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ పట్టణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పట వరకు తెనాలి మున్సిపాలిటీలో జనరల్ ఫండ్స్ ద్వారా రూ.55 కోట్లతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లు, కల్వర్టులు, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధి చేపట్టినట్లు పేర్కొన్నారు. అదనంగా 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా రూ.26 కోట్ల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఇటీవల సీఆర్డీఏ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రూ.10 కోట్లు మంజూరు చేసిందని, ఈ నిధులతో సుమారు 32 అభివృద్ధి పనులు, ముఖ్యంగా సీసీ రోడ్లు మరియు డ్రైనేజీ పనులు తక్షణమే ప్రారంభించనున్నట్లు తెలిపారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పాత తెనాలి మున్సిపల్ కార్యాలయ భవనం కూల్చివేత ప్రక్రియను ప్రారంభిస్తున్నామని, ఇందుకు సంబంధించిన టెండర్లను మంగళవారం తెరిచి పారదర్శకంగా కూల్చివేత చేపడతామని చెప్పారు. అనంతరం పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో ఆధునిక మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పట్టణ పారిశుధ్యానికి మరింత ప్రాధాన్యత ఇస్తూ 32 కొత్త చెత్త సేకరణ ఆటోలను అందుబాటులోకి తీసుకువస్తున్నామని, దోమల నివారణ కోసం ప్రస్తుతం ఉన్న ఒక ఫాగింగ్ యంత్రానికి అదనంగా మరో నాలుగు ఫాగింగ్ యంత్రాలను సమకూర్చి, పట్టణాన్ని నాలుగు జోన్లుగా విభజించి ప్రతిరోజూ ఫాగింగ్ నిర్వహించేలా కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. తెనాలి పట్టణాన్ని విజయవాడ, గుంటూరు నగరాలకు పోటీగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని పేర్కొన్న మంత్రి, ప్రణాళికాబద్ధంగా మౌలిక సదుపాయాల అభివృద్ధి కొనసాగుతోందన్నారు. తెనాలి–కొలెవరం–ఆటోనగర్ మార్గంలో సెంట్రల్ డివైడర్‌పై వీధి దీపాల ఏర్పాటు పూర్తయిందని, రూ.25 లక్షలతో రహదారి మరమ్మతు పనులు ఈ వారంలో ప్రారంభమవుతాయని తెలిపారు. అనంతరం డివైడర్‌లో మొక్కలు నాటి పట్టణాన్ని మరింత సుందర నగరంగా తీర్చిదిద్దుతామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

# మన ఇంటికి మన నసీర్... కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఆగస్టు 4,ప్రభాతవార్త :ఒక వైపు రైతులను కిడ్నాప్ లు చేసిన వారిని వెనకేసుకొస్తూ.. మరో వైపు అన్నదాతలను పరామర్శల పేరిట మోసగించడం ఎంత వరకు సమంజసం జగన్ ? మీ పార్టీ మాజీ ఎమ్మెల్యే ముస్తఫా నిజాయితీపరుడని డబ్బాలు కొడుతున్నారు.. మరి చట్టాలను గౌరవించకుండా ఇష్టమొచ్చినరీతిన ఎలా వ్యవహరించారు. అధికారంలో ఉన్నప్పుడు తన సోదరుని



అరాచకాలను ఎందుకు నిలువరించలేదు. ముస్తఫా కుటుంబం ఆగడాలను నియోజకవర్గ ప్రజలందరూ చూస్తూనే ఉన్నారు. చట్టాన్ని అమలు చేస్తోన్న పోలీసులపై ఆరోపణలు చేయడమేంటి ? చట్టం తన పని తాను చేసుకుపోతుంది అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ ఛైర్మన్ నసీర్ ప్రశ్నించారు. రెండేళ్ల నమ్మకంఅభివృద్ధి, సంక్షేమంలో భాగంగా మంగళవారం మన ఇంటికిమన నసీర్ కార్యక్రమాన్ని స్థానిక డివిజన్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు ఇంట్లో ఎవరికి సంక్షేమ పథకాలు అందాయో ? ఇంకా ఎవరైనా అర్హులకు అందకుండా మిగిలిందా ? వంటి అంశాలపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరికీ పథకాలు చేరువ చేస్తామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని ప్రాంతాలను సర్వనాశనం చేశారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అరాచకాలకు కొమ్ముకాశారని విమర్శించారు. ఇప్పుడు తప్పులు చేసి కూడా బుకాయిస్తున్నారని, అసలు తప్పు చేయనప్పుడు పారిపోవాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. రాష్ట్రంలో కిడ్నాపర్లు, రౌడీలకే జగన్ కొమ్ముకాస్తారని, ప్రజల అవసరాలు మాత్రం గాలికొదిలేస్తారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే ముస్తఫాపై అక్రమ కేసులు పెట్టారని గగ్గోలు పెడుతున్నారని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే పోలీసులు చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సొంత బాబాయి హత్యను నరకాసురవధ పేరిట దొంగ ప్రచారాలు చేశారని, ఇప్పుడు నియోజకవర్గంలోనూ ఇదే తరహాగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అంటే అభివృద్ధి, సంక్షేమమని స్పష్టం చేశారు. మన్నవ మోహన్ కృష్ణ, శాలివాహన కార్పొరేషన్ ఛైర్మన్ ఈశ్వర్, దాసరి రాజా మాస్టర్, కన్న, పుట్టా దుర్గ, విజయలక్ష్మి, బొల్లా శ్రీను, పవన్, అబ్దుల్లా, జానీ, గఫార్, వెంకటేష్ ఎంపరాల శ్రీను, హరి తదితరులు పాల్గొన్నారు

# ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా సీఎం సహాయ నిధి: ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ

## 60 మంది లబ్ధిదారులకు రూ.36.91లక్షలు అందజేత

వినుకొండ, ఆగస్ట్4, ప్రభాతవార్త: ఆపదలో ఉన్న కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఒక వరం లాంటిదని ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీవీ అంజనేయులు అన్నారు. మంగళవారం పట్టణంలోని చీఫ్‌విప్ కార్యాలయంలో జీ.వీ చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ పరిధిలోని 60 మంది లబ్ధిదారులకు రూ.36.91 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా జీ.వీ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య చికిత్స భారంగా మారకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు



నాయుడు నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా వేగవంతంగా ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. పేద ప్రజలకు అత్యవసర వైద్య చికిత్స అందేలా ప్రభుత్వం నిరంతరం అండగా నిలుస్తోందని తెలిపారు. వినుకొండ నియోజకవర్గంలో ఇప్పటి వరకు మొత్తం 2,038 మంది లబ్ధిదారులకు రూ.13,76,07,152 సీఎంఆర్ఎఫ్ సాయం మంజూరైందని తెలిపారు. ఒక ్రోజులోనే 60 మందికి రూ.36.91 లక్షల విలువైన చెక్కులు అందజేయడం ప్రజా ప్రభుత్వ సంక్షేమ నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి సందర్భంలో ప్రభుత్వం అండగా ఉంటుందని,అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలు,లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజల హృదయాల్లో నిలిచిన నేత మక్కెన చిన్నరామయ్య: జీ.వీ

వినుకొండ,ఆగస్ట్4,ప్రభాతవార్త: దివంగత మహానేత మక్కెన చిన్నరామయ్య పేద,బడుగు,బలహీన వర్గాల ప్రజలకు ఎనలేని సేవలందించారని ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు కొనియాడారు. మంగళవారం పట్టణంలోని మక్కెన కార్యాలయం నందు చిన్నరామయ్య 9వ వర్ధంతి



వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు చినరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ మక్కెన చినరామయ్య విలువలతో కూడిన రాజకీయాలు చేసి వినుకొండ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో దోహదపడ్డారన్నారు. చినరామయ్య ఆశయాలకు అనుగుణంగా ఆయన కుమారుడు మక్కెన మల్లికార్జునరావు వినుకొండ ప్రాంత ప్రజల సంక్షేమాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని అభినందించారు. మదమంచిపాటి వీరాంజనేయస్వామి తిరణాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రైతులకు స్వయంగా భోజన వసతి ఏర్పాట్లు చేస్తూ అన్నదాన కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించేవారని ప్రశంసించారు. ప్రస్తుతం ఈ సాంప్రదాయాన్ని తనయుడు మక్కెన మల్లికార్జునరావు అదే స్ఫూర్తితో నిరంతరం కొనసాగిస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. చినరామయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్న వారి కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ సంతోషంగా ఉండాలని,మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. అనంతరం ఏర్పాటు చేసిన అల్పాహారం కార్యక్రమాన్ని జీవీ ఆంజనేయులు ప్రారంభించి,స్వయంగా తన చేతుల మీదుగా భోజనం వడ్డించారు. ఈ వర్ధంతి వేడుకల్లో పెద్ద సంఖ్యలో స్థానిక కూటమి నాయకులు లగడపాటి వెంకటరావు,గుడివాడ చినగురునాధరావు,జనసేన నిశ్శంకర శ్రీనివాసరావు,పెమ్మసాని నాగేశ్వరరావు,పొట్ల రాధాకృష్ణ మూర్తి,తులవ శ్రీనివాసరావు,నరసింహారావు,పఠాన్ అయూబ్ ఖాన్,నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ అమలుతో ప్రజల మనసు గెలిచిన సీఎం చంద్రబాబు

వినుకొండ,ఆగస్ట్4,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజల మనసు గెలిచారని ప్రభుత్వ చీఫ్‌విప్,ఎమ్మెల్మే జీ.వీ ఆంజనేయులు అన్నారు. మంగళవారం ఎన్డీయే డోర్ టూ డోర్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 3వ వార్డు ఇందిరానగర్‌లో పర్యటించారు. ప్రతి ఇంటిని సందర్శించి గత రెండేళ్లలో ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు,అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.



జీ.వీ మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వ పాలనకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. పెన్షన్ల పెంపు,తల్లికి వందనం,ఉచిత బస్సు ప్రయాణం,ఉచిత గ్యాస్ అందజత, అన్నా క్యాంటీన్లు, రైతులకు అన్నదాత సుఖీభవ, మెగా డిఎస్సీ,జాబ్ క్యాలెండర్ విడుదల,రాజధాని అమరావతి నిర్మాణం,పోలవరం ప్రాజెక్టు పనులు పురోగతి పట్ల అన్ని వర్గాల నుంచి ఆనందం వ్యక్తమౌతుందన్నారు. ప్రజాభిమానాన్ని చురగొన్న సీఎం చంద్రబాబుపై అక్కసుతో వైకాపా జగన్ గొడ్డలిపార్టీ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తుంటే ఓర్వలేక జగన్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు.ఐదేళ్ల పాలనలో జగన్ ఒక్క డిఎస్సీ కూడా ఇవ్వకుండా జాబ్ క్యాలెండర్ పేరుతో యువతను దారుణంగా మోసం చేశారన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన మెగా డిఎస్సీపై రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. జగన్ దుర్మార్గపు పాలన వల్ల అన్ని వర్గాలకు నష్టం జరిగిందని ప్రజలు గ్రహించి 11 సీట్లకు పరిమితం చేశారని అయినా జగన్‌లో మార్పు రాలేదన్నారు. రెండేళ్ళ కూటమి ప్రభుత్వం విజయాలు,సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలకు గుర్తు చేసుకొని జగన్ ఇప్పటికైనా ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.

# బకింగ్ హామ్ కాలువలో గల్లంతైన యువతి ఐశ్వర్య మృతదేహం లభ్యం..

తాడేపల్లి, ఆగస్టు 4, ప్రభాతవార్త.తాడేపల్లి బకింగ్ హామ్ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న యువతి శెట్టిపల్లి ఐశ్వర్య (17) మృతదేహం లభించింది..చదువు ఇష్టం లేక మనస్తాపంతో కాలువలో దూకి గల్లంతైన ఐశ్వర్య కోసం 6వ బెటాలియన్ ఏపీ శీదీళినీ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా తాడేపల్లి పరిధిలోని మెల్లెంపూడి వద్ద ఆమె మృతదేహం లభ్యమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# 10 మంది నిందితులు అరెస్ట్

గుంటూరు క్రైమ్,ఆగస్టు4,ప్రభాతవార్త: మిర్చి బస్తాల వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా ముఠాను నగరపాలెం పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు,గుంటూరు వెస్ట్ డివిజన్ డిఎస్పీ బెల్లం శ్రీనివాసరావు పర్యవేక్షణలో నగరంపాలెం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మునిపల్లి రాజేష్ ఆధ్వర్యంలో ఫిర్యాదుదారు బత్తుల శంకరరావు,9 వ లైన్,హౌసింగ్ బోర్డ్, నల్లపాడు, గుంటూరు పట్టణం అనునతను గుంటూరు మిర్చి యార్డులో వ్యాపారి వద్ద మేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాట్లు జులై 30వ తేదీన గురజాల నుండి కొనుగోలు చేసిన 120 మిర్చి బస్తాలను ట్రాక్టర్‌లో గుంటూరు మిర్చి యార్డుకు తీసుకువస్తుండగా యార్డులో రద్దీ ఎక్కువగా ఉండటంతో మధ్యాహ్నం షుమారు 02.00 గంటల సమయంలో ట్రాక్టర్‌ను రామిరెడ్డి నగర్ శ్మశానవాటిక ఎదురుగా నిలిపి విశ్రాంతి తీసుకుని,మిర్చి యార్డ్ లో రద్దీ తగ్గిన అనంతరం ట్రాక్టర్ ను మిర్చి యార్డు లోపలి తీసుకువెళ్లి లోడును దించుతున్న సమయంలో 38 మిర్చి బస్తాలు చోరీకి గురైనట్లు గుర్తించి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించి, దర్యాప్తులో భాగంగా, 3 ప్రత్యక బృందాలను ఏర్పాటు చేసి, దర్యాప్తు చేస్తున్న క్రమంలో ఎస్.ఐ రామచంద్రారెడ్డికి రాబడిన విశ్వసనీయ సమాచారం మేరకు మంగళవారం గుంటూరు పట్టణం,కేవీపీ కాలనీ,విఐపి రోడ్డు లాలుపురం సమీపంలోని భవానిపురం ప్లాట్స్ వద్ద ప్రత్యేక దాడి నిర్వహించారు.ఆ సమయంలో పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించిన 10 మంది నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా వారు సంఘటితంగా మిర్చి బస్తాల చోరీలకు పాల్పడుతున్న ముఠాకు చెందినవారని వెలుగులోకి వచ్చింది.నిందితులు తమ నాయకుడు ఆవుల గణేష్ ఆధ్వర్యంలో గుంటూరు నగరం,పరిసర ప్రాంతాల్లో ట్రాక్టర్లు, లారీలలో నిల్వ ఉంచిన మిర్చి బస్తాలను లక్ష్యంగా చేసుకొని చోరీలు చేస్తున్నట్లు అంగీకరించారు. ఈ క్రమంలో జూలై30,31వ తేదీన అర్ధరాత్రి రామిరెడ్డి నగర్ శ్మశానవాటిక సమీపంలో నిలిపి ఉన్న ట్రాక్టర్ నుండి 38 మిర్చి బస్తాలను అపహరించి,వాటిని మూడు టాటా ఇంట్రా వాహనాలలో తరలించి,అనంతరం ప్రత్తిపాడు మండలం యనమదల గ్రామానికి చెందిన వ్యక్తికి రూ.1,00,000/లకు విక్రయించినట్లు ఒప్పుకున్నారు. నిందితుల స్వచ్ఛంద ఒప్పుకోలు ఆధారంగా రూ.1,00,000/ నగదు, నేరానికి ఉపయోగించిన 3 టాటా ఇంట్రా వాహనాలు, 1 టివియస్ జూపిటర్ స్కూటీ,దొంగిలించిన వాటిలో 10 మిర్చి బస్తాలను స్వాధీనం చేసుకొని, మొత్తం 10 మంది నిందితులను అరెస్టు చేయడం జరిగింది.కేసులో ప్రధాన నిందితుడైన ఆవుల గణేష్ పరారీలో ఉండగా,అతని అరెస్టు కోసం ప్రత్యేక బృందాలు చర్యలు చేపట్టాయి.

మిర్చి బస్తాల దొంగతనం కేసును సవాలుగా తీసుకుని, సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా కేసు నమోదు అయిన కొన్ని గంటల్లోనే కేసు చేధించి,ముద్దాయిలను అరెస్ట్ చేసి,చోరి సొత్తు స్వాధీనం చేసుకొనుటలో ఉత్తమ ప్రతిభ చూపించిన నగరంపాలెం ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మునిపల్లి రాజేష్ ని,ఎస్.ఐ ఏ.రామచంద్రా రెడ్డి,సిబ్బంది, శ్రీనివాసరావు, జాన్ సైదా,బెనర్జీ,గంగరాజులను సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్,వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు. గుంటూరు జిల్లా పోలీసులు రైతులు,వ్యాపారులు,ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ వ్యవసాయ ఉత్పత్తులు,వ్యాపార సంబంధ వస్తువులను రాత్రి వేళల్లో భద్రత లేకుండా బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించిన వెంటనే డయల్112 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని కోరారు.

# గ్యాస్ట్రో క్యాన్సర్లపై యశోద పోరు..

గుంటూరు మెడికల్, ఆగస్టు4(ప్రభాతవార్త): మలక్‌పేట యశోద ఆసుపత్రి ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ శ్రీపతి గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో జీర్ణకోశ వ్యాధులు, గ్యాస్ట్రో క్యాన్సర్లపై అవగాహన కల్పించారు. మారుతున్న జీవనశైలి, జంక్ ఫుడ్, ధూమపానం, మద్యపానం, ఊబకాయం, నియంత్రణలో లేని మధుమేహం వంటి కారణాలతో కాలేయం, ప్యాంక్రియాస్, అన్నవాహిక, కడుపు, పెద్దపేగు క్యాన్సర్ల కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. కడుపునొప్పి, ఆహారం మింగడంలో ఇబ్బంది, ఆకలి తగ్గడం, ఆకస్మికంగా బరువు తగ్గడం, మలంలో రక్తం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. వ్యాధిని తొలిదశలో గుర్తిస్తే పూర్తిస్థాయిలో చికిత్స పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. యశోద ఆసుపత్రిలో రోబోటిక్ శస్త్రచికిత్సలు, ఎండోస్కోపీ, కొలోనోస్కోపీ, ఈయూఎస్, ఈఆర్సీపీ, ల్యాపరోస్కోపిక్, మినిమల్ ఇన్వేసివ్ శస్త్రచికిత్సలతో పాటు సర్జికల్ గ్యాస్ట్రో, మెడికల్ ఆంకాలజీ, రేడియేషన్ ఆంకాలజీ నిపుణుల సమన్వయంతో సమగ్ర వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. గ్యాస్ట్రో క్యాన్సర్ల చికిత్సలో అత్యాధునిక ఎంఆర్

## అత్యాధునిక రోబోటిక్ శస్త్రచికిత్సలతో మెరుగైన చికిత్స..యశోద ఆసుపత్రి ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ శ్రీపతి




సమావేశంలో మాట్లాడుతున్న యశోద ఆసుపత్రి ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వెంకటేష్ శ్రీపతి....

లీనాక్ సాంకేతికత ద్వారా కణితులను అత్యంత కచ్చితత్వంతో లక్ష్యంగా చేసుకుని రేడియేషన్ అందించడం వల్ల ఆరోగ్యకరమైన కణజాలానికి నష్టం తగ్గి, దుష్ప్రభావాలు కూడా తగ్గుతాయని వివరించారు. రోగ నిర్ధారణ నుంచి శస్త్రచికిత్స, కీమోథెరపీ, రేడియేషన్, పునరావాస సేవల వరకు ఒకే ప్రాంగణంలో చికిత్స అందించడం యశోద ఆసుపత్రి ప్రత్యేకత అని తెలిపారు. ప్రజలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వ్యాధులను ముందుగానే గుర్తించుకోవాలని డాక్టర్ వెంకటేష్ శ్రీపతి సూచించారు. సమావేశంలో మార్కెటింగ్ విభాగాధిపతి వీరంకి వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ మార్కెటింగ్ మేనేజర్ తిమోతి తదితరులు పాల్గొన్నారు.

5MN 6 PG-GNT_5MN 6 PG-GNT.qxd 04-08-2026 PM 10:26 Page 1



# పల్నాడు జిల్లా వార్త



## గ్రామాలలో పొలం పిలుస్తోంది

చిలకలూరిపేట, ఆగస్టు 4, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలంలోని రాజాపేట మరియు గోపాలంవారిపాలెం గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించటం జరిగింది.ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట మండల వ్యవసాయ అధికారి సి.హెచ్ సరిత పాల్గొని ప్రతి పొలాలను సందర్శించి రైతులకు సాగుపై పలు సూచనలు చేశారు. గోపాలంవారిపాలెం లో రైతు మామిడి భాస్కరరావు బిందు సేద్యం ద్వారా సాగు చేస్తున్న ప్రత్తి పంటను సందర్శించిన వ్యవసాయ అధికారి వారు ప్రస్తుత ఎల్ నినో పరిస్థితులలో రైతులందరూ కూడా అందుబాటులో ఉన్న అతి కొద్దిపాటి నీటి వనరులను సద్వినియోగించుకోవాలని,అందుకు గాను బిందు లేదా తుంపర సేద్యం ల వైపు మొగ్గు చూపాలని మరియు బిందు/ తుంపర సేద్యానికి ప్రభుత్వం నుండి 90/50 శాతం రాయితీ కూడా వర్తిస్తుంది అని తెలియజేశారు. అదే విధంగా రైతులందరూ తాము సాగు చేస్తున్న పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ నందు నమోదు చేసుకోవాలని మరియు కౌలు రైతులు అందరూ విధిగా రెవెన్యూ లేదా వ్యవసాయ శాఖ సిబ్బందిని సంప్రదించి కౌలు కార్డులను పొందవలసినదిగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ ప్రతాప్, ఆర్ ఎస్ కే సహాయకులు మల్లికార్జున , రాజాపేట మరియు గోపాలంవారిపాలెం గ్రామ రైతులు పాల్గొన్నారు.



## అంజయ్య ఆదరణ కూడిక కార్యక్రమం

చిలకలూరిపేట, ఆగస్టు 4, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణానికి చెందిన ప్రముఖులు, గవర్నమెంట్ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపల్ పేర్ల అంజయ్య ఆదరణ కూడిక కార్యక్రమం పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్ నందు జరుగుచుండగా, ఆ కార్యక్రమానికి హాజరై, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియచేసిన మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు , కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



## భానుప్రసాద్ మృతికి సంతాపం



చిలకలూరిపేట, ఆగస్టు 4, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణం, పండరిపురం, 36 వ వార్డుకు చెందిన గోపాలం భాను ప్రసాద్ ఆకస్మికంగా స్వర్గస్తులైనారు. ఈ విషయం తెలుసుకొని పట్టణంలోని వారి స్వగృహం నందు ఉన్న వారి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించి, వారి కుటుంబసభ్యులను పరామర్శించిన మాజీ మంత్రివర్యులు, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావుతదితరులు

## టెన్నిస్ బాల్ క్రికెట్ జిల్లా ఎంపికలు

చిలకలూరిపేట, ఆగస్టు 4, ప్రభాతవార్త: చిలకలూరిపేట లోని యర్రగ్రౌండ్ క్లోర్ సి ఆర్ కాలనీ లోని పల్నాడు జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్ 17 బాలుర బాలికల విభాగాలలో ఎంపికలు నిర్వహించినట్లు అసోసియేషన్ కార్యదర్శి కోటేశ్వరరావు తెలిపారు . జిల్లా నలుమూలల నుండి వివిధ పాఠశాల వేద పాఠశాల ఏపీ మోడల్ స్కూల్ తిరుమల ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కాలేజ్ పిడుగురాళ్ల వాగ్దేవి జూనియర్ కాలేజ్ వసిష్ట జూనియర్ కాలేజ్ సత్తెనపల్లి హోలీ ఫ్యామిలీ స్కూల్ ఎస్ఎఫ్ఎస్ స్కూల్ చైతన్య లిటిల్ గ్రీన్ వ్యాలీ నారాయణ శారద మెరిడియన్ స్కూల్ జి విట్ పాఠశాల నుండి 100 మంది విద్యార్థులు పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసి బాపట్ల లోని కె వి ఆర్ డిగ్రీ కాలేజ్ కాజ్ పాలెంలో ఆగస్టు8 9 తేదీలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు వారు తెలిపారు . కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యాయామ ఉపాధ్యాయ సంఘ ప్రెసిడెంట్ కాసింబదే ప్రారంభించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు . ఈ కార్యక్రమంలో వేద పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు వి మనోహర్ గురునాథ్ , వ్యాయామ ఉపాధ్యాయులు ఏ ఎం జి రాజు వేద స్కూల్ పీఈటి మనోహర్, మెరిడియన్ నవీన్ , నారాయణ పి ఈ టి కృపారావు గ్రీన్ వ్యాలీ పి ఈ టి శ్యామ్ చైతన్య లిటిల్ ఫణీంద్ర కోచ్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు .




## సామాజిక అటవీ పెంపకానికి ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేకు రోటరీ విజ్ఞప్తి

చిలకలూరిపేట, ఆగస్టు 4: రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో సామాజిక అటవీ పెంపకం కార్యక్రమాన్ని చేపట్టేందుకు చిలకలూరిపేట నియోజకవర్గంలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరుతూ స్థానిక శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కి రోటరీ సభ్యులు మంగళవారం విజ్ఞాపన పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రోటరీ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వం భూమిని రోటరీ క్లబ్ కు కేటాయిస్తే అక్కడ నాణ్యమైన మొక్కలను పెంచి, వాటిని సంరక్షించి, అనంతరం ప్రభుత్వానికి అప్పగించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు సామాజిక అటవీ అభివృద్ధికి విశేషంగా దోహదపడుతుందని వివరించారు. విజ్ఞప్తిపై స్పందించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ, తన వంతు సహాయ సహకారాలు అందించడంతో పాటు ప్రభుత్వ భూమి కేటాయింపునకు అవసరమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షులు బి. రామసుబ్బారావు, కార్యదర్శి మానం శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షులు తేళ్ల సుబ్బారావు, డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, చిలుకూరి శ్రీనివాసరావు, దండా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## ఎల్‌నినో ప్రభావంతో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

యడ్లపాడు, ఆగస్టు 4, ప్రభాతవార్త : ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎడ్లపాడు పశు వైద్య సహాయ సంచాలకులు వై రాధాకృష్ణ సూచించారు. ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో కారణంగా ఉష్ణోగ్రతలు, వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పశువులను ఎప్పటికప్పుడు శుభ్రమైన తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు, నాణ్యమైన మేతను అందించాలని సూచించారు. పశువుల కొట్టాలను పరిశుభ్రంగా ఉంచి, తేమ అధికంగా లేకుండా చూసుకోవాలని, వ్యాధులు ప్రబలకుండా నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. పశువుల్లో ఆకలి మందగించడం, జ్వరం, నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప పశువైద్యశాలను సంప్రదించాలని సూచించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా పశువుల సంరక్షణ చేపడితే పాల ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం తగ్గించవచ్చని ఆయన తెలిపారు. పాడి రైతులు పశుసంవర్ధక శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.



## చిరుజల్లులతో పత్తి రైతుల్లో ఆనందం

యడ్లపాడు, ఆగస్టు 4, ప్రభాతవార్త : జిల్లాలో కురుస్తున్న చిరుజల్లులు పత్తి రైతులకు ఊరటనిచ్చాయి. ఈ వర్షాల ప్రభావంతో పత్తి విత్తనాలు సుమారు 90 శాతం వరకు మొలకెత్తడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో కురిసిన తేలికపాటి వర్షాల వల్ల భూమిలో తగినంత తేమ ఏర్పడి, విత్తనాలు సమృద్ధిగా మొలకెత్తాయని రైతులు తెలిపారు. దీంతో పొలాలన్నీ పచ్చని మొక్కలతో కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు. మంచి మొలకలు రావడంతో ఈ సీజన్‌లో ఆశించిన దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇదే తరహాలో వాతావరణం అనుకూలంగా ఉంటే పత్తి పంట మరింత బాగా అభివృద్ధి చెందుతుందని వారు చెబుతున్నారు. రైతులు పొలాల్లో కలుపు నివారణ, ఎరువుల నిర్వహణ వంటి వ్యవసాయ పనులను ప్రారంభించారు.



## తల్లిపాలే శిశువుకు తొలి టీకా - డాక్టర్ భరద్వాజ్

యడ్లపాడు, ఆగస్టు 4, ప్రభాతవార్త : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఆగస్టు 1 నుంచి 7 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి భరద్వాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. మొదటి ఆరు నెలల పాటు శిశువుకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఇవ్వకూడదని సూచించారు. తల్లిపాలలో ఉండే పోషకాలు, రోగనిరోధక శక్తిని పెంచే యాంటీబాడీలు శిశువును అనేక వ్యాధుల నుంచి కాపాడుతాయని వివరించారు. ఆరు నెలల తర్వాత అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల వరకు లేదా ఆ తరువాత కూడా వీలైనంత ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువుతో పాటు తల్లి ఆరోగ్యానికీ ప్రయోజనం కలుగుతుందని, ప్రసవానంతర కోలుకోవడం వేగవంతం కావడంతో పాటు కొన్ని దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి కుటుంబం అవగాహన పెంచుకుని, శిశువుల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.



## వల్లప్పచెరువు అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి

### ఎమ్మెల్యే డా. అరవిందబాబు

నరసరావుపేట, ఆగస్టు 4 ప్రభాతవార్త : నరసరావుపేటలో సుమారు 200 సంవత్సరాల చరిత్ర కలిగిన వల్లప్పచెరువు అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. పీఎంకెఎస్వై 2.0 కింద రూ.1.30 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు మే 22న అధికారికంగా పనులు ప్రారంభించగా, తొలి విడతగా రూ.50 లక్షల నిధులు మంజూరై పనులు కొనసాగుతున్నాయి. మంగళవారం చెరువు వద్దకు ఎమ్మెల్యే అరవిందబాబు జరుగుతున్న అభివృద్ధి పనులను పల్నాడు జిల్లా డ్వామా పీడీ ఎం.సిద్ధాలింగమూర్తి కలిసి పరిశీలించారు. అధికారులను పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసరావుపేట పట్టణంలోని చారిత్రక వల్లప్పచెరువును మోడల్ ట్యాంక్‌గా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా తాగునీటి భద్రత, భూగర్భ జలాల పెరుగుదల, పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజలకు ఆహ్లాదకరమైన విహార వాతావరణం కల్పించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం చెరువులో పూడికతీత, ట్యాంక్‌బండ్ బలోపేతం, రిటైనింగ్ వాల్ నిర్మాణం, వాకింగ్ ట్రాక్, పరిసర ప్రాంతాల శుభ్రత వంటి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. తదుపరి దశలో ఇరువైపులా మొక్కల పెంపకం, సోలార్ లైటింగ్, పెద్దల కోసం బెంచీలు, చిన్నారుల కోసం పార్క్, బోటింగ్ సౌకర్యం వంటి ఆధునిక వసతులను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. చెరువు మధ్యలో శివుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసి మొత్తం ప్రాంతాన్ని ఆకర్షణీయమైన విహార కేంద్రంగా తీర్చిదిద్దేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. అదనంగా ప్రభుత్వ నిధులతో పాటు ఎన్ఆర్ఐల స్వచ్ఛంద సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే వెల్లడించారు.



## 6వేల నిరుపేద తల్లులకు తల్లికి వందనం అందలేదు

### డా. గోపిరెడ్డి

నరసరావుపేట, ఆగస్టు 4 ప్రభాతవార్త : తల్లికి వందనం పథకం కోల్పోయిన లబ్ధిదారులందరికీ న్యాయం జరగాలని కోరుతూ వైసీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గంలో 5929 మంది నిరుపేదలకు అధిక విద్యుత్ బిల్లులు, 1000 గజాల స్థలం మరియు ఇన్కమ్ టాక్స్ తదితర కారణాలు చూపుతూ తల్లికి వందనం పథకం కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టిందని ఆరోపించారు. గతంలో వైఎస్. జగన్మోహన్ రెడ్డి హయాంలో ఇన్కమ్ టాక్స్ పరిమితిని తల్లికి వందనం పథకానికి వర్తింప చేయలేదన్నారు. కానీ మంత్రి లోకేష్ ఇన్కమ్ టాక్స్ కారణంగా చూపుతూ తల్లికి వందనం పథకాన్ని ఎగవేశారన్నారు. ఒక నరసరావుపేట నియోజకవర్గంలోనే సుమారు 6000 మందికి తల్లికి వందనం పథకం రద్దు చేశారని, ఇక రాష్ట్రవ్యాప్తంగా ఎన్ని వేలమందికి ఈ పథకం రద్దు చేశారో అర్థం అవుతుందన్నారు. వైసీపీ హయాంలో అమ్మ ఒడి పథకం రూ.13000 కు కుదించారని లోకేష్ బాబు గగ్గోలు పెట్టారని, కాగా ఆ డబ్బును నాడు పాఠశాల అభివృద్ధికి వినియోగించడం జరిగిందన్నారు. కానీ నేడు రూ.15000 ఇస్తామని చెప్పి రూ.13000 ఇస్తూ ఆ మిగిలిన డబ్బు ఏం చేస్తున్నారో కూడా ఎవరికి తెలియదన్నారు. ఈ ప్రభుత్వం నిరుపేద తల్లులను దారుణంగా మోసం చేసిందన్నారు. దుర్గ అనే నిరుపేద కుటుంబానికి చెందిన తల్లికి ముగ్గురు పిల్లలని, వైసీపీ హయాంలో వీరికి అమ్మ ఒడి పథకం అందిందని, కానీ ఇప్పుడు వీరికి తల్లికి వందనం పథకం రద్దు చేశారని, రద్దుకు కారణం విచిత్రంగా చెబుతున్నారని తెలిపారు. ఈమె ఆధార్ కార్డు బండారు సత్యనారాయణ అనే ఎవరో ఎన్నారై ఆధార్ కు లింక్ అయిందని, అతను ఇన్కమ్ టాక్స్ చెల్లిస్తున్నాడని, ఈమెకు తల్లికి వందనం పథకం రద్దు చేశారని తెలిపారు. ఈమె భర్తకు కాలు గాయమై ఏ పని చేసుకోలేని దుస్థితిలో ఉన్నాడని, రెండు ఏళ్లుగా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఈమెకు అధికారులు న్యాయం చేయడం లేదని పేర్కొన్నారు. అధికారుల తప్పిదాలకు నిరుపేదలు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈమెకు న్యాయం చేయాలని, రద్దయిన లబ్ధిదారులందరికి తిరిగి తల్లికి వందనం నిధులు పడేటట్లు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో వైసీపీ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బాల్ బ్యాట్మింటన్ జట్టుకు ఎంపికైన కృష్ణవేణి విద్యార్థులు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 4 ప్రభాతవార్త : ఈనెల 2న వినుకొండలోని నిర్మల ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ మహిళల బ్యాడ్మింటన్ జట్టు ఎంపికలలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థినులు మంచి ప్రతిభ చూపారు. విద్యార్థినిలు కే. కావ్య, ఎం. లుద్య ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాట్మెంటన్ జట్టుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మంగళవారం తెలియజేశారు. ఎంపికైన విద్యార్థినులు సెప్టెంబర్ 46 వరకు నెల్లూరు జిల్లా అల్లూరులో నిర్వహించుచున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటారన్నారు. వారు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టు నుండి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్ ఈదర ఆదిబాబు, అధ్యాపక అధ్యాపకేతర బృందం జిల్లా జట్టుకు ఎంపికైన కావ్య, లుద్య లను అభినందించారు.



## 7న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం



యడ్లపాడు, ఆగస్టు 4, ప్రభాతవార్త : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆగస్టు 7వ తేదీ శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హేమలతా దేవి తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆమె కోరారు. మండల అభివృద్ధి, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. మండలస్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారం, నివేదికలతో సమావేశానికి హాజరై అవసరమైన వివరాలను సమర్పించాలని ఎంపీడీవో హేమలతా దేవి సూచించారు. సమావేశాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పాల్గొనాలని ఆమె కోరారు.

## మిట్టపల్లి కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

యడ్లపాడు, అగష్టు 4, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలోని మిట్టపల్లి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల నందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ గోపి కృష్ణ మరియు కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగం సంయుక్త అధ్వర్యంలో బిటెక్ 4వ సంవత్సరం చదువుతున్న సిఎస్ఇ, ఎఐ, డిఎస్, ఐటి అండ్ ఈసిఈ విద్యార్ధిని, విద్యార్ధులకు క్యూస్పైడర్ కంపెని కళాశాల



ఎంపికలు నిర్వహించింది. వీరికి వార్షిక వేతనం 3.5నుండి9.5లక్షలు వరకు ఉంటుందని కంపెని హెచ్‌అర్ ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఎంబివి సత్యనారాయణ ఎంపికైన విద్యార్ధిని, విద్యార్ధులను అభినందించి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే అధునిక సాంకేతికను అందిపుచ్చుకొని అన్ని రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనపరచాలని అకాంక్షించారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎమ్ కిషోర్ కుమార్ ఎంపికైన విద్యార్ధిని, విద్యార్ధులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎడి సిహెచ్ శ్రీనివాసరావు, టిపిఒ కె విజయ్‌కుమార్ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ఇంటింటికీ తెలుగుదేశం... ప్రజా సంక్షేమంలో మరో ముందడుగు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు 4, ప్రభాతవార్త: ఇంటింటికీ తెలుగుదేశం కేవలం పార్టీ కార్యక్రమమే కాదని.. ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం వేసిన మరో ముందడుగు అని, ప్రజల సమస్యలు, వారి కష్టసుఖాల్లో భాగం పంచుకోవడానికే టీడీపీ శ్రేణులు ఇంటింటికీ వెళుతున్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ఆయన"ఇంటింటికీ తెలుగుదేశం – రెండేళ్ల ప్రజా ప్రభుత్వం, తిరుగులేని విజయాల్లు కార్యక్రమంలో భాగంగా నాదెండ్ల మండలంలో పర్యటించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇర్లపాడు, కనపర్రు, అమీన్ సాహెబ్ పాలెం గ్రామాల్లో పర్యటించిన ప్రత్తిపాటి, ప్రతి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి, ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు.ఏ ఇంట్లో అడిగినా మంచి ప్రభుత్వమనే మాటే వినిపిస్తోంది.. ప్రజలు చంద్రబాబు కష్టాన్ని, జగన్ దుర్మార్గాల్ని గమనిస్తున్నారని, రెండేళ్ల కూటమి విజయాలను వారు మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. ఏ ఇంటికి వెళ్లి అడిగినా ఇది మంచి ప్రభుత్వమనే మాటే వినిపిస్తోందన్నారు. ప్రభుత్వ మంచి, విజయాల్ని ప్రజల్లోకి వెళ్లకుండా చేయాలి.. అరాచకాలు సృష్టించాలన్న వైసీపీ కుట్రల్ని ప్రజలు పూర్తిగా గమనిస్తున్నారని, సరైన సమయంలో ఆ పార్టీకి వారే బుద్ధిచెబుతారని ప్రత్తిపాటి తెలిపారు.రెండేళ్లలోనే 90 శాతం హామీలు నెరవేర్చాం చంద్రబాబు నాయకత్వంలోని కూటమిప్రభుత్వం రెండేళ్లలోనే 90శాతం హామీలు నెరవేర్చిందని, గత పాలకుల్లా ఒక్కో హామీ అమలుకు ఐదేళ్ల వరకు వేచిచూసి, చివరిగా ప్రజల్ని మోసగించలేదని ప్రత్తిపాటి చెప్పారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ హామీ అమల్లో ప్రభుత్వం నూటికి వెయ్యి మార్కులు సాధించిందన్నారు. తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవ, స్త్రీశక్తి, దీపం2, అన్నక్యాంటీన్ల పథకాలతో పేద, మధ్యతరగతి వర్గాలకు లక్షలకోట్ల ప్రయోజనం చేకూర్చామన్నారు. మాట వరసకైనా ప్రజల నుంచి కష్టం అనే మాట వినిపించకూడదన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అని, ఆ దిశగానే ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజాప్రతినిధుల్ని, వ్యవస్థల్ని ఆయన పరుగులు పెట్టిస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రభుత్వానికి అందే ప్రజల అర్జీలు సకాలంలో పరిష్కారమవుతున్నాయన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, టీడీపీ గట్టినేని రమేష్, లింగయ్య, రాంమాజనేయులు, గుర్రం నాగ పూర్ణచంద్రరావు, వజ్జ సింగయ్య, జయప్రసాద్, రంగనాథుల నాగేశ్వరరావు, పూర్ణె హనుమంతరావు, కోటి లింగం, కృష్ణమ నాయుడు, పునాటి సుధీర్ , కోటేశ్వరరావు, గుర్రం ఉపదేంద్ర, జయ రాజు, దార్ల రాయన్న, ఖాజా, గ్రామ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## నాదెండ్ల పీహెచ్‌సీని సందర్శించిన రత్నమోహన్

చిలకలూరిపేట, ఆగస్టు 4, ప్రభాతవార్త: నాదెండ్ల మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని దీలీబీవీ డాక్టర్ రత్నమోహన్ సందర్శించి, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల తీరును వైద్యాధికారి డాక్టర్ శ్వేతను అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. గ్రామాల్లో వ్యాక్సినేషన్‌తో పాటు ఖికిల్కారిఖి సేవలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మెడికల్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.




## జగన్ తన సంపద పెంచుకుంటే.. చంద్రబాబు ప్రజల ఆదాయం పెంచుతున్నారు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఆగస్టు 4, ప్రభాతవార్త: జగన్ అధికారంలో ఉన్నన్నాళ్లు సొంత ఆదాయం పెంచుకుంటే... చంద్రబాబు రెండేళ్లలోనే ప్రజల జీవన ప్రమాణాలు, వారి తలసరి ఆదాయ పెంపునకు ప్రత్యేక ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంపై వేసిన అప్పులభారం తగ్గిస్తూనే, ప్రతినెలా ప్రజల సంతోష స్థాయి ఏమాత్రం తగ్గకుండా, సంక్షేమ పథకాలు అమలు చేయడం సామాన్య విషయం కాదన్నారు. 3 వార్డుల్లో రూ.52లక్షల విలువైన అభివృద్ధి పనులకు ప్రత్తిపాటి శంకుస్థాప నమంగళవారం ఆయన చిలకలూరిపేట పట్టణంలోని 13, 14, 8 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా 8 వ వార్డులో రూ.29 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనులకు, 13వ వార్డులో రూ.6.80 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు, కల్వర్టు నిర్మాణానికి, 14వ వార్డులో రూ.16 లక్షలతో నిధులతో చేపట్టిన సీసీరోడ్డు, డ్రైన్ల నిర్మాణ పనులకు స్థానిక కూటమి నాయకులతో కలిసి ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాటి.. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనా విజయాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పలుచోట్ల మాట్లాడారు. జగన్ ఐదేళ్లు తన ఆదాయంపై దృష్టిపెట్టి, రాష్ట్ర ఆదాయానికి గండికొట్టాడు.. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా, భౌతికంగా విధ్వంసానికి గురిచేయకుండా ఉండుంటే.. నేడు ప్రజలు అభివృద్ధిపనుల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితులు ఉండేవి కావన్నారు. జగన్ సృష్టించిన ఆర్థిక విధ్వంసం వల్లే, నేడు ప్రజలు మరింత మెరుగైన సంక్షేమాన్ని, అభివృద్ధి ఫలాలు పొందడానికి ఆలస్యం అవుతోందన్నారు. జగన్ తన ఆదాయ పెంపుపై దృష్టి పెట్టి. రాష్ట్ర ఆదాయానికి గండికొట్టాడని ప్రత్తిపాటి అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లో చిలకలూరిపేట మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో కూటమి అభ్యర్థులే విజయం సాధించాలని, ఆ దిశగా శ్రేణులు ఇప్పటినుంచే ప్రణాళికబద్ధంగా గెలుపు వ్యూహాలపై దృష్టి పెట్టాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, నెల్లూరి రంజిత్, టీడీపీ నాయకులు ముల్లా కరిముల్లా, సయ్యద్ వహబ్, మురకొండ మల్లిబాబు, కొత్త కోటేశ్వరరావు, హరిబాబు రెడ్డి, గోపిదేశి గంగాధర్, సుబ్బారావు, బీడింగ్ కరిముల్లా, బాజీ, బారి, వేటపాలెం సుభాని, నాగూర్ , కుంబా నాగేశ్వరరావు, వార్డు నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## పేర్ల అంజయ్య ఆదరణ కూడికలో పాల్గొని నివాళులర్పించిన మర్రి

చిలకలూరిపేట, ఆగస్టు 4, ప్రభాతవార్త: గవర్నమెంట్ కాలేజ్ రిటైర్డ్ ప్రిన్సిపల్, సామాజికవేత్త పేర్ల అంజయ్య గారు గతనెల 23న స్వర్గస్తులైనారు.ఈ రోజు వారి ఆదరణ కూడిక కార్యక్రమం పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్ నందు జరుగుచుండగా ఆ కార్యక్రమమునకు హాజరై వారి చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేసిన శాసనమండలి సభ్యులు శ్రీ మర్రి రాజశేఖర్ గారు, శ్రీ సోమేపల్లి వెంకట సుబ్బయ్య గారు,శ్రీ గేరా లింకన్ గారు,... ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ గారు మాట్లాడుతూ తన దగ్గరికి ఎవరు వచ్చినా ఏ సహాయం కోరి వచ్చిన వారికోసం ఎంత దూరమైనా వెళ్లి, ఆ పని కోసం ఎవరినైనా కలిసి వాళ్ళ పని పూర్తయ్యేంతవరకు వదిలిపెట్టకుండా ఆ పని సాధించే వ్యక్తి అంజయ్య మాస్టారు గారని అన్నారు. ఈ సందర్భంగా వారికి ఘన నివాళులర్పిస్తూ వారి కుటుంబానికి ఈ బాధను తట్టుకునే శక్తిని ఇవ్వాలని భగవంతుని కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో బైరా, వెంకట కోటి , సుభాని ,సాతులూరి కోటి , గ్రంధి ఆంజనేయులు , సాలె సౌరి ,జయపాల్ , ఇమ్మడి జానకిపతి ,,సయ్యద్ హిదాయితుల్లా ,,మాజేటి నరేంద్ర ,,జిలానీ , రావూరి దాసు .జల్లెడ గణేష్, నరేంద్ర రెడ్డి , ప్రత్తిపాటి విజయ్ , కళ్యాణ్ తదితరులున్నారు.



## చిలకలూరిపేట జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో తీవ్ర పారిశుద్ధ్య సమస్యలు: మున్సిపల్ కమిషనర్ స్పందించాలని స్థానికుల డిమాండ్

చిలకలూరిపేట, ఆగస్టు 4, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణంలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో పారిశుద్ధ్య సమస్యలు తీవ్రరూపం దాల్చాయి. డ్రెయిన్ల నిర్వహణ లోపించడంతో స్థానికులు, వ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.స్థానికుల ఆవేదన...పేరుకుపోయిన మురుగు – దుర్వాసన: పారిశుద్ధ్య కార్మికులు డ్రెయిన్ల శుభ్రతను పూర్తిగా విస్మరించడంతో కాలువల్లో మురుగు నీరు నిలిచిపోయి రోడ్ల పై మురుగు నీరు పారుతూ తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది.విపరీతంగా పెరిగిన దోమల తీవ్రత: నిల్వ ఉన్న మురుగు నీటి కారణంగా దోమలు, ఈగలు, ఇతర హానికారక క్రిమి కీటకాలు విపరీతంగా పెరిగిపోయి పరిసర ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పారిశుద్ధ్య లోపం వల్ల విషజ్వరాలు, ఇతర ఆరోగ్య సమస్యలు వ్యాపించే ప్రమాదం ఉందని భయపడుతున్నారు.కానరాని ఫాగింగ్ చర్యలు: దోమల నివారణకు మున్సిపాలిటీ తరఫున చేపట్టాల్సిన ఫాగింగ్ (మందు పిచికారీ) ప్రక్రియ సక్రమంగా జరగడం లేదని స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.స్థానికుల విజ్ఞప్తి: "వెంటనే మున్సిపల్ కమిషనర్ గారు ప్రత్యక్షంగా ఈ ప్రాంతాన్ని పరిశీలించి, కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించి, క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయించి పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపరచాలి.



5MN 7PG-GNT_5MN 7PG-GNT.qxd 04-08-2026 PM 11:24 Page 1



## ఎంసిహెచ్ నిర్మాణానికి నాబార్డు రూ.55 కోట్ల నిధులు మంజూరు ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు

నరసరావుపేట, ఆగస్టు 4 ప్రభాతవార్త : నరసరావుపేటలోని పల్నాడు రోడ్డులోని పాత ఏరియా ఆసుపత్రి భవనాలను తొలగించి అక్కడ తల్లీబిడ్డల ఆరోగ్య సముదాయం ఎంసిహెచ్ (మదర్ అండ్ చైల్డ్ హెల్త్ బ్లాక్) నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు వెల్లడించారు. ఇప్పటికే నాబార్డు ద్వారా రూ.55 కోట్ల నిధులు మంజూరయ్యాయని, మంత్రి పర్యటన తర్వాత నిర్మాణ ప్రణాళికలను ఖరారు చేస్తామన్నారు.



మంగళవారం నరసరావుపేట ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ (హెచ్డీఎస్) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అరవింద బాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏరియా ఆసుపత్రి భవనాల రోగులకు తాగునీటి సరఫరా, రెస్ట్ రూమ్స్ ఏర్పాటుకు సమావేశంలో తీర్మానం చేసినట్లు తెలిపారు. కలెక్టర్ పర్యవేక్షణలో ఈ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. నరసరావుపేట ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారన్నారు. ప్రస్తుతం దాదాపు 200 పడకలతో అన్ని విభాగాల్లో సర్జరీలు, ఓపీ సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆసుపత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకే హెచ్డీఎస్ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హెచ్డీఎస్ కమిటీ చైర్మన్ డాక్టర్ లక్కిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు డాక్టర్ భారతీదేవి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

## వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ద్వితీయ సెమిస్టర్ ఫలితాలు విడుదల - 88.9 ఉత్తీర్ణత..

నరసరావుపేట, ఆగస్టు 4 ప్రభాతవార్త : స్థానిక రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాల (అటానమస్)లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ప్రథమ సంవత్సరం ద్వితీయ సెమెస్టర్ ఫలితాలను విడుదల చేశారు. అన్ని గ్రూపుల్లో కలిపి 88.9 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ కె. రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీఎస్సీ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), బీసీఏ, బీకాం (కంప్యూటర్ అప్లికేషన్స్) కోర్సుల్లో విద్యార్థులు అత్యుత్తమ



ప్రతిభ కనబరిచారు. పి. మనీషా కుమారి (95.86 ), ఐ. ప్రసన్న చంద్రిక (95.57 ), టి. తేజస్విని (94.46 ), ఎస్‌కే. రుక్సానా (93 ) తమ తమ విభాగాల్లో ప్రథమ స్థానాల్లో నిలిచారు. అలాగే కంప్యూటర్స్‌లో 100/100, ఇంగ్లీష్‌లో 95/100, కామర్స్‌లో 98/100 మార్కులు సాధించి విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు, చైర్మన్ కాట్ల రామకోటేశ్వరరావు, డైరెక్టర్లు ఓగూరి నాగేశ్వరరావు, మద్దుల కోటేశ్వరరావు, సూదా సురేష్ బాబు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి కృష్ణ కిషోర్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎన్. గాయత్రీదేవి పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరిపై పోలీసులకు ప్రత్యేక శిక్షణ

నరసరావుపేట క్రైమ్ , ఆగస్టు 4 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా (మరియు వెట్టిచాకిరి కేసులపై పోలీసు అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. బాధితులను గుర్తించడం, సమర్థవంతమైన దర్యాప్తు, సాక్ష్యాల సేకరణ, నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునే విధానాలపై అవగాహన కల్పించారు. అలాగే



భారతీయ న్యాయ సంహితనిబంధనలను వివరించారు. కార్యక్రమంలో హ్యాండ్ ఆఫ్ కంపాషన్ ఎన్జీఓ డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్, జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణాను అరికట్టి ప్రతి మనిషి స్వేచ్ఛను కాపాడాల్సిన బాధ్యత అందరిపైన పేర్కొన్నారు.

## 10న జైల్ భరోను జయప్రదం చేయాలని పిలుపు

నరసరావుపేట టౌన్, ఆగస్టు 4 ప్రభాతవార్త : ఉపాధి హామీ పథకం కింద వెంటనే పనులు కల్పించి, పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయలపాటి శివ నాగరాణి డిమాండ్ చేశారు. ఈ నెల 10న నిర్వహించనున్న జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.స్థానిక పల్నాడు విజ్ఞాన కేంద్రంలో సోమవారం వ్యవసాయ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షులు దుగ్గి సువార్త అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శివ నాగరాణి మాట్లాడుతూ, జిల్లాలో వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ పనులు లేక వేలాది మంది కూలీలు ఉపాధి హామీ పనులపై ఆధారపడుతున్నప్పటికీ అధికారులు పనులు కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ పనులు చేసి ఎనిమిది వారాలు గడిచినా వేతనాలు చెల్లించకపోవడంతో కూలీలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వ్యవసాయ పనులు లేకపోవడం, ఉపాధి హామీ వేతనాలు అందకపోవడం వల్ల కుటుంబాల జీవనం దుర్భరంగా మారిందన్నారు. అందువల్ల ఉపాధి హామీ పనులు ప్రారంభించి, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి మూడు సెంట్ల ఇంటి స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సమావేశంలో సంఘం జిల్లా నాయకులు నాగేశ్వరరావు, ఎస్.టూఫర్, పి.ఆశీర్వాదం, బి. బాల కోటయ్య, కె. వెంకటేశ్వర్లు, శారమ్మ, బాధ్రు నాయక్, కొండా నాయక్, జాన్ తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి రూ.1,00,269 విరాళం

నరసరావుపేట టౌన్ , ఆగస్టు 4 ప్రభాతవార్త : మండలంలోని ఇస్సాపాలెం గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణానికి మక్కెళ్ళ నాగరాజు విజయదుర్గ, కుమార్తె అపూర్వ రూ.1,00,269 లు విరాళంగా అందజేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి (ఈఓ) నలబోతు మాధవిదేవికి విరాళాన్ని అందజేశారు.ఆలయ అభివృద్ధికి వారి కుటుంబం అందించిన సహకారాన్ని ఆలయ నిర్వాహకులు అభినందించారు. భక్తుల సహకారంతో ఆలయ నిర్మాణపనులువేగంగాకొనసాగుతున్నాయన్నారు. భక్తులందరూ ఇదే విధంగా తమ వంతు సహాయాన్ని అందించి ఆలయ నిర్మాణాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బండ్లమూరి చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొని దాతలను శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. దాతల కుటుంబానికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని వారు ఆకాంక్షించారు.

## విద్యార్థులకు భోజనం ప్లేట్ల అందజేత

సత్తెనపల్లి, ఆగస్టు 4, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం నందు గల ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ బాలుర వసతి గృహము నందు 'హెల్ప్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఎరుపోగు సుగుణ (రిటైర్డ్ ప్రధాన ఉపాధ్యాయురాలు) ప్రథమ వర్ధంతి సందర్భంగా ఈ విద్యా సంవత్సరం లో కొత్తగా చేరిన విద్యార్థులకు భోజనం ప్లేట్లను అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన గౌరవనీయులు పెద్దలు కోట నెమలిపురి గ్రామపాలెం మండలం ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యులు శ్రీనివాసరావు మాట్లాడుతూ తల్లిని గుర్తు చేసుకుంటూ వారి సేవా కార్యక్రమాలు కాకుండా ఆత్మీయ ను గౌరవించి వారి వర్ధంతి సందర్భంగా



సేవా కార్యక్రమాలు చేయడం చాలా అభినందనీయమని , కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఎన్నో సంక్షేమ పథకాలు, వసతి గృహాలను ఏర్పాటు చేసి వారి అభివృద్ధికి బాటలు వేస్తున్నదని ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని అలాగే ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి వ్యక్తిగత పరిశుభ్రత ప్రాముఖ్యత ఇవ్వాలని అన్నారు. అనంతరం గృహంలో ఉపాధ్యాయుడిగా చేసిన కార్యక్రమంలో వితంత మహిళలకు దుస్తులు పంపిణీ అన్నదానం కార్యక్రమాలు నిర్వహించడం జరిగినది . ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పినపాటి వెంకటరమణ రాయ్ , కుమార్తెలు ఆశాలత శ్రీలత హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కంచర్ల బుల్లిబాబు సభ్యులు రాహుల్, కౌశిక్ హారి, సిద్ధూ పల్నాటి , హాస్టల్ వెల్ఫేర్ అధికారి రత్నబాబు టీచర్ మస్తాన్ ఐటిఐ కాలేజ్ ప్రిన్సిపల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు

## గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

సత్తెనపల్లి, ఆగస్టు 4, ప్రభాతవార్త: సత్తెనపల్లి టౌన్ లోని రైల్వే స్టేషన్ రోడ్డు లో రైల్వే స్టేషన్ నుంచి ఆసుపత్రికి వచ్చే మార్గంలో ఎన్టీఆర్ పార్కు ఎదురుగా గుర్రం జాషువా బొమ్మ పక్కన గల రోడ్డు పక్కన ఉన్న డ్రైనేజీలో గుర్తు తెలియని వ్యక్తి పడిపోయి,ఎముకలు పైకి కనబడుతూ ఉన్నాయి. అతని శరీరంపై నల్లని పొట్టు, ఫుల్ అండర్వేర్ ఉన్నది. మృతుని మృతదేహం సత్తెనపల్లి గవర్నమెంట్ హాస్పిటల్ కి తీసుకొని వెళ్లి డాక్టర్ గారు చూసి ఇతను సుమారుగా నెల రోజులు క్రితం చనిపోయి ఉండవచ్చునని,అతని వయసు సుమారుగా 45 నుంచి 50 సంవత్సరాలు ఉండి అతను యూరిన్ పోసుకుని దానికి యూరిన్ పైపు ఉన్నట్లు చెప్పినాడు. మృతుని యొక్క వివరాలు తెలిసినవాళ్లు సత్తెనపల్లి టౌన్ శీటీవీ గారికి తెలియజేయగలరు. 9440796230.

## చింతలతండా గ్రామంలో వాహనం అజాగ్రత్త వలన వ్యక్తి మృతి

విజయపురిసౌత్ ఆగస్టు 4 ప్రభాతవార్త :వాహనం అజాగ్రత్త వలన వ్యక్తి మృతి చెందడం జరిగిన ఘటన చింతలతాండ గ్రామంలో చోటుచేసుకుంది.కొత్తూరు గ్రామానికి చెందిన ఏలే.హనుమంతరావు



తండ్రి రాములు వయసు 49 సంవత్సరాలు. గల వ్యక్తి తెలంగాణలోని దిండి నుండి ఆంధ్రప్రదేశ్ లోని చింతలతండాలో గ్రామానికి ఎ.పి. 39 టి.వి.7583 నంబర్ గల బోలేరు వెహికిల్ లో కోళ్లు లోడ్ చేసుకుని డెలివరీ ఇచ్చేందుకు వచ్చి, అక్కడ కోళ్లను దింపి బండి స్టార్ట్ అవ్వట్లేదని రేడియేటర్ ఓపెన్ చేసి, రేడియేటర్లో నీళ్లు పోసి బండిని స్టార్ట్ చేసిన తర్వాత బండి ముందు భాగంలో వంగి చూస్తున్న క్రమంలో బండి అకస్మాత్తుగా ముందుకు కదలటం తో అతని పైకి ఎక్కడం అతను అక్కడికక్కడే మరణించడం జరిగిందని స్థానికులు తెలిపారు.సంఘటన స్థలానికి చేరుకున్న విజయపురిసౌత్ ఎస్.ఐ.గిరిబాబు తెలిపారు.పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్నీ మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## చిన్న చిన్న వివాదాలను మధ్యవర్తిత్వంతో పరిష్కరించుకోవాలి

వెల్దుర్తి, ఆగస్టు 4, ప్రభాతవార్త: చిన్న చిన్న విషయాలకు గొడవలు పడి పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ విలువైన సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని పల్నాడు జిల్లా దిశా కమిటీ మెంబర్, శ్రీరామకృష్ణ సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి అన్నారు . రాష్ట్ర, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థల ఆదేశాల మేరకు మాచర్ల మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న 'దేశం కోసం మధ్యవర్తిత్వం 3.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం వెల్దుర్తి మండలం మండాది గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థులు విద్యార్థి దశ నుంచే వివాదాలకు దూరంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే పాఠశాల ప్రధానోపాధ్యాయునికి తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు. ఇంట్లో తల్లిదండ్రులు ఏవైనా గొడవల పడి కోర్టులు,



పోలీస్ స్టేషన్లకు వెళ్తుంటే మధ్యవర్తిత్వం యొక్క ప్రాధాన్యతను వారికి వివరించి, సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి హాజరైన మరో ముఖ్య అతిథి సీనియర్ న్యాయవాది షేక్ గౌస్ బాషా మాట్లాడుతూ, చిన్నపాటి తగవులతో కోర్టుల పాలై జీవితాంతం కక్షలు, కార్పణ్యాలతో దుఃఖ సాగరంలో మునిగిపోకూడదని హితవు పలికారు. గ్రామంలోనే మధ్యవర్తుల ద్వారా ప్రతి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకొని సుఖ సంతోషాలతో జీవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కాశీం, పాఠశాల హెచ్ఎం నాగరాజకుమారి, లీగల్ వాలంటీరు, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, ఇతర ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు తప్పనిసరి:

వెల్దుర్తి, ఆగస్టు 4, ప్రభాతవార్త: సూపర్ ఎల్ నినో ప్రభావంతో ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం అస్థిరంగా ఉండే అవకాశం ఉన్నందున, కంది మరియు మిరప పంటలు సాగు చేసే రైతులు శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను తప్పక పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించారు. మంగళవారం వెల్దుర్తి మండలంలో పర్యటించి రైతులకు సూచనలు చేశారు. కంది పంటలో నీటి




నిల్వ, తేమ సంరక్షణ కోసం విత్తన శుద్ధి, రిడ్జ్‌అండ్‌ఫరో పద్ధతి, కన్జర్వేషన్ ఫరోలు, సమగ్ర పోషక యాజమాన్యం, మల్చింగ్ మరియు అంతర దుక్కులు చేపట్టాలని స్పష్టం చేశారు. అలాగే పూత, కాయ దశల్లో 1 రీవిపీ (పొటాషియం నైట్రేట్) పిచికారీ చేయడంతో పాటు కీలక దశల్లో రక్షణాత్మక నీటిపారుదల కల్పించాలని కోరారు. ఎల్ నినో పరిస్థితుల్లో మైట్స్ మరియు స్టెరిలిటీ మొజాయిక్ వ్యాధి ఉధృతి పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులు పంటలను తరచూ పరిశీలిస్తూ, సిఫారసు చేసిన మందులతో సకాలంలో నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. నాట్లు వేసిన మిరప పంటలో తేమ ఒత్తిడి ప్రభావం తగ్గించి, మొక్కల ఎదుగుదల, పూత మరియు కాయల నిల్వను మెరుగుపరిచేందుకు పోషక ద్రావణాలు ఆకులపై పిచికారీ చేయాలని తెలిపారు. వాతావరణ సూచనల ఆధారంగా వ్యవసాయ పనులు నిర్వహించడం ద్వారా నష్టాలను నివారించి మంచి దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హరి సత్యనారాయణ, డాక్టర్ పి. కిశోర్ వర్మ, డాక్టర్ చి. శ్రీలతా వాణి, వెల్దుర్తి మండల వ్యవసాయ అధికారి మరియు గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొని రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తల సూచనలను రైతులు తప్పనిసరిగా పాటించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## 26వ వార్డులో టీడీపీ ఇంటింటి ప్రచారం.. పాల్గొన్న జూలకంటి గౌతమ్ రెడ్డి


మాచర్ల టౌన్ ఆగస్టు 4 ప్రభాతవార్తరాష్ట్రంలో ప్రజా సంక్షేమం,అభివృద్ధినే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జూలకంటి గౌతమ్ రెడ్డి పేర్కొన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో,మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న టీడీపీ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా మంగళవారం మాచర్ల పట్టణంలోని 26వ వార్డులో



ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా జూలకంటి గౌతమ్ రెడ్డికి 58వ బూత్ ఇన్‌చార్జి, పల్నాడు జిల్లా పార్లమెంటరీ కార్యదర్శి షేక్ జానీ భాష పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు.అనంతరం గౌతమ్ రెడ్డి పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం గత రెండేళ్లలో రాష్ట్రంలో, మాచర్ల నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు,అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు.ప్రజలకు మెరుగైన పాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా అభివృద్ధి,సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. అలాగే 'తల్లికి వందనం, గ్యాస్, శ్రీశక్తి తదితర సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు.ప్రచార కార్యక్రమం అనంతరం శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయాన్ని సందర్శించిన జూలకంటి గౌతమ్ రెడ్డికి ఆలయ చైర్మన్ కొమెర అనంత రాములు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్న గౌతమ్ రెడ్డి స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు కొమెర దుర్గారావు,కజ్జం సైదయ్య,సూరె యలమంద, వార్డు అధ్యక్షుడు మణికంఠ,మాజీ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ రసూల్, షేక్ జాన్ అహ్మద్,కూటమికార్యకర్తలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలి: పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల టౌన్ ఆగస్టు 4 ప్రభాతవార్త: పల్నాడు జిల్లా,మాచర్ల పట్టణంలోని పీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మాచర్ల నియోజకవర్గ స్థాయి టౌన్ హాల్ సమావేశం మంగళవారం ఘనంగా నిర్వహించారు.సమావేశంలో డీఎస్సీ నియామకాల్లో జరిగినట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ విద్యార్థులు,నిరుద్యోగ యువత తరఫున పలు డిమాండ్లను నాయకులు వినిపించారు.డీఎస్సీ



అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని,ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని,నిరుద్యోగ భృతి రూ.3,000ను అమలు చేయాలని,ఈ వ్యవహారానికి నైతిక బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ..డీఎస్సీ అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ నిర్వహించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఎవరూ ఆటలాడరాదని,యువతకు న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ తరఫున పోరాటం కొనసాగిస్తామని అన్నారు.ఈ సమావేశంలో మాచర్ల నియోజకవర్గ పరిశీలకులు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ),వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షులు పానుగంటి చైతన్య,నియోజకవర్గ పార్టీనాయకులు, కార్యకర్తలు,అభిమానులు, విద్యార్థులు,నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మద్యం సేవించి ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



రాజుపాలెం, ఆగస్టు 4, ప్రభాతవార్త: కొరకూటి శివయ్య, పెదనెమలిపురి, రాజుపాలెం (మం) అను అతను డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, అతిగా మద్యం సేవించి ( రీడింగ్ 296 /100 ), డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా అద్దంకి -నార్కెట్ పల్లి హైవే పై పెదనెమలిపురి గ్రామశివార్లో, రాంగ్ రూట్ లో డ్రైవింగ్ చేస్తూ, దమ్ము చక్రాల తో ఉన్న ట్రాక్టర్ పై వస్తుండగా సీఐ, సత్తెనపల్లి రూరల్ సర్కిల్, కిరణ్, పట్టుకొని రాజుపాలెం పి యస్ నందు కేసు నమోదు చేయించడమైనది. దమ్ము చక్రాలతో వున్న ట్రాక్టర్ లను రోడ్లపై నడపడం, మద్యం సేవించి నడపడం, చట్టవ్యతిరేకం ప్రమాదకరమని సత్తెనపల్లి రూరల్ సర్కిల్ సిఐ కిరణ్ తెలిపారు.

## ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం

సత్తెనపల్లి, ఆగస్టు 4, ప్రభాతవార్త: ధనబలం కన్నా జనబలం కలిగిన వ్యక్తి, లాకర్ లో సొమ్ము లేకపోయినా, ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం కలిగి, అటు న్యాయవాదిగా మచ్చలేని ప్రయాణం ఇటు భారతీయ జనతా పార్టీ సత్తెనపల్లి పట్టణ అధ్యక్షులుగా తన పదవికాలంలో పదవికి వన్నెతెచ్చిన



ప్రజానాయకుడు గానే కాకుండా నిరంతరం ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేయటంమే కాకుండా తన పదవికాలంలో దాతల సహకారంతో దాదాపు 25 లక్షల రూపాయలు సేవా కార్యక్రమాలు కరోనా కష్టకాలంలో ప్రారంభించి భరతమాత అన్నప్రసాద వితరణ కార్యక్రమం 830 రోజులుగా చేస్తూ తన పదవీని హోదా కాకుండా బాధ్యతగా భావించి సేవలు అందించి తధనంతర పరిణామాలు వలన తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయిడు గారి అమృత హస్తాలతో టి. డి.పి కండువా కప్పిచ్చుకొని నాటి నుండి పసుపు సైనికునిగా సేవలు అందిస్తూ సేవారత్న అనే బిరుదు మాత్రమే కాక అనేక అవార్డులు పొందటమే కాకుండా సత్తెనపల్లి పట్టణంలోనూ మరియు నియోజకవర్గంలో జరిగే పలు సేవా కార్యక్రమాలకు సంస్థలకు మార్గదర్శకులు మాకు మిత్రులు అయిన దివ్వెల శ్రీనివాసరావు కు 53 వ జన్మదిన శుభాకాంక్షలు. అంటూ మిత్ర బృందం తెలిపారు.

## సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ రివ్యూ మీటింగ్‌లో పాల్గొన్న 'కన్నా'

సత్తెనపల్లి, ఆగస్టు4, ప్రభాతవార్త: వెలగపూడి అసెంబ్లీ హాల్ నందు జరిగిన సబార్డినేట్ లెజిస్లేషన్ కమిటీ రివ్యూ మీటింగ్ లో కమిటీ చైర్మన్ మరియు సభ్యులతో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు, సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ.



## చెల్లని చెక్కు కేసులో జైలు, జరిమానా

సత్తెనపల్లి, ఆగస్టు4, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థాన న్యాయమూర్తి పి. ప్రియదర్శిని మంగళవారం చెక్కు బౌన్స్ కేసులో తీర్పు చెప్పారు. కేసు వివరాల్లోకి వెళితే సత్తెనపల్లి పట్టణంలోని బోయ కాలనీలో నివాసం ఉండే బంటుపల్లి సూర్యనారాయణ తండ్రి రాములు అనే వ్యక్తి దగ్గర విజయవాడ సిటిలోని దుర్గాపురం పున్నయ్య కాలనీ నివాసి అయిన తుమ్మల నాగేంద్ర ప్రసాద్ తండ్రి శ్రీనివాసరావు అను అతను తన కుటుంబ మరియు వ్యాపార అవసరాల నిమిత్తం ఒక లక్ష ముప్పై వేల రూపాయలు అప్పుగా తీసుకోని ది 15.5.17 వ తేదీన ఒక ప్రామిసరి నోటు వ్రాసి ఇవ్వగా సదరు నోటు బాకీ తీర్చమని కోరగా ఈ కేసులో ముద్దాయి సింగ్ నగర్ బ్రాంచి ఎస్. బి. ఐ కి చెందిన ఒక లక్ష ముప్పై వేల రూపాయల చెక్కు ను కేసులో పిర్యాదుదారుడు కు 27.6.18 తేదీన ఇవ్వగా సదరు చెక్కును కలక్షన్ నిమిత్తం పిర్యాది తన బ్యాంక్ అకౌంట్ అయిన విజయ బ్యాంక్ సత్తెనపల్లి లో ప్రెజెంట్ చేయగా ముద్దాయి అకౌంట్ బ్లాకడ్ అని చెక్కు బౌన్స్ అవ్వగానే పై న్యాయస్థానంలో చెక్కు బౌన్స్ కేసు వేయగా సుధీర్ఘ విచారణ అనంతరం న్యాయమూర్తి ఈ విధంగా తీర్పు ఇచ్చారు. ఆరు నెలలు జైలు శిక్ష వేశారు

## ఇంటింటికీ టిడిపి కార్యక్రమం



సత్తెనపల్లి, ఆగస్టు 4, ప్రభాతవార్త: 44వ బూత్ 8వ వార్డ్ ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం జరిపారు. గుజ్జర్లపూడి, స్టాలిన్ సత్తెనపల్లి పట్టణ టిడిపి ఎస్సీ సెల్ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## గత పాలకుల నిర్లక్ష్యమే మండాది ప్రజలపాలిట శాపం

వెల్దుర్తి, ఆగస్టు 4, ప్రభాతవార్త: గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ అస్తవ్యస్త పాలన, నిర్లక్ష్యం కారణంతోనే మండాది గ్రామంలో అభివృద్ధి కుంటుపడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. వెల్దుర్తి మండల పరిధిలోని మండాది గ్రామంలో కూటమి పార్టీల శ్రేణులు నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం..ప్రతి ఇంటికీ మీ జూలకంట్టి నిరంతర ప్రజా సంప్రదింపుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే గ్రామంలోని స్థానిక ఎస్సీ కాలనీ నుంచి ఇంటింటి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు కరపత్రాల ద్వారా వివరించారు.



నియోజకవర్గంలో ఇప్పటికే వేల కోట్ల రూపాయిల నిధులతో పలు సంక్షేమ, ప్రాజెక్టు పనులను పరుగులు తీయిస్తున్నామని స్పష్టం చేశారు. మండాది గ్రామంలో నిలిచిపోయిన రహదారుల నిర్మాణం కోసం దాదాపు రూ. 8 కోట్ల నిధులతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే ధీమా వ్యక్తం చేశారు. గ్రామంలో ఉన్న మురుగునీటి పారుదల సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. 'జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టి గ్రామంలో తాగునీటి ఎద్దడిని పూర్తిగా అరికడతామని హామీ ఇచ్చారు. ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎంపీపీ సంజీవ్ రెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజబోయిన మధుసూదన్ యాదవ్, వైస్ చైర్మన్ గుండాల శ్రీనివాస్ యాదవ్ టీడీపీ సీనియర్ నాయకులు కళ్లం రామాంజిరెడ్డి, జూలకంటి అక్కిరెడ్డి, గుజ్జుల పాపిరెడ్డి, వజ్రం నాయక్, రెడ్యా నాయక్, చెన్నారెడ్డి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

వెల్దుర్తి, ఆగస్టు 4, ప్రభాతవార్త: రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి రైతుకూ అండగా నిలుస్తామని మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం మండాది గ్రామ సచివాలయ ప్రాంగణంలో మండల రెవిన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "రాజముద్రతో కూడిన నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ" కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో నిర్వహించిన రీసర్వే



ప్రక్రియ ద్వారా లబ్ధి పొందిన దాదాపు 1,395 మంది రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాలను ఆయన స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించి మాట్లాడిన ఎమ్మెల్యే జూలకంటి, గత వైకాపా ప్రభుత్వ పాలనపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైకాపా హయాంలో దాదాపు 33 రకాల రైతు సంక్షేమ పథకాలను అటకెక్కించి రైతాంగ సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. వివాదాస్పద ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి, సర్వే రాళ్లు మరియు పాసుపుస్తకాలపై జగన్ బొమ్మలు ముద్రించుకుని రైతుల ఆస్తులను హరించే కుట్ర చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నూతన ల్యాండ్ గ్రాబింగ్ చట్టం తీసుకువచ్చి, రైతుల భూములకు సంపూర్ణ రక్షణ కల్పిస్తోందని తెలిపారు. పల్నాడు



ప్రాంత దశాబ్దాల కల అయిన వరికపూడిశెల ప్రాజెక్ట్ పనులు వేగవంతం అయ్యాయని, ఇప్పటికే భూసేకరణ మరియు ఫారెస్ట్ క్లియరెన్స్ పనుల కోసం ప్రభుత్వం రూ. 80 కోట్లు కేటాయించిందని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్ కింద మౌలిక వసతుల కల్పన శరవేగంగా జరుగుతోందని, వచ్చే ఏడాది నాటికి ప్రతి ఇంటికీ కులాయి ద్వారా తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెల్దుర్తి మండల తహశీల్దార్ ఎం. క్షమారాణి, డిప్యూటీ తహశీల్దార్ కేతావత్ రాజశేఖర్ నాయక్, ఆర్.ఐ లక్ష్మీనారాయణ, మండల సర్వేయర్ శ్రీనివాసరావు. ఎంపీపీ సంజీవ్ రెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజబోయిన మధుసూదన్ యాదవ్, వైస్ చైర్మన్ గుండాల శ్రీనివాస్ యాదవ్, టీడీపీ సీనియర్ నేతలు కళ్లం రామాంజిరెడ్డి, యువ నాయకుడు జూలకంటి అక్కిరెడ్డి, గుజ్జుల పాపిరెడ్డి, వజ్రం నాయక్, రెడ్యా నాయక్, చెన్నారెడ్డి, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

5MN 8 PG-GNT_5MN 8 PG-GNT.qxd 04-08-2026 PM 11:52 Page 1



## ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించాలి: సీఐ మురళి

గురజాల, ఆగస్టు 4 ప్రభాతవార్త : ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలని సీఐ మురళి అన్నారు. మంగళవారం పట్టణంలోని వెంకటరావు కాలనీలో నిర్వహించిన కార్డెన్‌సెర్చ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక ఎన్నికల దృష్ట్యా ఇరువురు సీఐలు, ఐదుగురు ఎస్ఐలు, 30 మంది సిబ్బంది కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. నేరాలు నివారించి ప్రశాంత వాతావరణం కల్పించేందుకు కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బంది పెడితే సహించేది లేదన్నారు. రౌడీ సీటర్లు, పాత కేసుల్లోని నిందితులపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. గృహాలు, పశువుల పాకలు, బడ్డీ దుకాణాల్లో తనిఖీలు జరిపి సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనాలు, ఆటోలు, గొడ్డళ్లు, కర్రలు, పారలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అనంతరం డీఎస్పీ మహేశ్వరరావు గ్రామస్తులతో సమావేశమై పలు అంశాలపై అవగాహన కల్పించారు. నాటుసారా, గుట్కా వినియోగం వలన కలిగే అనార్థాలను వివరించారు. అక్రమ మద్యం జోలికి వెళ్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వినోద్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## వివాహితపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తులపై కేసు నమోదు.

రెంటచింతల ఆగస్టు 4 ప్రభాతవార్త: వివాహితపై అసభ్యంగా ప్రవర్తించిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ సి.హెచ్ నాగార్జున తెలిపారు. మండలంలోని పాలువాయి గ్రామానికి చెందిన పుల్లారావు,కె. మల్లయ్య,హనుమంతు నాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ తెలిపారు.

## మినుము, పెసర పంటలనే సాగు చేసుకోవాలి

కాకుమాను ఆగస్టు 4( ప్రభాత వార్త): ప్రస్తుత వర్షా బావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటలైన మినుము, పెసర పంటలను సాగు చేసుకోవాలని వ్యవసాయ అధికారి వి.సుధాకర్ రైతులకు తెలిపారు. మంగళవారం మండల పరిధి లోని కొమ్మూరు , గార్లపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది.రైతులతో మండల వ్యవసాయ అధికారి మాట్లాడుతూ రైతులందరూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని వరి పంట వేయకుండా తక్కువ కాలపరిమితి గల మినుము పెసర పంటలను సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు కావలసిన ఎరువులు మండలంలోని ప్రతి ఒక్క రైతు,రైతు సేవా కేంద్రంలో ఉన్నాయి. మినుము పంటకు పసల బీమా యోజన క్రింద ఎకరాకు 200/కట్టుకోవచ్చని రైతులు తెలియజేశారు. ఈ అవకాశం ఆగస్టు 15,వ తేదీ వరకు ఉందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంలో సాగు పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ఘనజీవామృతం దవజీవామృతం బీజామృతం వాటి గురించి రైతులకు అవగాహన కల్పించారు వెలుగు ఏపీఎం సురేష్ మాట్లాడుతూ పంట పొలాల్లోనే కాకుండా ఇంటి మిద్దె తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా పశుసంవర్ధక శాఖ నుంచి వెటర్నరీ అసిస్టెంట్ శ్రీకాంత్ మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖలో జరిగే పథకాలు పశువులకు వచ్చే కొన్ని వ్యాధుల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది ఈ కార్యక్రమంలోగ్రామ వ్యవసాయ సహాయకులు షేక్ జరీనా, పవన్ ఏపీ సీఎం అఫ్ స్టాఫ్ మరియు రైతులు పాల్గొన్నారు.

## వర్షాల కోసం రైతన్నలు దేవాలయాల్లో వార్లు.

కాకుమాను ఆగస్టు 4 (ప్రభాతవార్త): మండల కేంద్రం కాకుమానులో ఎలినినో ప్రభావం వలన తీవ్ర వర్షబావం ఏర్పడటంతో రైతులు, మహిళలు అందరూ కలిసి అయా దేవస్థానాల్లో పసుపు, కుంకుమ కలిసిన నీళ్ళు వాల్లు పోయడం,సద్దిని నైవేద్యం గా పెట్టడం జరిగింది.గతంలో తీవ్ర వర్షబావ సమయంలో ఇలాగే వాల్లు, సద్దులు పెట్టడం వలన వర్షాలు కరిసినాయి అని గ్రామ పెద్దలు తెలపడం జరిగింది.అదే ఆనవాయితీగా మంగళవారం నుండి మూడు రోజుల పాటు ఈకార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతన్నలు,గ్రామ ప్రజలు ,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పత్తి పంటలో రసం పీల్చు పురుగుల నివారణపై రైతులకు లామ్ శాస్త్రవేత్తల సూచనలు

అచ్చంపేట,ఆగస్టు 4 (ప్రభాతవార్త): మండలంలోని ఓర్వకల్లు, గ్రంథసిరి గ్రామాల్లో నిర్వహించిన "పొలం పిలుస్తోంది" కార్యక్రమంలో లామ్ శాస్త్రవేత్తల బృందం ప్రత్తి పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేసింది. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో ప్రత్తి పంటపై రసం పీల్చు పురుగుల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ పురుగులు ఆకుల నుంచి రసం పీల్చడం వల్ల ఆకులు ముడుచుకుపోయి మొక్క ఎదుగుదల దెబ్బతింటుందని వివరించారు. నివారణ చర్యల్లో భాగంగా లీటరు నీటికి అసిఫేట్ 2 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 1 మిల్లీలీటర్ లేదా థయామెథాక్సామ్ 1 గ్రాము కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్తలు డా. ఎన్. సాంబశివరావు, డా. పి. సతీష్, డా. ఐ. రామారావు, డా. రవీంద్ర రెడ్డి, వ్యవసాయ శాఖ ఏడీఏ మస్తానమ్మ, స్థానిక మండల వ్యవసాయ అధికారి పి. వెంకటేశ్వర్లుతో పాటు వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రీ సర్వే గ్రామసభ అవగాహన ర్యాలీ

కాకుమాను ఆగస్టు 4 (ప్రభాతవార్త): రిసర్వేలో భాగంగా కాకుమాను మండలానికి సంబంధించిన 11 రెవెన్యూ గ్రామాలలో ఇప్పటివరకు బోడిపాలెం, కొల్లిమర్ల, పాండ్రపాడు, కాకుమాను గ్రామాలలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ చేయడం జరిగింది. అదేవిధంగా భల్లుభానుడు పాలెం గ్రామానికి సంబంధించి డ్రాఫ్ట్ పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ ప్రారంభమైంది. సెప్టెంబర్ 2026 నెలలో మిగిలిన గ్రామాలకు కూడా పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేయబడతాయి. రేటూరు మరియు అప్పాపురం గ్రామాలలో ప్రస్తుతం వి ఎస్ లాగిన్ పూర్తి కాగా, వి అర్ ఓ లాగిన్ నందు మ్యుటేషన్లు జరుగుతున్నాయి. కొమ్మూరు గ్రామంలో జి టి పూర్తి కాగా వి ఎస్ లాగిన్ నందు నమోదు చేయడం జరుగుతుంది. గరికపాడు గ్రామంలో గ్రౌండ్ ట్రూటింగ్ జరుగుతుంది. మిగిలిన కొండపాటూరు మరియు వల్లూరు గ్రామాలలో మంగళవారం రిసర్వే జరపడానికి గ్రామ సభలు నిర్వహించడం జరిగింది. నేటి నుండి సదరు గ్రామాలలో గ్రౌండ్ ట్రూటింగ్ మొదలుపెట్టడం జరుగుతుంది. కావున కొండపాటూరు మరియు వల్లూరు గ్రామాలలో వ్యవసాయ భూములు కలిగిన రైతులందరూ తమ భూమికి సంబంధించిన పత్రాలను గ్రామ సర్వేయర్ లేదా గ్రామ రెవెన్యూ అధికారులకు అందజేసి, అధికారులు భూమి పైకి వచ్చినప్పుడు అందుబాటులో ఉండవలసిందిగా తెలియజేయడమైనది. ఈ గ్రామ సభలలో మండల తహసీల్దారు బి. వెంకట స్వామి , కొండపాటూరు మరియు వల్లూరు గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, ప్రజా ప్రతినిధులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## మంగళగిరిలో టిఫిన్ బండ్లు, తోపుడు బండ్లు, రిక్షా బండ్ల పంపిణీ


మంగళగిరి, ఆగస్టు 4, ప్రభాతవార్త : రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో మంగళగిరి పట్టణం లోని చిరువ్యాపారులు, శ్రామికులకు ఉపాధి కల్పించే విధంగా మంత్రి నారా లోకేష్ సొంత నిధులతో పలువురు లబ్ధిదారులకు టిఫిన్ బండ్లు, తోపుడు బండ్లు, ప్లాట్‌ఫారం రిక్షా బండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు గుత్తికొండ



ధనుంజయరావు మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన చోట అండగా నిలిచి వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడటమే మంత్రి నారా లోకేష్ లక్ష్యమని అన్నారు. సంక్షేమం అంటే కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాకుండా ఉపాధి అవకాశాలు కల్పించి కుటుంబాలు గౌరవప్రదంగా జీవించేలా చేయడమే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 18వ వార్డుకు చెందిన దామర్ల సరోజినీ, 27వ వార్డుకు చెందిన మల్లూరి లలిత, 9వ వార్డుకు చెందిన కాటాబత్తుల శ్రీనుకు టిఫిన్ బండ్లు, 20వ వార్డుకు చెందిన పల్లపు అచ్చమ్మకు తోపుడు బండి, 21వ వార్డుకు చెందిన గరిక రాముకు ప్లాట్‌ఫారం రిక్షా బండిని అందజేశారు. మంత్రి నారా లోకేష్ అందించిన సహాయంతో తమ కుటుంబాలకు స్థిరమైన ఉపాధి లభించిందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం లో గుంటూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు మెంబెర్ తమ్మిశెట్టి జానకిదేవి, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్,బట్టు చిదానంద శాస్త్రి, గోవాడ దుర్గారావు తదితరులు పాల్గొన్నారు

## తల్లిపాలు బిడ్డకు అమృతం: డా.సుభాష్ రమాదేవి.

తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 4(ప్రభాతవార్త): తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి అన్నారు. స్థానిక పద్మశాలిపేట లోని ఆరోగ్య కేంద్రం లో మంగళవారం ఆశా దే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి మాట్లాడుతూ, తల్లిపాల వారోత్సవాలలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు తల్లిపాల యొక్క ఆవశ్యకతను వివరించాలనీ తెలిపారు. తల్లిపాలు బిడ్డకు సహజ సిద్ధమైన ఆహారమనియు , బిడ్డకు కాన్పు అయిన అరగంటలోపు తల్లిపాలు పట్టించాలన్నారు. తల్లిపాలలో ఏడు రకాలైన కార్బోహైడ్రేట్స్,



ప్రోటీన్స్, కొవ్వు పదార్థాలు ,విటమిన్లు, మినరల్స్, ఫైబర్ ,నీరు, వంటి పోషకాహార విలువలు కలిగిన ఆహార పదార్థములు కలవనియు, ముర్రుపాలలో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందని తెలిపారు. బిడ్డ తల్లిని ఆలింగనం చేసుకొనుటవలన తల్లి బిడ్డకు అన్యోన్యత, ఆప్యాయత, అనురాగము పెరుగునని అన్నారు. తల్లిపాలు 24 గంటలు అందుబాటులో ఉండుననియు, క్రిమిరహితముగా , సమ ఉష్ణోగ్రత వద్ద నిల్వ ఉండి తేలికగా జీర్ణమవుతాయన్నారు. తెనాలి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ అంధే బాలచంద్రమోళి మాట్లాడుతూ, ప్రస్తుత వర్షాకాలంలో ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కీటక జనిత వ్యాధులనుండి అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది తెలియజేయాలన్నారు . నీటి నిల్వలు ఉన్నచోట మడ్డి ఆయిల్ కానీ ,వాడిన వంట నూనెను కానీ పిచికారి చేసినట్లయితే దోమల వృద్ధిని అరికట్టవచ్చు అన్నారు. ఈ సమావేశంలో హెల్త్ విజిటర్ చింతల ప్రసన్న పుష్పలత ,మలేరియా సూపర్వైజర్ దీపాల శ్రీనివాసరావు, డిఈఓ శ్రీదేవి, ఆశా కార్యకర్తలు సచివాలయ ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధి-ప్రజాసంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలి

పొన్నూరు, ఆగస్టు 4,ప్రభాతవార్త: గ్రామాభివృద్ధి-ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మండలంలోని అన్నిశాఖల అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామాల సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక సమీక్షా సమావేశం



నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు సేవ చేసేందుకు, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని పరిష్కరిస్తూ గ్రామాల సమగ్రాభివృద్దే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మత్తులు చేపట్టి, కొత్త సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్ల నిర్మాణానికి తక్షణమే అంచనాలు సిద్ధం చేయాలన్నారు.రైతుల పొలాలకు వెళ్ళే డొంకలను అభివృద్ధి చేసి, వ్యవసాయ రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన పనులను చేపట్టాలన్నారు.రైతులకు సాగునీరు సకాలంలో అందేలా సాగునీటి కావుల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి, కాలువలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామంలో పారిశుద్ధ్య లోపం లేకుండా నిరంతరం చెత్త సేకరణ చేపట్టాలన్నారు.డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు బ్లీచింగ్, ఫాగింగ్ చేపట్టాలన్నారు. చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. పలు బిటి రోడ్లకు నిధులు మంజూరు అయ్యాయని త్వరలోనే వీటి పనులు ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో ఎంపిడిఓ గుమ్మా చంద్రశేఖరరావు, వివిధశాఖల అధికారులు, ఎస్సీ కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బండ్లమూడి బాబూరావు, గుంటూరు పార్లమెంట్ రైతువిభాగం ఉపాధ్యక్షుడు బొర్రు రామారావు తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు అమృతంతో సమానం

పొన్నూరు, ఆగస్టు 4,ప్రభాతవార్త: తల్లిపాలు అమృతంతో సమానమని చేబ్రోలు అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నగరాజకుమారి అన్నారు. మండల కేంద్రమైన చేబ్రోలులోని కొత్తపేట అంగన్‌వాడీ సెంటర్లో జరిగిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల క్యాక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు



అంగన్‌వాడీ కార్యకర్త షేక్ సలీమా అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నగరాజకుమారి మాట్లాడుతూ ఆగస్టు 1నుండి 7వరకు వారోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ వారోత్సవాలలో గర్భవతులు, బాలింతలు 0-3సంవత్సరాల పిల్లల తల్లులు, అమ్మమ్మలు, నాయనమ్మలు, అత్తలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. కార్యకర్త సలీమా మాట్లాడుతూ బిడ్డ పుట్టగానే ముర్రుపాలు పట్టించడం శ్రేయస్కరమన్నారు. తల్లిపాలలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయన్నారు. ప్రతి పసిబిడ్డ తల్లి శిశువుకు క్రమం తప్పకుండా పాలు ఇవ్వాలన్నారు. స్థిరమైన పోషకాలను శిశువుకి అందించడమే కాకుండా పలు వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

## ప్రజల కష్టాలను తీర్చేందుకే ముఖ్యమంత్రి సహాయనిధి

పొన్నూరు, ఆగస్టు 4,ప్రభాతవార్త: ప్రజల కష్టాలను తీర్చేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అన్నారు. స్థానికంగా జరిగిన కార్యక్రమంలో



ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ మాట్లాడుతూ ప్రజల కష్టాల్లో తోడుగా..ప్రజా సేవలో ముందుగా పొన్నూరు ప్రజల విశ్వాసానికి నిదర్శనంగా పనిచేస్తున్నామన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. మండల పరిధిలోని వెల్లలూరు, ములుకుదురు, పొన్నూరు పట్టణంలోని 29వ వార్డుకు చెందిన ఇద్దరికి మొత్తం నలుగురు బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ములుకుదురుకు చెందిన మందలం రాజకుమారికి రూ.1లక్ష, వెల్లలూరు గ్రామానికి చెందిన కుక్కకాటుకు గురైమృతి చెందిన కార్తీక్ కుటుంబ సభ్యులకు రూ.1లక్ష,పట్టణంలోని 29వ వార్డుకు చెందిన పోలిబోయిన వీరయ్య, మస్తానమ్మ దంపతులకు రూ.1లక్ష, ఏలూరి శివ వెంకట కార్తీక్ ఆత్మహత్య చేసుకోవడంతో వీరి కుటుంబ సభ్యులకు రూ.1లక్ష చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బొర్రు రామారావు, మాదల వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణచౌదరి, షేక్ సుల్తాన్, షేక్ బాజిసాహెబ్, పఠాన్ ఫిరోజ్‌ఖాన్, గణిపిశెట్టి రామకృష్ణ, బండ్లమూడి బాబూరావు తదితరులున్నారు.

## పేద, మధ్య తరగతి కుటుంబాలకు అవగాహన కల్పించాలి

పొన్నూరు, ఆగస్టు 4,ప్రభాతవార్త: ఎడ్యుకేషనల్ లోన్స్‌పై పేద, మధ్య తరగతి కుటుంబాల్లో కూడా అవగాహన కల్పించాల్సిన బాధ్యత బ్యాంకుల అధికారులపై ఉందని సెయింట్ మేరీస్ గ్రూఫ్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ జోసెఫ్ మోసిగంటి అన్నారు. సెయింట్ మేరీస్ విద్యాలయంలో మంగళవారం జరిగిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. ఎడ్యుకేషనల్ లోన్లు ఇప్పటి వరకు ప్రధానంగా ఉన్నత వర్గాలు వారు మాత్రమే ఉపయోగించుకొంటున్నారని, పేద, మధ్య తరగతి కుటుంబాల్లో సరైన అవగాహన లేకపోవడంతో




రుణాలకు ఆయా వర్గాలు దూరమయ్యాయన్నారు. తల్లిదండ్రులు పిల్లల ఉన్నత విద్యకోసం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సంస్థ ఛైర్మన్ డాక్టర్ కెవికె రావు సూచనల మేరకు అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతి అర్హత కలిగిన విద్యార్థి ప్రభుత్వ, బ్యాంకింగ్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, తద్వారా ఉన్నత విద్యను పూర్తి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ డివి రామాంజనేయ కుమార్ మాట్లాడుతూ అర్హత కలిగిన విద్యార్థులకు ఎటువంటి అదనపు గ్యారెంటి లేకుండా వారి కోర్సు ఫీజులను ఆధారంగా చేసుకొని గరిష్టంగా రూ.7.50లక్షల వరకు ఎడ్యుకేషనల్ లోన్ మంజూరు చేయవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ కోర్సుల్లో ఏ సంవత్సరంలో ఉన్నప్పటికీ లోన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కోర్సు పూర్తయిన తర్వాత ఒక సంవత్సరం వరకు, ఉద్యోగం వచ్చే వరకు (బ్యాంకు నిబంధనల ప్రకారం) ఈఎంఐ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో చేబ్రోలు, తెనాలి, యూనియన్ బ్యాంకు మేనేజర్లు, కళాశాల ప్రిన్సిపాల్ రవిబాబు, అకడమిక్ డీన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మెగా డిఎస్సీపై వైకాపా ఆరోపణలు రాజకీయ కుట్రలో భాగమే

పొన్నూరు, ఆగస్టు 4,ప్రభాతవార్త: మెగా డిఎస్సీ నియామకాలపై వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, రాజకీయ లబ్ధి కోసమే చౌకబారు ఆరోపణలు చేస్తుందని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఎస్సీ నియామకాలు పారదర్శకంగా




జరిగాయంటూ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ మాట్లాడుతూ వైకాపా అధికారంలో ఉన్న ఐదేళ్ళలో జాబ్ క్యాలెండర్ ఇవ్వకుండా నిరుద్యోగ యువతను మోసం చేశారన్నారు. వైకాపా విధ్వంసం, అరాచకాలతో పాలన చేసిందన్నారు.ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలి సంతకంతోనే మెగా డిఎస్సీ నిర్వహణకు ఆమోదం తెలిపారన్నారు.మెగా డిఎస్సీ ద్వారా సుమారు 16వేల మంది అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు.నియామకాలనుఅ డ్డుకునేందుకు 200కేసులు దాఖలైనప్పటికీ, అన్నీ న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి ప్రభుత్వం పారదర్శకంగా డిఎస్సీని నిర్వహించిందన్నారు.ఎంపికైన అభ్యర్థులు ఇప్పటికే శిక్షణ పూర్తి చేసుకొని విధుల్లో చేరుతున్న సమయంలో దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు వైకాపా ఇప్పుడు నిరసనలకు దిగడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పొన్నూరు నియోజకవర్గానికి చెందిన 45మంది డిఎస్సీద్వారా ఉద్యోగాలు పొందారన్నారు. వైకాపా నాయకులకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే క్షేత్రస్థాయిలో ఆ అభ్యర్థులను, వారి కుటుంబాలను కలిసి మాట్లాడాలని సవాల్ విసిరారు. కూటమి ప్రభుత్వం వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఉదో ్యగాలు సాధించిన అభ్యర్థులు, వారి కుటుంబాల్లో అనవసర ఆందోళన కలిగించే విధంగా వైకాపా వ్యవహరించడం బాధ్యాతారాహిత్యానికి నిదర్శనమన్నారు. ర్యాలీలో యరసాని శ్రీరామమూర్తి, తోట ప్రసాద్, కత్తుల రవికిరణ్, దాసరి విజయకుమార్, మాదల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబూరావు, గణిపిశెట్టి రామకృష్ణ, బుడ్డా బీరయ్య, మువ్వా వెంకటకృష్ణ, బండారుపల్లి శ్రీనివాసరావు, ఆశీర్వాదం తదితరులున్నారు.

## ప్రధానమంత్రి ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

పొన్నూరు, ఆగస్టు 4,ప్రభాతవార్త: అర్హులైన రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాజవరపు వెంకటేశ్వరారవు సూచించారు. మండల పరిధిలోని వడ్డిముక్కల, కొండముది గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది



కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వరిపైరుకు ఎకరాకు రూ.8వందల ప్రీమియం చెల్లించి రూ.40వేల బీమాను పొందవచ్చన్నారు. ఈ నెల 15వ తేదీ లోపు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. ప్రతి రైతు స్వయముగా స్వీయ ధృవీకరణ ఇచ్చి మీ సేవ కేంద్రములో ఆధార్‌కార్డు, పాస్‌బుక్, బ్యాంకు ఖాతా పుస్తకము తీసుకుని వెళ్ళి చెల్లించాలన్నారు. రైతులకు ఎపి ఎయిమ్స్ యాప్ ద్వారానే ఎరువులు ఇవ్వడం జరుగుతుందన్నారు.ప్రతి రైతు సేవా కేంద్రం వద్ద ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఐ.శ్రీకాంత్, వ్యవసాయ సహాయకుడు టి.ప్రసాద్, ఎం.వంశీ, ఎంపీఈఓ సింహాద్రి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణాంతక వ్యాధులకు సకాలంలో స్పందిస్తే ప్రాణదానమే: యశోదా హాస్పిటల్ వైద్యులు.

తెనాలి ఆగస్ట్4(ప్రభాతవార్త): ప్రాణాంతక వ్యాధులను సకాలంలో గుర్తిస్తే ప్రాణాపాయం తప్పించవచ్చని, యశోదా హాస్పిటల్ వైద్యలు సూచించారు. మంగళవారం తెనాలి పట్టణంలోని బోస్ రోడ్డు లోగల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, పక్షవాతం ముప్పును పసిగడితే మెదడుకు రక్షని, అత్యాధునిక సాంకేతికతతో కేవలం ఐదు రోజుల్లోనే ప్రాథమిక క్యాన్సర్‌కు కళ్లెం వెయ్యచ్చని, యశోద హాస్పిటల్స్ వైద్యులు వెల్లడించారు.మారుతున్న జీవనశైలి, పెరుగుతున్న మానసిక ఒత్తిడి,



మధుమేహం, అధిక రక్తపోటుతో పాటు మద్యపానం, ధూమపానం వంటి దురలవాట్లు మానవాళిని నరాల సంబంధిత వ్యాధులు, క్యాన్సర్ వంటి మహమ్మారుల బారిన పడేలా చేస్తున్నాయి. ఈ ఆందోళనకర పరిస్థితుల్లో సకాలంలో వ్యాధిని గుర్తించి, ఆధునిక వైద్య పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటే ప్రాణాపాయం నుంచి సులభంగా బయటపడవచ్చని సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ వైద్య బృందం స్పష్టం చేసింది.ప్రఖ్యాత నాడీ సంబంధిత వ్యాధుల చికిత్సా నిపుణుడు (న్యూరో ఫిజీషియన్) డాక్టర్ జొన్నలగడ్డ మోహన కృష్ణ, వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన ప్రముఖ క్యాన్సర్ వికిరణ చికిత్సా నిపుణుడు (రేడియేషన్ ఆంకాలజిస్ట్) డాక్టర్ ప్రదీప్ కుమార్ కరుమంచి పాల్గొని పలు కీలక విషయాలను వెల్లడించారు. వైద్య రంగంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలతో నరాల వ్యాధులు, క్యాన్సర్, గుండె సంబంధిత సమస్యలు, అవయవ మార్పిడి వంటి అనేక విభాగాల్లో అద్భుతమైన సేవలందిస్తున్న సోమాజిగూడ యశోద హాస్పిటల్స్ పనితీరును వారు ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ మీడియా సమావేశంలో ఆసుపత్రి ఆంధ్రప్రదేశ్ మార్కెటింగ్ విభాగాధిపతి వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డునిర్మాణ పనులు వేగవంతం చేయండి: మున్సిపల్ కమీషనర్

తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 4(ప్రభాతవార్త): రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమీషనర్ రామ అప్పలనాయుడు తెలిపారు.మంగళవారం పట్టణం లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మున్సిపల్ ఇంజనీర్ పినప శ్రీకాంత్ తో కలిసి పరిశీలించారు. అందులో భాగంగా రెండవ వార్డ్ గోలీ డొంక లో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.వాటితో పాటు గంగానమ్మపేట హుడా కాలనీ ఎడ్ల లింగయ్య నగర్ ,టీచర్స్ కాలనీ, చెంచుపేట, బాలాజీ రావు పేట, తదితర ప్రాంతాలలో చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రాంతాలను పరిశీలించారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఇంజనీరింగ్ సిబ్బందినీ ఆదేశించారు.పనుల నాణ్యతలో రాజీ పడవద్దని, పనులు వేగవంతంగా పూర్తి చేసే విధంగా చూడాలని సూచించారు. గ్రీన్ గుంటూరు కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పలు ప్రాంతాల్లో నాటిన మొక్కలను పరిశీలించి వాటికి ఏర్పాటుచేసిన ట్రీగార్డ్స్ ను పరిశీలించారు. పట్టణంలో పచ్చదనానికి పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత నివ్వాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆకుల శ్రీనివాస్,ఏఈ లు ఆంజనేయరాజు, కళ్యాణ్, సునీల్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాభావ పరిస్థితుల పట్ల రైతులు అవగాహనతో పంటల సాగు చేపట్టాలి

చెరుకుపల్లి, ఆగస్టు 4, ప్రభాతవార్త : రైతులు వర్షాభావ పరిస్థితి పట్ల అవగాహనతో పంట సాగు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి ఎండి ఫరూక్ అన్నారు. మంగళవారం ఆళ్లవారిపాలెం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితి, జలాశయాల్లో నీటి నిల్వలు, తద్వారా ప్రత్యమ్నాయ పంటలు పెసర, మినుము పప్పు ధాన్యాలు సాగు గురించి రైతులకు వివరించారు. ప్రభుత్వం రైతులకు కల్పిస్తుంది వ్యవసాయ పథకాల ప్రయోజనాల గురించి అవగాహన కలిగి ఉండి వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి డి శివరామకృష్ణ, వ్యవసాయ విస్తరణ అధికారులు బీడీ రామకృష్ణ, టి అఖిల, రాహేల్ రావు, రైతులు పలువురు పాల్గొన్నారు.

## దేవుని వాక్యాలతో పొందుపరచిన బైబిల్ వెలుగునిస్తుంది: బిషప్ డాక్టర్ పినపాటి జాన్ పాల్

తెనాలి మున్సిపాలిటీ ఆగస్ట్ 4(ప్రభాతవార్త): పట్టణంలోని జయప్రకాష్ నగర్ లో గల బిషప్ డాక్టర్ పాముల పరంజ్యోతి సారథ్యంలోని జియోన్ ఫెయిత్ సిటీ చర్చిలో ది తెనాలి పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆగస్టు మాస సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన సమావేశానికి అసోసియేషన్ అధ్యక్షులు బిషప్ డాక్టర్ పాముల పరంజ్యోతి అధ్యక్షత వహించారు. దేవుని సువార్త గీతాలాపనలు, పలువురు దైవ సేవకుల ప్రార్థనలతో జరిగిన సమావేశంలో బిషప్ డాక్టర్ పినపాటి జాన్ పాల్ దేవుడు పొందుపరచిన బైబిల్ వెలుగును అందిస్తుందన్న అంశంతో వాక్య పరిచర్య చేశారు.ఆ సమావేశంలో డాక్టర్ కత్తెర సురేష్ కుమార్ మాట్లాడుతూ,సేవకుల ఐక్యత కలిగి ఉండటం శ్రేయస్కరమన్న అభిప్రాయాన్ని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ సాటివారిపై ప్రేమ దయ జాలి కలిగి ఉండాలని సూచించారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి రెవరెండ్ సువర్ణ రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి రెవరెండ్ మల్లవరపు విజయ్ కుమార్ లు పర్యవేక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రేమ విందు నిర్వహణ పాస్టర్లకు కానుకల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు చిల్కా జాన్ వరప్రసాదరావు, అన్నం ఆదాం, కిషోర్, యోసోబు, గడ్డం జాన్ బాబు, రజినీకాంత్ తెనాలి ప్రాంత పాస్టర్లు పాల్గొన్నారు.


## ఛలో ఢిల్లీపోస్టర్ ఆవిష్కరణ

తెనాలి ఆగస్ట్4(ప్రభాతవార్త): సి.పి.ఐ.పార్టీఆద్వర్యంలోచేపట్టిన పాదయాత్రలు, చలో ఢిల్లీ కార్యక్రమాలను జయప్రదం చేయాలని సి.పి.ఐ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావుపిలుపు ఇచ్చారు సోమవారం తెనాలి గాంధీనగర్ సిపిఐ కార్యాలయంలో "మార్పు అవసరం" "బద్లావ్ జరూరీహై" పోస్టర్ విడుదల సందర్భంగా మాట్లాడారు ధరలు పెరుగుదలను తక్షణమే అరికట్టాలని, విద్య, ఆరోగ్యం అందుబాటులోకి తీసుకు తేవాలని, పంటలు కనీసం మద్దతు ధరలు చట్టబద్ధత కల్పించాలని, బ్యాలెట్ పేపర్ పద్ధతిలో ఎన్నికలు పునరుద్ధరించాలని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, దేశంలోని యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని, మహిళా రిజర్వేషన్ తక్షణం అమలుపరిచే విధంగా ప్రభుత్వం ముందుకు రావాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని, దళిత,ఆదివాసీలపై అకృత్యాలను, దాడులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆగష్టు 6నుండి15వరకు పాదయాత్రలు,ఆగస్టు 17 నుంచి 28 వరకు ప్రజాసంఘాల ప్రచారం ఆందోళన చేయాలని విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 1 తేది ఖిచలోఢిల్లీఖి కార్యక్రమంవిజవంతంచేయాలన్నారు. బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను గెలుపు తర్వాత విస్మరించారని చెప్పారు. ప్రతి ఒక్కరు దృఢవిశ్వాసంతో సిపిఐ చేపట్టిన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు ఎఐటియుసి తెనాలి కార్యదర్శి తుంగా బాలస్వామి మాట్లాడుతూ కార్మికులలో నిరంతరం పెరుగుతున్న అభద్రత భావాన్ని ఎదుర్కొంటున్నారని, కార్మిక రక్షణ బలహీనమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు ప్రజాస్వామ్య ప్రక్రియపై నమ్మకాన్ని పునరుద్ధరించేందుకు భారతదేశంలో తక్షణమే ఎన్నికల అవసరమన్నారు. ఎన్నికల్లో పెరుగుతున్న ధన,కండబల ప్రయోగాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.సమావేశంలో బొల్లిముంత కృష్ట,దేవరపల్లి నీలాబరం తదితరులు పాల్గొన్నారు.

## డిఎస్సీ నియామకాలపై సీబిఐ విచారణ చేయించాలి

### వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ

పొన్నూరు, ఆగస్టు 4,ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అక్రమాలకు పాల్పడుతూ, రాష్ట్రంలో పాలనను గాలికొదిలేసిందని వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కట్టెంపూడి అడ్డరోడ్డు వద్ద ఉన్న గోవాడ ఫంక్షన్ హాలులో మంగళవారం టౌన్ హాల్ సమావేశం జరిగింది. సమాశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఇటీవల కూటమి ప్రభుత్వం నిర్వహించిన డిఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని రాష్ట్ర మంతటా నిరుద్యోగ యువత ఆందోళనలు చేస్తున్నారన్నారు.



ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే డిఎస్సీపై జరిగిన అక్రమాలకు సంబంధించి పూర్తి విచారణ చేపట్టేందుకు కేసును సిబిఐకి అప్పగించాలని, తద్వారా ప్రభుత్వం తమ చిత ్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. డిఎస్సీ అక్రమాలకు కారణమైన విద్యాశాఖామంత్రి నారా లోకేష్ తక్షణమే మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు నిరుద్యోగులకు రూ.3వేలు నిరుద్యోగ భృతి అందజేయాలన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళు గడిచిన అభివృద్ధి చేయపోగా ప్రతిపక్ష పార్టీ అయిన వైకాపాపై విమర్శలు చేస్తూ కాలయాపన చేస్తుందన్నారు. ప్రభుత్వ అక్రమాలను, అవినీతిని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీలపై అక్రమ కేసులు పెట్టడం వంటి వాటికి పాల్పడుతూ ప్రజల గొంతును నొక్కేస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే డిఎస్సీపై సీబిఐ విచారణ జరిపించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రకాలుగా ఆందోళనలను చేస్తామని హెచ్చరించారు. డిఎస్సీలో జరిగిన అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రశ్నించిన వైకాపా నాయకులపై కేసులు నమోదు చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటివి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రతిపక్షపార్టీలపై విష ప్రచారం చేయడం మానుకొని సుపరిపాలన అందించే దిశగా అడుగులు వేయాలని మురళీకృష్ణ సూచించారు. ఈ నెల 6,7,8,9తేదీల్లో విద్యార్థి యువజన విభాగం ఆధ్వర్యంలో జరిగే రిలే నిరాహారదీక్షల్లో విద్యార్థిని విద్యార్థులు, యువజన విభాగం సభ్యులు, పలు అనుబంధ విభాగా సభ్యులు పాల్గొనాలని కోరారు. ఈ నెల 10వ తేదీ జరిగే నియోజకవర్గస్థాయి ర్యాలీని జయప్రదం చేసేవిధంగా నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, చింతలపూడి మురళీకృష్ణ, అంబటి వెంకటేశ్వరరావు, దక్కుమళ్ళ రవి, బోయిన శివనాగరాజు, మూకిరి అనీలకుమారి, మండ్రు అనిత, లంపోతు పిచ్చిరెడ్డి, బోయిన శివశంకర పద్మారావు, చుండూరు వీరయ్య, షేక్ మౌలాలి, ఆళ్ళ శ్రీరామిరెడ్డి, మల్లికార్జునరెడ్డి, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

5-8Pg5_5-8Pg5.qxd 04/Aug/26 10:52 PM Page 1



# రోజూ రగడ.. సాగని పార్లమెంటు




## 'జీరో అవర్'ను మింగేస్తున్న ప్రతిపక్షం

### వరుస వాయిదాలతో స్తంభిస్తున్న ఉభయ సభలు

### అత్యవసర బిల్లులకే ఆమోదముద్ర

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** పార్లమెంట్‌లో ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌ను ప్రతిపక్ష సభ్యులు పదేపదే అడ్డుకుంటున్నారని, దీంతో ప్రజలకు సంబంధించిన కీలక అంశాలను సభ దృష్టికి తీసుకురావడానికి ఎంపీలకు అవకాశం లేకుండా పోతోందని బిజెపి ఎంపీ సంబిత్ పాత్ర ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా నినాదాలు, ఆందోళనలు, గందరగోళం కారణంగా సభలు వాయిదా పడటం సాధారణమే అయినప్పటికీ, ఈ యేడాది వర్షాకాల సమావేశాలు అత్యంత నిరుత్సాహకరంగా సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ యేడాది మాన్సూన్ సమావేశాలు గతనెల 20న ప్రారంభమై ఆగస్టు 13 వరకు కొనసాగనున్నాయి. ఆగస్టు 4 నాటికి మొత్తం 12 సమావేశ దినాలు పూర్తయ్యాయి. అయితే నీట్ ప్రశ్నాపత్రం లీక్ అంశం, రామ మందిర విరాళాల దొంగతనం వ్యవహారాలపై ప్రతిపక్ష నిరసనల కారణంగా సభా కార్యక్రమాలు పలుమార్లు అంతరాయం ఎదుర్కొన్నాయి. మొదటి వారంలోనే లోక్‌సభ, రాజ్యసభలు వరుస వాయిదాలతో దాదాపు స్తంభించిపోయాయి. లోక్‌సభ మొత్తం నిర్ణయించిన సమయంతో పోలిస్తే కేవలం 1.6 గంటలు మాత్రమేపనిచేయగా, ఇది కేటాయించిన సమయంలో కేవలం 5 శాతం మాత్రమే. రాజ్యసభ కూడా కేవలం 1.7 గంటలు మాత్రమే సమావేశమై, మొత్తం సమయంతో పోలిస్తే 6 శాతం మాత్రమే పనిచేసినట్లు సమాచారం. గతనెల 27న ఉభయ సభలు రోజంతా వాయిదా పడ్డాయి. జూలై 31న జనన-మరణాల నమోదు (సవరణ) బిల్లును చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదించినప్పటికీ, అనంతరం రెండు సభలు ముందుగానే వాయిదా పడ్డాయి. ఈ సమావేశాల్లో ఇప్పటివరకు ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ ఒక్కసారి కూడా పూర్తిస్థాయిలో నిర్వహించలేకపోయాయి. తొలుత నీట్ పేపర్ లీక్ అంశం, అనంతరం రామమందిర దొంగతనం వివాదంపై ప్రతిపక్ష ఆందోళనల కారణంగా సభా కార్యకలాపాలు నిలిచిపోయాయి.

**రూ.190 కోట్ల ప్రజాధన వృధా**

అధికారుల అంచనాల ప్రకారం పార్లమెంట్ నిర్వహణకు ప్రతి నిమిషానికి సుమారు రూ.2.5 లక్షల వ్యయం అవుతుంది. అంటే ఒక్క సమావేశ దినానికి దాదాపు రూ.9 కోట్ల వరకు ఖర్చు అవుతోంది. ఇందులో మౌలిక సదుపాయాలు, సిబ్బంది, భద్రత, లాజిస్టిక్స్, ఎంపీల భత్యాలు వంటి వ్యయాలు ఉంటాయి. 12 సమావేశ దినాలకు కేటాయించిన మొత్తం 144 గంటల్లో సుమారు 95 శాతం సమయం వాయిదాలకే పరిమితమైనట్లు అంచనా.

దీంతో ఈ సమావేశాల కాలంలోనే రూ.150 కోట్ల నుంచి రూ.190 కోట్ల వరకు ప్రజాధనం వృథా అయి ఉండొచ్చని అంచనాలు సూచిస్తున్నాయి. గత సమావేశాల గణాంకాలను పరిశీలిస్తే, ఈ మాన్సూన్‌సమావేశాలు ఇటీవలి కాలంలో అత్యంత తక్కువ పనితీరు కనబరిచిన సమావేశాల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. 2025 మాన్సూన్ సమావేశాల కంటే కూడా అధ్వాన్నంగా ఉన్నాయని విశ్లేషణలు పేర్కొంటున్నాయి.

**కీలక బిల్లులకు ఆమోదం**

సభలో అంతరాయాలు కొనసాగుతున్నప్పటికీ, రెండు కీలక బిల్లులు మాత్రం పార్లమెంట్ ఆమోదం పొందాయి. వాటిలో జాతీయ గౌరవానికి అవమానాల నిరోధక బిల్లు మరియు ప్రజా పరీక్షల్లో అక్రమాలకు నిరోధక (యాంటీ పేపర్ లీక్) సవరణ బిల్లు ఉన్నాయి. వందే మాతరం బిల్లు ప్రకారం జాతీయ పతాకం, రాజ్యాంగం, జాతీయ గీతంతో పాటు జాతీయ గానం వందేమాతరంను అవమానించడం కూడా శిక్షార్హ నేరంగా పరిగణించబడుతుంది.

ఉద్దేశపూర్వకంగా వందే మాతరం ఆలాపనను అడ్డుకోవడం లేదా సభల్లో అంతరాయం కల్పించడం వంటి చర్యలకు గరిష్ఠంగా మూడు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. ఈ బిల్లుకు జూలై 29న రాజ్యసభ, జూలై 30న లోక్‌సభ ఆమోదం తెలిపాయి. అదేవిధంగా, పరీక్షల్లో మోసాలు, ప్రశ్నాపత్రాల లీకులు, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా జరిగే అక్రమాలను మరింత కఠినంగా అరికట్టేందుకు 2024 చట్టానికి సవరణగా యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చారు.

సవరణల ప్రకారం నిందితులకు 5 నుంచి 10 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు జరిమానా విధించే నిబంధనలు ప్రతిపాదించారు.



## ట్రంప్ కొత్త సుంకాలపై కోర్టుకెక్కిన 25 రాష్ట్రాలు

**వాషింగ్టన్, ఆగస్టు 4:** సుంకాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న నిర్ణయం ఇప్పుడు న్యాయపరమైన చిక్కుల్లో పడింది. భారత్‌తో సహా 60 భాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన కొత్త పన్నులను సవాలు చేస్తూ.. అమెరికాలోని 25 డెమొక్రటిక్ పార్టీ నేతృత్వంలోని రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ ప్రభుత్వం తమ చట్టబద్ధమైన పరిమితులను దాటి వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ దావా వేశాయి. న్యూయార్క్‌లోని 'యుఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్'లో 25 రాష్ట్రాల కూటమి ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. వెట్టి చాకిరీ ద్వారా తయారు చేసిన వస్తువుల దిగుమతులపై సరైన నిషేధం అములు చేయడం లేదనే ఆరోపణలతో గత నెలలో ట్రంప్ ప్రభుత్వం సుంకాలను విధించింది. భారత్ సహా దాదాపు 60 భాగస్వామ్య దేశాల నుంచి వచ్చే దిగుమతులపై 10 శాతం నుంచి 12.5 శాతం వరకు కొత్త సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సుంకాల వల్ల వినియోగదారులు, వ్యాపారాలపై భారం పడుతుందన్న 25 రాష్ట్రాలు ఇప్పుడు కోర్టును ఆశ్రయించాయి. ఇంతకుముందు కూడా ట్రంప్ విధించిన అనేక సుంకాల నిర్ణయాలు అమెరికా కోర్టులలో చట్టపరమైన చిక్కులను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ కొత్త టారిఫ్‌లపై నమోదైన కేసు ట్రంప్ వాణిజ్య విధానాలకు మరో పెద్ద పరీక్షగా మారనుంది.

ప్రారంభంలో భారత్‌పై 12.5 శాతం టారిఫ్ విధించాలని ప్రతిపాదించినప్పటికీ.. వెట్టి చాకిరీ నిరోధక చట్టాల అమలును భారత్ వేగవంతం చేయడంతో పన్నును 10 శాతానికి తగ్గించారు. చమురు, సహజవాయువు, ఎరువుల దిగుమతులకు, అలాగే యుఎస్-మెక్సికో-కెనడా వాణిజ్య ఒప్పందం పరిధిలోకి వచ్చే వస్తువులకు ఈ పన్నుల నుంచి మినహాయింపు ఇచ్చారు.

## 18 యేళ్లకే ప్రొఫెసర్

### 306 యేళ్ల రికార్డు బద్దలు



**వాషింగ్టన్, ఆగస్టు 4:** పట్టుదల ఉండాలే గానీ.. అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయవచ్చని నిరూపించాడు అమెరికాకు చెందిన నాథన్ థామస్. చాలామంది 18 యేళ్ల వయసులో ఉన్నత విద్యలోకి అడుగు పెడుతుంటే.. అతడు మాత్రం తరగతి గదిలో పాఠాలు చెబుతున్నాడు. పదేళ్ల వయసులోనే కళాశాల చదువు ప్రారంభించిన థామస్.. 18 యేళ్లకే ప్రొఫెసర్‌గా అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన పురుష ప్రొఫెసర్‌గా గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించాడు. ఈ విషయంలో దాదాపు 300 యేళ్ల నాటి రికార్డును థామస్ బద్దలు కొట్టాడు. అంతకుముందు 1717లో స్కాట్లాండ్ గణిత శాస్త్రవేత్త కొలిన్ మెక్‌లారిన్ తన 19 యేళ్ల వయసులో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు. ఆయన రికార్డును తాజగా థామస్ అధిగమించాడు.

అమెరికాలోని మియామీ కాలేజీలో ఇంజినీరింగ్ అధ్యాపకుడిగా బాధ్యతలు చేపట్టిన థామస్.. తనతో దాదాపు సమానమైన వయసున్న విద్యార్థులకు బోధించడం విశేషం. నాథన్ థామస్ పదేళ్ల వయసులోనే డ్యుయల్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం కింద మియామీ కాలేజీలో చేరాడు. అనంతరం 14 యేళ్లకే ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీలు పూర్తి చేశాడు. ఇప్పుడు ప్రొఫెసర్‌గా ఇంజినీరింగ్ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నాడు. ఇంజినీర్ల కుటుంబంలో పెరగడం, గణితంపై తల్లి ఆసక్తి పెంచడమే తన ఎదుగుదలకు బలమైన పునాది అని థామస్ అంటాడు. ప్రస్తుతం బోధనతోపాటు మియామీ యూనివర్సిటీ లా స్కూల్‌లో డిగ్రీ చదువుతున్న నాథన్.. న్యాయ నిపుణుడు కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

## రాష్ట్ర బార్ కౌన్సిళ్లు 'పురుషుల క్లబ్‌లు'గా మారాయి

### సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు

### బార్ కౌన్సిళ్లలో మహిళలను నామినేట్ చేయాలని హైకోర్టులకు ఆదేశం

**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** భారతదేశ న్యాయ సంస్థలలో లింగ అసమానతపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర బార్ కౌన్సిళ్లు 'పురుషుల క్లబ్‌లు'గా మారాయని ప్రకటిస్తూ, వాటి పనితీరుపై ఉన్న గుత్తాధిపత్యాన్ని 'పూర్తిగా తొలగించాలి' అని హెచ్చరించింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ), రాష్ట్ర బార్ కౌన్సిళ్ల ఎన్నికలకు సంబంధించిన పలు పిటిషన్లపై మంగళవారం విచారణ జరిపిన భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, న్యాయమూర్తులు జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కలిసి, ప్రతి రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు ఇద్దరు కోఆప్టెడ్ మహిళా సభ్యులను నామినేట్ చేయాలని తమ పరిధిలోని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను ఆదేశించింది. కోఆప్ట్ సభ్యులలో ఒకరు మాజీ హైకోర్టు న్యాయమూర్తిగా, మరొకరు పేరున్న సీనియర్ మహిళా న్యాయవాదిగా ఉండాలని కోర్టుఆదేశించింది. కౌన్సిళ్ల పనితీరులో నిష్పక్షపాతాన్ని నిర్ధారించడానికి, వీరిద్దరూ ఎన్నికల ప్రక్రియకు అతీతంగా స్వతంత్రంగా ఉండాలి. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయిన మహిళలు కూడా కోఆప్షన్‌కు అర్హులుగా ఉంటారని ధర్మాసనం స్పష్టం చేసింది. మహిళా అభ్యర్థులకు బదిలీ చేయదగిన ఓట్లను లెక్కించే అంశాన్ని, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాన్షు ధూలియా నేతృత్వంలోని ఉన్నత స్థాయి పర్యవేక్షక కమిటీకి నివేదించారు. బార్ సభ్యుల నుండి సూచనలు ఆహ్వానించి, మౌఖిక విచారణలు నిర్వహించిన తర్వాత ఈ పద్ధతిని పునఃపరిశీలించాలని కమిటీని కోరారు.

## ఉదయనిధి స్టాలిన్ అరెస్టు, విడుదల

### నటి త్రిషపై వ్యాఖ్యల దుమారం



**చెన్నై, ఆగస్టు 4:** తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఓ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని సృష్టిస్తున్నాయి. ఈ విషయంలో పోలీసులు ఇప్పటికే ఆయన్ను అరెస్ట్ చేశారు. చెన్నైలో ఆయన నివాసానికి పెద్ద ఎత్తున చేరుకున్న డిఎంకే కార్యకర్తలు పోలీసు వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. తంజావూరు పోలీసులు ఈకేసునమోదుచేసారు. డిఎస్‌పి అలగేషన్ ఆధ్వర్యంలోని పోలీస్ బృందం, చెన్నై పోలీస్ కమిషనర్ ఎ అమల్‌రాజ్ ఉదయనిధి నివాసానికి చేరి కేసు వివరాలు తెలిపారు. మరోవైపు అరెస్టు నుంచి రక్షణ కోరుతూ మద్రాస్ హైకోర్టులో ఉదయనిధి ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అది విచారణకు వచ్చేలోపే ఆయన్ను అరెస్ట్ చేయడం గమనార్హం. కావేరి జలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఉదయనిధి ముందురోజు ప్రసంగించారు. ఆ సమయంలో సభలో ఉన్న ఓ వ్యక్తి నటి త్రిష పేరు ప్రస్తావించగా, దానికి ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు ద్వంద్వార్థంతో ఉన్నాయని విమర్శలు వచ్చాయి. మహిళలను అవమానించేలా ఆ వ్యాఖ్యలు ఉన్నాయని ప్రత్యర్థి పార్టీలు ఆరోపించాయి. అధికార టీవీకే పార్టీ నేత ఆధవ్ అర్జున్ ఉదయనిధిపై తీవ్ర విమర్శలు చేశారు. మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడారని ఆరోపించారు. టీవీకే అధికార ప్రతినిధి ఫెలిక్స్ జెరాల్డ్ కూడా స్పందించారు. అదే వ్యాఖ్యలను తన కుటుంబ సభ్యుల ముందు చెబుతారా అని ప్రశ్నించారు. బిజెపి కూడా ఈ వ్యాఖ్యలను ఖండించింది. ఉదయనిధిని వెంటనే అరెస్టు చేయాలని తమిళనాడు బిజెపి ప్రధాన అధికార ప్రతినిధి నారాయణన్ తిరుపతి డిమాండ్ చేశారు. నటి త్రిషకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బిజెపి ఉపాధ్యక్షురాలు ఖుష్బూ సుందర్ డిమాండ్ చేశారు. అయితే ఈ వివాదాన్ని డిఎంకే కొట్టిపారేసింది. కావేరి జలాల సమస్య, డెల్టారైతుల ఇబ్బందుల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ అంశాన్ని పెద్దది చేస్తున్నారని మాజీ మంత్రి మనో తంగరాజ్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఉదయనిధి ప్రశ్నించకుండా అడ్డుకునేందుకే ఈ ప్రచారం జరుగుతోందని అన్నారు. అయితే పోలీసులు అరెస్టుచేయడంతో ఉదయనిధి హైకోర్టులో వేసిన పిటిషన్‌కు ఊరట లభించింది. ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. వెంటనే విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. అలాగే విచారణకు పూర్తిగా సహకరించాలని ఉదయనిధికి సూచించింది. సిఎం విజయ్, సినీ నటి త్రిషకు సంబంధించిన వ్యాఖ్యల ఆరోపణల కేసులో ఈరోజు పోలీసులు ఉదయనిధిని అరెస్ట్‌చేసిన విషయం తెలిసిందే. ఉదయనిధిని రిమాండ్‌కు పంపే ఆలోచన తమకు లేదని తమిళనాడు పోలీసులు స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో మాత్రమే ఆయన్ను విచారిస్తున్నామని తెలిపారు.

## 'ఆయన బతికే ఉన్నారు'

### మర్చంట్ నేవీ కెప్టెన్ భార్య సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** ఒమన్ తీరంలో ఒక ఆయిల్ ట్యాంకర్‌పై జరిగిన క్షి పణి దాడిలో మర్చంట్ నేవీ కెప్టెన్ ఆశిష్ కుమార్ మరణించారని ప్రకటించిన కొన్ని నెలల తర్వాత, ఆయన భార్య సుప్రీంకోర్టులో హెబియస్‌కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. 'ఆయన బతికే ఉన్నారు, గుర్తుతెలియని విదేశీ శక్తుల చేతిలో బందీగా ఉన్నారు' అని ఆమె ఆరోపించారు. తన భర్తను గుర్తించి, ఆయన విడుదల కోసం రూ.20 లక్షలు డిమాండ్ చేస్తూ తనకు బెదిరింపు కాల్స్ వచ్చాయని ఆరోపిస్తూ, అన్షు కుమార్ ఒక హెబియస్ కార్పస్ పిటిషన్‌లో తన భర్తను గుర్తించి, విడిపించాలని అధికారులను ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరారు.

ఇరాన్‌తో ఘర్షణల తొలిదశలో, మార్చి 1న ఒమన్‌లోని ఖసాబ్ పోర్టు సమీపంలో 'స్కై లైట్'అనే చమురు ట్యాంకర్‌పై క్షి పణి దాడి జరిగినప్పుడు, బీహార్‌లోని బెట్టియాకు చెందిన 37 ఏళ్ల కెప్టెన్ ఆశిష్ కుమార్ దానికి సారథ్యం వహిస్తున్నారు. నివేదికల ప్రకారం, ఆ దాడి అనంతరం నౌకకు నిప్పంటుకున్నప్పుడు అందులో పది మంది భారతీయ సిబ్బంది ఉన్నారని ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం ఆ సమయంలో పేర్కొంది. ఒమన్ అధికారులు ఎనిమిది మంది నావికులను రక్షి ంచగా, ఇంజిన్ రూమ్‌లో పనిచేస్తున్న కెప్టెన్ కుమార్, మరో సిబ్బంది దలీప్ ఆచూకీ తెలియరాలేదని నివేదికలు చెబుతున్నాయి. మార్చి 4న, ఒమన్ కోస్ట్ గార్డ్ కెప్టెన్ క్యాబిన్ నుండి కాలిపోయిన అస్థిపంజర అవశేషాలను స్వాధీనం చేసుకుంది. దాడి తర్వాత క్యాబిన్‌లోకి మరెవరూ ప్రవేశించలేదని భావిస్తు న్నందున, ఆ అవశేషాలు చాలా మటుకు కెప్టెన్ కుమార్‌కు చెందినవేనని భారత రాయబార కార్యాలయం ఆ పరిస్థితులను బట్టి చెప్పింది. అయితే, ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఆ నిర్ధారణను

## మధ్య ఆసియాపై భారత్ దృష్టి

### ఈ నెలాఖరులో కిర్గిజ్‌స్థాన్, ఉజ్బెకిస్థాన్‌లకు ప్రధాని మోడీ పర్యటన

**న్యూఢిల్లీ,ఆగస్టు 4:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెలాఖరులో కిర్గిజ్‌స్తాన్, ఉజ్బెకిస్థాన్ దేశాల్లో పర్యటించనున్నారు. చైనా తన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌ద్వారా మధ్య ఆసియాలో ప్రభావాన్ని విస్తరిస్తుండగా, రష్యా ఈ ప్రాంతాన్ని తన సాంప్ర దాయ ప్రభావ పరిధిగా భావిస్తోంది. ఇదే సమయంలో భారత్ కూడా మధ్య ఆసియాలో తన వ్యూహాత్మక, ఆర్థిక ప్రాధాన్యాన్ని పెంచుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఈ నేప థ్యంలో ప్రధాని మోడీ పర్యటనకు విశేష ప్రాధాన్యం ఏర్పడింది. ఈ పర్యటన రెండు దశల్లో జరగనుంది. ముందుగా కిర్గిజ్‌స్తాన్‌లో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోడీ పాల్గొంటారు. సమావేశం సందర్భంగా పలువురు దేశాధినేతలతో ద్వైపాక్షిక భేటీలుకూడా నిర్వహిస్తారు. ఉజ్బెకిస్థాన్‌లో పూర్తి స్థాయి ద్వైపాక్షిక పర్యటనకొనసాగనుంది. ఇందులో వాణిజ్యం, రక్షణ సహకారం, పెట్టు బడులు, కనెక్టివిటీ తదితర అంశాలపై చర్చలు జరుగుతాయి. అఫ్గానిస్థాన్‌లో మారిన భద్రతా పరిస్థితులు, మధ్య ఆసియాలో చైనా పెరుగుతున్న ప్రభావం, భారత్ తన వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను విస్తరించే లక్ష్యం వంటి అంశాల నేపథ్యంలో ఈ ప్రాంతానికి భారత విదేశాంగ విధానంలో మరింత ప్రాధాన్యం పెరిగింది. ఉజ్బెకిస్థాన్ విదేశాంగ మంత్రి బఖ్తియోర్ సైదోవ్ ఇటీవల న్యూఢిల్లీలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో సమావేశ మయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కూడా మర్యాద పూర్వకంగా కలిశారు.

## సిజెపి వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేపై పోలీసులకు ఫిర్యాదు

**ఔరంగాబాద్,ఆగస్టు 4:** సిజెపి (కాక్రోచ్ జనతా పార్టీ) ఫౌండర్ అభిజీత్ దీప్కేపై ఒక సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి అనుచరులు తనపై వరుసగా దాడికి పాల్పడ్డారని, దీనికి బాధ్యుడిగా అభిజీత్ దీప్కేను అరెస్టు చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుకు సంబంధించిన వివరాలివి. ఫైజన్ అన్సారీ అనే అతడు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. అతడిపై ఇటీవల పుణెలో, ఔరంగాబాద్‌లో దీప్కే అనుచరులు దాడి చేశారు. ఈ విషయాన్ని ఫైజన్ అన్సారీయే వెల్లడించాడు. ఇందుకు సంబంధించి తన వద్ద ఆధారాలున్నాయని, ఈ నేపథ్యంలో అభిజీత్ దీప్కేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఢిల్లీ డిసిపికి ఫిర్యాదు చేసినట్లు ఫైజన్ పేర్కొన్నాడు. ఇప్పటికే ఇదే అంశంపై రెండు చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశానన్నాడు. ఢిల్లీ పోలీసులు కూడా వెంటనే స్పందించి, దీప్కేను అరెస్టు చేయాలని అతడు కోరాడు. ఇదే సమయంలో ఢిల్లీ పోలీసులు, ప్రభుత్వంపై ఫైజన్ ప్రశంసలు కురిపించాడు. పోలీసులు సరైన సమయంలో స్పందించి, సోనమ్ వాంగ్‌చుక్‌ను అరెస్టు చేశారని చెప్పాడు. దీప్కేకు స్వప్రయోజనాలే ముఖ్యమని, ప్రతి అంశాన్ని తన ప్రయోజనం కోసమే వాడుకుంటాడని ఫైజన్ ఆరోపించాడు. అయితే, ఫైజన్ చేసిన ఆరోపణలపై దీప్కే కానీ, సిజెపి కానీ స్పందించలేదు.

## తమిళనాడుకు చేరిన కావేరి జలాలు

**కోయంబత్తూరు, ఆగస్టు 4:** కావేరి నదీ జలాలు మంగళవారం తమిళనాడు చేరుకున్నాయి. కర్నాటకలోని కాబిని డ్యామ్ నుంచి రిలీజ్ చేసిన నీరు తమిళనాడులోని ఎంట్రీపాయింట్ బిలిగుండ్లకు చేరుకున్నది. సోమవారం ఉదయం 500 క్యూసెక్కులుఉండగా, ఆగస్టు 4వ తేదీ మంగళవారం ఆ ప్రవాహం 1000 క్యూసెక్కులకు చేరుకున్నది. ఉదయం 7 గంటలకు 8వేల క్యూసెక్కులు కాగా, ఉదయం 10 గంటలకు 18వేల క్యూసెక్కులకు చేరుకున్నది. అయితే కర్నాటక నీరును విడుదల చేస్తున్న నేపథ్యంలో కావేరి నదిప్రవాహ ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెప్పారు. కావేరి పరివాహక ప్రాంతాల్లో భారీగా వర్షం కురవడం వల్ల నదిలోకి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తాజాగా వస్తున్న నీరు.. మంగళవారం రాత్రివరకు మెట్టూరు డ్యామ్‌కు చేరుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం మెట్టూరు రిజర్వాయర్‌లో నీటి సామర్థం 73.18 ఫీట్ల వద్ద ఉన్నది. ఆ రిజర్వాయర్ పూర్తి సామర్థం 120 ఫీట్లుగా ఉంది. ఆ డ్యామ్‌కు 68 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, దాని నుంచి 1500 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు రిలీజ్ చేస్తున్నారు. మెట్టూరు డ్యామ్‌కు నీరు చేరితే అప్పుడు దిగువన ఉన్న డెల్టా ప్రాంత రైతులు సేద తీరే అవకాశాలు ఉన్నాయి.

## వాషింగ్టన్‌లో విస్తరిస్తున్న కార్చిచ్చు

### అత్యవసర పరిస్థితి విధింపు



**వాషింగ్టన్, ఆగస్టు 4:** అమెరికాలో అగ్నికీలలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. వాషింగ్టన్ రాష్ట్ర పరిధిలోని అటవీ ప్రాంతాన్ని కార్చిచ్చు దహించివేస్తుండగా, సమీపంలోని వేల మంది ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాజాగా మరో 60 వేల మందిని తాత్కాలిక శిబిరాలకు పంపారు. మంటలకు కారణమని భావిస్తున్న స్పోకేన్‌కు చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం వాషింగ్టన్ వ్యాప్తంగా 16 ప్రదేశాల్లో కార్చిచ్చు విస్తరించింది. వందల భవనాలు అగ్నికి ఆహుతయ్యాయి. స్పోకేన్ ప్రాంతంలో మంటలు కొనసాగుతుండడంతో వాటిని అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. బలమైన గాలులు, పొడి వాతావరణం కారణంగా మంటలను నియంత్రించడం సవాలుగా మారింది. నష్టం తీవ్రతను అంచనా వేస్తున్నట్లు స్పోకేన్ మేయర్ లీసా బ్రౌన్ వెల్లడించారు.

**వాషింగ్టన్‌లో అత్యవసర పరిస్తితి..**

తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడిన తర్వాత.. వాషింగ్టన్ రాష్ట్ర గవర్నర్ బాబ్ ఫెర్గూసన్ రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తుండడంతో ప్రభావిత ప్రాంతాల్లో ఇళ్లను ఖాళీ చేయిస్తున్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరోవైపు ఈ వారం ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## సంక్షిప్త వార్తలు

### పాక్ చరిత్రలోనే అతిపెద్ద భూకుంభకోణం



**ఇస్లామాబాద్,ఆగస్టు 4:** పాకిస్థాన్ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు రేగాయి. దేశ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణాన్ని తాను బయటపెట్టినట్లు అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మొహ్సిన్ నఖ్వీ చేసిన వ్యాఖ్యలు అధికార వర్గాల్లోని విభేదాలను బట్టబయలు చేశాయి. న్యాయమూర్తులు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకులు, బ్యాంకర్లు ఈ స్కామ్‌లో భాగస్వాములుగా ఉన్నారని, గత 21 యేళ్లుగా లంచాలు చేతులు మారాయని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యల వెనుక సైన్యం, పౌర ప్రభుత్వానికి మధ్య పెరుగుతున్న ఘర్షణ వాతావరణమే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కుంభకోణంలో బాధ్యులైన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని నఖ్వీ హెచ్చరించారు.

### పాక్‌లో 30 మందికిపైగా లష్కరే సభ్యుల హత్య

**పెషావర్, ఆగస్టు 4:** పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన 30 మందికిపైగా సభ్యులు గత 34 యేళ్లలో గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో హత్యకు గురయ్యారని ఆ సంస్థ కీలక నేత రిజ్వాన్ హనీఫ్ వెల్లడించాడు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వీడియోలో కనిపిస్తున్న వ్యక్తి లష్కరే తోయిబాకు చెందిన సీనియర్ ఉగ్రవాదేనని భారత భద్రతా సంస్థలు ధ్రువీకరించాయి. పెషావర్, కరాచీ, రావల్పిండి, రావల్‌కోట్, ముజఫరాబాద్ ప్రాంతాల్లో 30 మందికిపైగా లష్కరే సభ్యులు హత్యకు గురయ్యారని హనీఫ్ వీడియోలో పేర్కొన్నాడు.

### నేతాజీ ముని మనుమడు టిఎంసికి రాజీనామా



**కోల్‌కత్తా, ఆగస్టు 4:** నేతాజీ సుభాష్ చంద్రబోస్ మనవడు చంద్రకుమార్ బోస్ తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) పార్టీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతోనే తాను పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన సోమవారం ప్రకటించారు. ఈ అనూహ్యపరిణామంపై టిఎంసి అధిష్ఠానం స్పందించాల్సి ఉంది. చంద్ర కుమార్ బోస్ రాజకీయ ప్రస్థానం గత కొంతకాలంగా చర్చనీయాంశంగా మారింది. 2016లో ఆయన బిజెపిలో చేరారు. ఆ పార్టీ తరఫున 2016 అసెంబ్లీ ఎన్నికల్లో, 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలయ్యారు. పశ్చిమ బెంగాల్ బిజెపి ఉపాధ్యక్షుడిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించారు.

### భారత్‌లో 15 విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు



**న్యూఢిల్లీ, ఆగస్టు 4:** భారత ఉన్నత విద్యా రంగంలో ఒక కీలక ముందడుగు పడింది. దేశంలో తమ ప్రాంగణాలను (క్యాంపస్‌లను) ఏర్పాటు చేసేందుకు 15 విదేశీ విద్యా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ఆస్ట్రేలియా, ఇటలీ, అమెరికా, యూకే దేశాలకు చెందిన 15 విదేశీ విద్యా సంస్థలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇప్పటివరకు 16 లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేసింది.

### పిఒకెలో మానవహక్కుల ఉల్లంఘన



**ముజఫరాబాద్, ఆగస్టు 4:** పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో (పిఒకె) జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్కడ తీవ్ర హింస, అశాంతి చోటుచేసుకుంటున్నాయి. నిరసనకారులపై పాక్ భద్రతాబలగాలు దాడులకు పాల్పడటం, మీడియాపై ఉక్కుపాదం మోపడం, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ వంటి అంతర్జాతీయ సంస్థలు తీవ్రఆందోళన వ్యక్తం చేశాయి. మానవ హక్కుల ఉల్లంఘనలపై వెంటనే దర్యాప్తుజరపాలని పాకిస్థాన్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశాయి. రావల్‌కోట్‌లో నిరసనకారులపై భద్రతాబలగాలు విచక్షణారహితంగా వ్యవహరించాయని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆరోపించింది.

5-8Pg6exHMNWJQE_5-8Pg6exHMNWJQE.qxd 04/Aug/26 10:54 PM Page 1



## మాజీ సిఎం వైఎస్ జగన్ ఇంటిముందు భార్యతో కలిసి బోరుగడ్డ అనిల్ నిరసన

**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ తాడేపల్లిలోని నివాసం వద్ద బోరుగడ్డ అనిల్ కుమార్ తన భార్యతో కలిసి నిరసనకు దిగడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. గతంలో తనను వైసిపి నేతగా చెప్పుకున్న అనిల్‌తో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని గతంలోనే ఆ పార్టీ స్పష్టత ఇచ్చింది. అయితే తాజాగా జగన్ నివాసానికి చేరుకున్న ఆయన, పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను జగన్ ఇంటికి వెళ్లకుండా సజ్జల తన అనుచరులతో కలిసి అడ్డుకుంటున్నారని, అంతేకాకుండా తనపై 'రౌడీషీటర్' అని తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని బోరుగడ్డ అనిల్ మండిపడ్డారు. తనపై ఎలాంటి రౌడీషీట్ లేదని హైకోర్టు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో 12 మంది పోలీసులకు కోర్టు మెమో ఇచ్చిందని తెలిపారు.తాను లండన్‌లో పిజి పూర్తి చేశానని, తండ్రి మరణం తర్వాత ఇక్కడికి వచ్చి జగన్‌ను సిఎం చేయడమే లక్ష్యంగా కష్టపడ్డానని అన్నారు. వైఎస్సార్ సమాధి వద్ద ప్రమాణం చేసి మరీ పార్టీ కోసం పనిచేశానని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు సైతం తన ఇంటికి వస్తారని చెప్పుకొచ్చిన ఆయన, తనపై నిందలు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మద్యం రవాణా టెండర్ల కేసు నిందితుల కస్టడి కోరుతూ సిట్ పిటిషన్

**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం రవాణా టెండర్ల కేసులో నిందితులు రాజ్ కెసిరెడ్డి, వాసుదేవ రెడ్డి, కారుమూరి సునీల్‌ల కస్టడీ పిటిషన్ పై ఎసిబి కోర్టు విచారణ జరిపింది. దీనిపై సిట్ పోలీసులు తరపున, నిందితుల తరపున వాద, ప్రతివాదనలను ఎసిబి కోర్టు న్యాయమూర్తి విన్నారు. తదుపరి విచారణను శుక్రవారానికి న్యాయస్థానం వాయిదా వేసింది. నిందితులను 5 రోజుల పాటు కస్టడికి కావాలని కోరుతూ సిట్ పిటిషన్ దాఖలు చేసింది. ప్రస్తుతం నిందితులు చంచల్‌గూడ జైల్లో జుడీషయల్ రిమాండ్‌లో ఉన్నారు.

# క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలి

- ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ గురవయ్య
- 48వ ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ అథ్లెటిక్, చెస్ ఛాంపియన్ షిప్, బాల్ బ్యాండ్మిటన్, క్యారమ్ టోర్నమెంట్ ప్రారంభం




**తిరుపతి, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** విద్యుత్ ఉద్యోగులు వివిధ క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్‌డి) కె.గురవయ్య పేర్కొన్నారు. తిరుపతిలో 6వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే 48వ ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ అథ్లెటిక్, చెస్ ఛాంపియన్ షిప్, బాల్ బ్యాండ్మిటన్, క్యారమ్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమం మంగళవారం ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ కె.గురవయ్య మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధులను నిర్వహిస్తూ క్రీడల్లో పాల్గొనేందుకు సమయాన్ని కేటాయించడం అభినందనీయమని కొనియాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమే అయినప్పటికీ స్నేహపూరిత వాతావరణంలో గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలన్నారు. ఉద్యోగులు ఉల్లాసంగా పోటీల్లో పాల్గొంటూ ఆరోగ్యం, క్రమశిక్షణ, ఐకమత్యంతో విధులు నిర్వహిస్తూ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలతో సంస్థ అభివృద్ధికి చేయూతనందించాలని కోరారు.

ఈ కార్యక్రమం సందర్భంగా చీఫ్ జనరల్ మేనేజర్లు ఎం.మురళీ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్ తదితరులు మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకుంటూ విధి నిర్వహణలో ఉద్యోగులు అత్యుత్తమ సేవలందించాలని కోరారు. ఉద్యోగులు క్రీడలతో పోటీతత్వం ద్వారా బలహీనతల్ని అధిగమించేందుకు అవకాశం వుంటుందని తెలిపారు. క్రీడాకారులు ఉల్లాసంతో క్రీడల్లో పాల్గొంటూ, మనస్సు నిండా ఆనందాన్ని నింపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీకాంత్, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు వి.చంద్రశేఖర రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి జి. గంగాధర్ రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ కుమార వడివేలు, స్పోర్ట్స్, గేమ్స్ కార్యదర్శి లీలా రామ్, పురుషోత్తం, జయప్రకాష్, ముని ప్రసాద్, రమేష్ బాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా అరెస్ట్

**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసిపి నేత, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫాను పోలీసులు అరెస్ట్ చేశారు. కిడ్నాప్ కేసుకు సంబంధించి గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న ఆయన్ను నూజివీడు పోలీసులు గుజరాత్‌లో అదుపులోకి తీసుకున్నారు. సాంకేతిక నిఘా సాయంతో ముస్తఫా ఆచూకీని గుర్తించి అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.కేసు నేపథ్యం: ఇటీవల పొగాకు లోడ్‌తో వెళ్తున్న ఒక వాహనాన్ని ముస్తఫా కుమారుడు, అతని అనుచరులు అడ్డగించారు. ఆ వాహనంలో ఉన్న పొగాకు వ్యాపారితో పాటు మరో వ్యక్తిని కిడ్నాప్ చేసి బంధించారు. బాధితుల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, వారు రంగంలోకి దిగి కిడ్నాప్‌కు గురైన ఇద్దరినీ సురక్షితంగా విడిపించారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా తొలుత ముస్తఫా కుమారుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. అయితే, విచారణలో ఈ కిడ్నాప్‌తో మాజీ ఎమ్మెల్యే ముస్తఫాకు కూడా సంబంధం ఉన్నట్లు తేలింది. దీంతో ఆయనపై కిడ్నాప్, బెదిరింపుల కింద కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి ముస్తఫా అజ్ఞాతంలోకి వెళ్లగా, చివరకు సాంకేతిక ఆధారాలతో ఆయన గుజరాత్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడకు వెళ్లి అరెస్ట్ చేశారు. ముస్తఫా అరెస్ట్‌ను పోలీసులు అధికారికంగా ధ్రువీకరించారు.

## పాపులర్ షూమార్ట్ అధినేత విజయ్ సేవలు అసామాన్యం

**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడకు చెందిన ప్రముఖ వ్యాపార సంస్థ పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి విజయ్ కుమార్ మృతిపట్ల సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ తీవ్ర సంతాపం తెలిపారు. షూమార్ట్ రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీకి విస్తృత గుర్తింపు తీసుకుని వచ్చిన చుక్కపల్లి పిచ్చయ్య బాటలో విజయ్‌కుమార్ మంచి గుర్తింపు పొందారు. సామాజిక సేవా రంగంలో విజయ్ సేవలు అసామాన్యం అన్నారు. పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి విజయ్ కుమార్ సోమవారం గుండెపోటుతో కన్నుమూశారు. ప్రజల విశ్వాసాన్ని పొందిన ఈ సంస్థ అధినేత మృతి పట్ల ఎమ్మెల్యే సుజన చౌదరి సంతాపం తెలిపారు.

## తిరుపతి జిల్లాలో సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలు

**తిరుపతి, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రసిద్ద యాత్రాస్థలం, ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల–తిరుపతి నగరంతోబాటు జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ప్రకటించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ సెక్షన్ నెలరోజులపాటు అమలులో ఉంటుందన్నారు. తిరుపతి జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు, శాంతిభద్రతల పరిరక్షణకు సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలులో ఉందన్నారు. ముందస్తు అనుమతిలేనిదే ఎవరూ ఎలాంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదు. ర్యాలీలు, ఊరేగింపులు, సభలు, సమావేశాలకు చట్టప్రకారం పోలీసుశాఖ నుండి అనుమతి తీసుకోవాల్సిందేనన్నారు.



# టిటిడి అగరబత్తీలకు నకిలీల గోల!

- ఇ కామర్స్ పేరుతో శ్రీవారి భక్తులకు బురిడీ

**తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలు, లడ్డూ ప్రసాదాల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి భక్తులను మోసం చేయడమే కాదు.. తాజాగా ఎంతో పవిత్రమైన మహిమాన్వితమైన దేవునికి అలంకరించిన పూలతో తయారుచేసే అగర బత్తీలకు నకిలీ సంస్థలు మార్కెట్లో హల్‌చల్ చేస్తున్నాయి. అంతేగాక టిటిడి అగరబత్తీల తరహాలోనే నకిలీలు తయారుచేసి అదే రీతిలో ప్యాకింగ్, బ్రాండింగ్ పేర్లు వినియోగించుకుని ధర అమాంతం రెండింతలు రెట్టింపుచేసే ఇ కామర్స్ సైట్లలో నకిలీ సంస్థలు మోసం చేయడం వెలుగుచూసింది. దీంతో టిటిడి ఇప్పుడు అగర బత్తీలను కూడా కాపాడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. భక్తులకు నాణ్యమైన, స్వచ్ఛమైన టిటిడి తయారుచేస్తున్న ఉత్పత్తులనే అందించేందుకు మరో కోణంలో ఆలోచన చేయాల్సి వస్తోంది. అగరబత్తీలను టిటిడి నిబంధనలకు విరుద్దంగా ఆన్‌లైన్‌లో ఇ కామర్స్ సంస్థలు విక్రయాలు చేయడం దుమారం రేపుతోంది. ఇప్పటికే తిరుమల, తిరుపతిలో టిటిడి అగరబత్తీలు కోసం భక్తుల నుండి భారీ డిమాండ్ ఉంది. భక్తుల అవసరాలను, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న కొన్ని ఇ కామర్స్ సంస్థలు ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా అమ్మకాలు చేయడం మాత్రం అక్రమార్కులకు పంటపండినట్లేనని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అచ్చం టిటిడి ఉత్పత్తుల్లాగే నకిలీ బ్రాండ్లు ఉండటంతో భక్తులు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. తిరుమల శ్రీవారి ఆలయంలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి మూలవిరాట్టుతోబాటు ఉప ఆలయాలు, ఉత్సవమూర్తులకు అలంకరించిన పూలు, పూలమాలలను, టిటిడి అనుబంధ ఆలయాలు తిరుపతి గోవిందరాజస్వామి, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీనివాస మంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, అప్పలాయగుంట ఆలయం, నారాయణవనం, కోదండరామస్వామి ఆలయాల్లో దేవుళ్ళకు అలంకరించిన పూలమాలలు నిరుపయోగం గాకుండా 2023లో ఏకంగా భక్తివిశ్వాసాలతో పూలతో అగరబత్తీలు తయారు చేయడం మొదలైంది.

తొలుత ఏడురకాల ఉత్పత్తులు తయారుచేసి టిటిడి విక్రయాలు ప్రారంభించింది. భక్తుల నుండి ఈ అగరబత్తీలకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో టిటిడి ఉత్పత్తులను పెంచాలని కూడా నిర్ణయించింది. అయితే ఇప్పటికీ టిటిడి అగరబత్తీలకు భక్తుల నుండి స్పందన వుంది. టిటిడి అగరబత్తీల కాంబో ప్యాక్ (ఏడురకాలు బాక్స్)500 రూపాయల వరకు ధర ఉంది. ఇదే నకిలీ బ్రాండ్ల అగరబత్తీలు వెయ్యిరూపాయల వరకు ఇ కామర్స్‌లో ధర ఉందని టిటిడికి ఫిర్యాదు అందింది. టిటిడిపేరుతో నకిలీ ఇ కామర్స్ సంస్థలు ఇలా విక్రయాలు చేయడం భక్తులను కలవరపరుస్తోంది. అయితే నిబంధనలు ఉల్లంఘించి టిటిడి పేరును దుర్వినియోగం చేస్తున్న ఈ నకిలీ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

# బిసి రక్షణ చట్టంపై విజయవాడలో నేడు కీలక భేటీ

**రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత**



**విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా బిసి రక్షణ చట్టం తుది రూపు ఇవ్వడానికి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా విజయవాడలోని ఓ హోటల్‌లో కీలక సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిసిలను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేలా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా, బిసి రక్షణ చట్టాన్ని తీసుకురావడానికి చర్యలు ప్రారంభించామన్నారు. బిసిలను కులాలు, వృత్తుల పేరుతో దూషించినా, వారిపై దాడులకు, దౌర్జన్యాలకు దిగినా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా రక్షణ చట్టం రూపొందిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. బిసిలపై జరిగే దాదాపు 15 రకాల దాడులు, వేధింపులను ఈ చట్టం కింద నేరాలు గుర్తిస్తామన్నారు. బిసి రక్షణ చట్టంలో భాగంగా కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు కూడా ఏర్పాటు చేయనున్నామన్నారు. గత సాధారణ ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన తరవాత బిసి రక్షణ చట్టం తీసుకొస్తామని సిఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, ఇప్పటికే చట్ట రూపకల్పనకు పలు పర్యాయాలు కేబినెట్‌లో ఉన్న ఎనిమిది మంది బిసి మంత్రులు పలు పర్యాయాలు భేటీ అయ్యామన్నారు.

భారత రాజ్యాంగానికి లోబడి పలు చట్టాలను పరిశీలించి, అధికారులు బిసి రక్షణ చట్టానికి తుది రూపు తీసుకొచ్చారన్నారు. ఈ ముసాయిదా చట్టాన్ని తుదిరూపు ఇచ్చే క్రమంలో బిసి సామాజిక వర్గానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, మంత్రులతో కీలక భేటీ విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్‌లో బుధవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తనతో పాటు ఏడుగురు బిసి మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారథి, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్ సహా హోం మంత్రి అనిత, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కూడా హాజరుకానున్నారన్నారు. వారితో పాటు బిసి సామాజిక వర్గానికి చెందిన 30 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు, ఆరుగురు ఎంపిలు ఈ సమావేశం పాల్గొననున్నట్లు తెలిపారు. వారిచ్చే సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుని బిసి రక్షణ చట్టానికి తుది రూపు ఇచ్చి, సిఎం చంద్రబాబునాయుడుకు అందజేయనున్నామన్నారు. బిసిల అభ్యున్నతికి, గౌరవ ప్రదమైన జీవనానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. దేశంలోనే బిసిలకు సంబంధించి ప్రత్యేక రక్షణ చట్టం తెస్తున్న తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుందని మంత్రి సవిత తెలిపారు.

# తిరుమల సమాచారం

## ఏడుకొండలస్వామికి రెండు బ్రహ్మోత్సవాలు

- సెప్టెంబర్ 17నుండి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు
- అక్టోబర్ 14నుండి నవరాత్రి బ్రహ్మోత్సవాలు



**తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడిగా.. ఆపదమొక్కులవాడిగా, అర్చామూర్తిగా వైఖానస ఆగమోక్తంగా పూజలందు కుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి అత్యంత వైభవంగా జరిగే సాంవత్సరిక ఉత్సవాల్లో ప్రత్యేకంగా తొమ్మిది రోజులు పాటు ఉదయం, రాత్రి వాహనసేవలతో అంగరంగవైభవంగా జరిగే "బ్రహ్మోత్స వాలు" ప్రధానం. కరోనా వైరస్ పూర్తిగా నిర్వీర్యం అయిన తరువాత ఈ ఏడాది అధికమాసం రావడంతో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించనుంది. సాధారణంగా సెప్టెంబర్ మాసంలో జరిగే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలు రెండువారాల తేడాతో జరిపించేలా ముహూర్తం ఖరారుచేస్తారు. భారతదేశంలోనే మరే ఆలయంలోనూ జరగని విధంగా ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలేశుని ఆలయంలో అంగరంగవైభవంగా జరిగే "బ్రహ్మోత్సవాలు"కు దేశవిదేశాల నుండి లక్షలాది మంది భక్తులు నలుమూలల నుంచి తండోపతండాలుగా తరలివస్తారు. ఇష్టదైవమ్ వాహనసేవలను వీక్షించి పునీతులవుతారు. తొమ్మిదిరోజులు రోజుకు రెండు వాహనాలపై ఎంతో ముగ్ధమనోహరంగా, సర్వాలంకారభూషితుడై శ్రీవేంకటేశ్వరుని ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత శ్రీమలయప్ప స్వామి వారు ఒక్కో వాహనంపై ఒక్కో విశిష్టతతో ఊరేగి భక్తులను కటాక్షించడం ప్రత్యేకత. శ్రీవారి భక్తులకు ఈ ఏడాది అధికమాసం కావడంతో రెండుదఫాలు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 17 నుంచి 26వరకు, తిరిగి అక్టోబర్ 14నుండి 23 వరకు కన్నుల పండువగా బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు తేదీలు ఖరారు చేశారు. ఉదయం పూట వాహనసేవలు 8గంటలకే మొదలవుతాయి. రాత్రి వేళ వాహనసేవలు 7గంటలకు ఆరంభవుతాయి. వార్షిక బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 17వ తేదీ ఆదివారం సాయంత్రం అంకురార్పణం, 18న సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవ ఘట్టానికి శ్రీకారంపడుతుంది. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేస్తారు. సామాన్యభక్తులకు ఎక్కువగా దర్శనసమయం కల్పించేందుకు ఆ తొమ్మిదిరోజులు బ్రేక్ దర్శనాలు ఉండవు. టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి సారధ్యంలో దేవదేవుని బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

**ఆర్జిత సేవలు రద్దు:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ వైఖానస ఆగమోక్తంగా ఆలయంలో ఎన్నో రకాల సేవలు, కైంకర్యాలు జరుగుతుంటాయి. ఈ సేవలు ప్రత్యేక పర్వదినాల్లో, ఏడాదిలో తొమ్మిదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాల సమయంలో పూర్తిగా రద్దు చేస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రానున్న సెప్టెంబర్ 15 నుండి 23 వరకు తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కారణంగా ఆ తొమ్మిది రోజుల పాటు ఆర్జిత సేవలైన అష్టదళ పాదపద్మారాధన సేవ, తిరుప్పావడ సేవ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవలు టిటిడి రద్దు చేసింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ, దాతల దర్శనాలను కూడా రద్దు చేయడం జరిగింది. ఈ విషయాన్ని గమనించి భక్తులు టిటిడికి సహకరించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.



# తిరుమలలో రద్దీ పెరిగితే..

## ఆఫ్‌లైన్ టోకెన్ల జారీ గందరగోళం!

- వేళాపాళా లేకుండా ముందుగానే టిటిడి విడుదల
- భక్తుల్లో అయోమయం

**తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంలో అమలవుతున్న సమయనిర్దేశిత సర్వదర్శనం (టైమ్ స్లాట్) టోకెన్ల ఆఫ్‌లైన్‌లో జారీ గందరగోళంగా మారింది. ఈ టోకెన్లు తిరుపతిలోని కౌంటర్లలో ఏ సమయంలో జారీ చేస్తారో? ఎన్ని ఇస్తున్నారనేది కూడా తెలియక సామాన్యభక్తులు అయోమయంలో ఉంటున్నారు. తిరుమలలో వారాంతంలోనేగాక సాధారణ రోజుల్లోనూ భక్తుల రద్దీ విపరీతంగా కొనసాగుతోంది. 40వేల మంది భక్తులు రద్దీ పెరిగితే కొండ కిటకిటలాడుతోంది. ఆపై భక్తుల సంఖ్య అనూహ్యంగా రెట్టింపయితే భక్తుల క్యూలైన్లు వైకుంఠమ్ క్యూ కాంప్లెక్స్‌లు దాటి వెలుపలకు వచ్చేస్తున్నాయి. సాధారణంగానే తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దేశం నలుమూలల నుండి ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రల నుండేగాక తెలుగురాష్ట్రాల నుండి భక్తులు తరలి వస్తున్నారు. తమ మొక్కుబడుల్లో భాగంగా ఏడుకొండల స్వామిని దర్శించుకోవడానికి చిన్నపిల్లలు, వృద్ధులు, యువకులు ఇలా వచ్చేస్తున్నారు. ఎలాంటి దర్శన టిక్కెట్లు, టోకెన్లు లేకున్నా సాధారణ సర్వదర్శనంలోనూ భక్తులను అనుమతిస్తున్నారు. ఇలా నేరుగా తిరుమలకు వచ్చేస్తున్న భక్తులకు కొండపై వెలుపల క్యూలైన్లు ఎక్కడ నుండి ప్రవేశించాలనేది కూడా భక్తుల్లో గందరగోళంగా మారింది. ఆలయానికి మూడునాలుగు కిలోమీటర్లు దూరం వరకు వ్యాపించిన శిలాతోరణం నుండి గానీ, బాట గంగమ్మ ఆలయం, శ్రీవారి సేవాసదన్‌లు, గోగర్భమ్‌డ్యామ్ ప్రాంతాల నుండి భక్తుల లైన్లు ఉంటాయి. ఇక్కడకు చేరుకోవడమే భక్తులకు దేవుడు కనిపిస్తుంటాడు. అక్కడ నుండి కిలోమీటర్లు దూరం నడకతోనే క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి విసిగిపోతున్నారు. సాధారణరోజుల్లో కూడా తిరుమలేశుని 70వేలమంది వరకు భక్తులు దర్శనం చేసుకుంటుండటం విశేషం. అలాంటిది తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగితే తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో శ్రీనివాసం, విష్ణు నివాసం, అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని కౌంటర్లలో టైమ్‌స్లాట్ సర్వదర్శనం టోకెన్ల జారీ గందరగోళమే.

**వేళాపాళా లేని టోకెన్ల జారీ:** తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో రోజువారీగా జారీచేసే సమయనిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు (టైమ్‌స్లాట్) ఇవ్వడంలో ఒక నిర్దేశిత సమయం పాటించడంలేదు. సాధారణంగా ప్రతిరోజూ మధ్యాహ్నం 1.30-2గంటల ప్రాంతంలో ఈ కౌంటర్లలో టైమ్‌స్లాట్ దర్శన టోకెన్లు జారీచేయాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా భక్తులు కూడా ఎక్కడెక్కడి నుండో ముందుగానే తిరుపతికి చేరుకుని క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షిస్తుంటారు. అయితే భక్తుల రద్దీ పెరిగిన సమయంలో క్యూలైన్లలో భక్తులను నియంత్రించలేక ఈ టోకెన్లు తెల్లవారుజామున 4గంటలకు లేకుంటే ఉదయం 7-8గంటల ప్రాంతంలో జారీ చేసేస్తుండటంతో ఆ తరువాత తిరుపతికి వచ్చిన భక్తులకు టోకెన్లు లేవనే ప్రచారంతో అసహనానికి గురవుతున్నారు. ఎక్కడెక్కడి నుండో వందల వేల కిలోమీటర్లు ప్రయాణించి తిరుపతికి వస్తున్న భక్తులకు టోకెన్లు జారీ లేదని తెలుసుకుని మండిపడుతున్నారు. ముందుగానే ఎలాంటి ప్రకటన చేయకుండా కొన్నిగంటల ముందే టైమ్‌స్లాట్ టోకెన్లు జారీ చేసేయడం పరిపాటిగా మారింది. సాధారణంగా భక్తుల రద్దీని బట్టి తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు 10వేలు, దివ్యదర్శనం టోకెన్లు (శ్రీవారిమెట్టు) 3వేల వరకు జారీచేస్తుంటారు. మరీ వారాంతంలో ఈ టోకెన్లు 2వేల వరకు కుదించేస్తున్నారు. దీనివల్ల ప్రతిరోజూ 20వేల మంది వరకు భక్తులు సర్వదర్శనం టోకెన్ల కోసం తిరుపతికి వస్తున్నారనేది టిటిడి అధికారుల అంచనా. గతంలో టైమ్‌స్లాట్ సర్వదర్శనం టోకెన్లు 12వేల నుండి 15వేల వరకు జారీచేసేవారు. కాలినడక మార్గంలో 3వేలనుండి 5వేల టోకెన్లు జారీచేశారు. ఇప్పుడు భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో ఈ టోకెన్లు కూడా కుదించేశారు. భక్తుల రద్దీ కారణంగానే కొన్ని చర్యలు తీసుకోవడం తప్పదని టిటిడి అధికారుల వాదన. ఈ నేపథ్యంలో తిరుపతిలో వేళాపాళా లేని టైమ్‌స్లాట్ టోకెన్ల జారీ సమయంలో ఎలాంటి మార్పు చేయకుండా నిర్దేశిత సమయానికే నిర్ధేశిత సర్వదర్శనం టోకెన్లు జారీచేస్తే బావుంటుందని భక్తుల అభిప్రాయం. సాధారణ సర్వదర్శనం కంటే, సమయ నిర్ధేశిత సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులకు ఐదారుగంటలు ముందుగానే దేవుని దర్శనం చేసుకునే వెసలుబాటు ఉంది. వారాంతం శుక్ర, శని, ఆదివారాల్లో ఈ రద్దీ 40వేల మంది వరకు తిరుపతిలో కనిపిస్తుంది.

# కొత్త నిర్ణయాలకు పచ్చజెండా!

- మూడు దశాబ్దాల విధానానికి టిటిడి స్వస్తి

**తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో కొత్త నిర్ణయాలకు పచ్చజెండా ఊపారు. ఇందుకు టిటిడి బోర్డు పెద్దలు కూడా సుముఖత చూపడంతో రానున్న రోజుల్లో సంస్కరణల అమలులో భాగంగా మూడు దశాబ్దాల కాలంగా అమలవుతున్న పాత అకౌంటింగ్ విధానానికి ఆధునిక రూపు కల్పిస్తున్నారు. ఈ మేరకు ఇటీవలే బోర్డు పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. అకౌంటింగ్ వ్యవస్థను (ఆర్థిక నివేదికలను) మెరుగుపరిచేందుకు భారత చార్టర్డ్ అకౌంటెంట్స్ సంస్థ (ఐసిఎఐ) సమగ్ర అధ్యయనం చేపట్టింది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఒక అకౌంటింగ్ మాన్యువల్‌ను ఐసిఎఐ రూపొందించి అందజేయనుంది. ఇప్పటికే ఈ సంస్థకు చెందిన అకౌంటింగ్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రాథమిక అధ్యయనం ప్రారంభించింది. ప్రస్తుతం టిటిడిలో ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ (ఇఆర్‌పి) ఆధారిత సమగ్ర అకౌంటింగ్ వ్యవస్థ అమలులో ఉంది. ఈ వ్యవస్థను ఆధునీకరించే లక్ష్యంతో కసరత్తు మొదలుపెట్టారు. టిటిడి ఇటీవల చేసిన ప్రతిపాదనల నిర్ణయం ద్వారా శ్రీవారి ఆలయానికి వచ్చే విరాళాలు, వివిధ విభాగాల ఆదాయంతో పాటుగా చేస్తున్న ఖర్చులు, ఆస్తుల నిర్వహణ, ఆర్థిక లావాదేవీల వివరాలన్నింటినీ పారదర్శకంగా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మరింత క్రమబద్ధంగా కంపెనీల లెక్కలను సులభంగా పోల్చి చూసేలా మోసాలను అరికట్టి, నమ్మకాన్ని పెంచడం. ప్రాథమిక భాగాలు నిర్వహించడమే ఈ సంస్కరణల ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నారు.

టిటిడి వినియోగిస్తున్న అకౌంటింగ్ మాన్యువల్ దాదాపు 30సంవత్సరాల క్రితం రూపొందించిబడింది. కంపెనీస్ యాక్ట్‌లో చోటుచేసుకున్న తాజా మార్పులు, నూతన లెక్కల నిర్వహణ ప్రమాణాలకు అనుగుణంగా టిటిడి ఆర్థిక నియమావళిలో అవసరమైన సవరణలను ఈ కొత్త అధ్యయనం నివేదికలో సూచించనున్నారు. వేగవంతమైన ఆర్థిక నియంత్రణకు మార్గం సుగమం చేయడమే లక్ష్యంగా తుది కసరత్తు కొనసాగుతోంది. ఈ విధానం వీలైనంత త్వరగా అమల్లోకి తేవాలని భావిస్తున్నారు. ముఖ్యంగా తిరుమలలో భక్తులకు వేగంగా దర్శనం చేయించే విధంగా క్యూ లైన్ మేనేజ్ మెంట్ సిస్టమ్ విధానం అమలుచేస్తోంది. అదే విధంగా వసతి గదుల కేటాయింపు విషయంలోనూ సాంకేతికతను వినియోగించుకోవాలని సేవలను పెంపొందించే విధంగా



## 17 నుండి టిటిడిలో వస్త్రాల ఇ వేలం

**తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు టిటిడి అనుబంధ ఆలయాల్లో భక్తులు కానుకగా సమర్పించిన వస్త్రాలను ఈనెల 17నుండి 19వరకు ఇ వేలం ద్వారా వేలంవేయనున్నారు. ఈ వేలంలో 177 లాట్లలో కొత్తవి, ఉపయోగించినవి, పాక్షికంగా దెబ్బతిన్న వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. టర్కీ టవళ్లు, ఆర్డినరీ టవళ్లు, లుంగీలు, శాలువాలు, బెడ్‌షీట్లు, దిండుకవర్లు, న్యాప్‌కిన్లు, హ్యాండ్‌కర్చీఫ్‌లు, పిల్లో కవర్లు, బ్లౌజ్‌పీస్‌లు, దుపట్టాలు, పరదాలు, హుండీ గలీబులు, ఊర్వాడాలు తదితర వస్త్రాలను ఇ వేలంలో విక్రయిస్తారు. వివరాలకు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయం (వేలములు) 08772 264429ను సంప్రదించవచ్చు. అలాగే డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.కొనుగోలు.ఎపి.జివోవి.ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు తెలుసుకోవచ్చు.



తిరుపతి గంగమ్మ ఆలయ పునర్నిర్మాణంపై

# ప్రజాభిప్రాయం తీసుకుంటాం

- కడ పి.డి. వికాస్ మర్మత్
- భక్తులు ఆందోళనలు చెందొద్దు

**కుప్పం, ఆగస్టు 4 ప్రభాతవార్త:** కుప్పం గ్రామ దేవత శ్రీతిరుపతి గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ అంశంపై ప్రజలు, భక్తుల అభిప్రాయాలు తప్పక తీసుకుంటామని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక కడ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పి.డి. మాట్లాడారు. ఏడాదిన్నర క్రిందట ఆలయ నిర్మాణంకు సిఎం చంద్రబాబు రూ.8.40 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ఆలయ పునర్నిర్మాణంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని భావించామన్నారు. ఏటా అమ్మవారి జాతరకు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి 5లక్షల దాకా భక్తులు వస్తుంటారన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాన్ని పునర్నిర్మించాలని నిధులు మంజూరయ్యాయని వికాస్ మర్మత్ తెలిపారు. సోమవారం ఆలయంకు స్తపతి, ఇంజనీరింగ్ అధికారులు రావడంతో ఆలయ కమిటీతో చిన్నపాటి సమావేశం జరిపామని, అయితే ఇంతవరకు ఆలయ నిర్మాణంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ విషయంగా సోమవారం పుకార్లు చెలరేగాయన్నారు. ఈ వ్యవహారంపై తాను స్పష్టత ఇస్తున్నానన్నారు. ఆలయ నిర్మాణంకు సంబంధించి ప్రజలు, భక్తుల నుంచి ఆగస్టు 31వ తేది వరకు వారి అభిప్రాయాలను కడ కార్యాలయంలో స్వీకరిస్తామని వికాస్ మర్మత్ స్పష్టం చేశారు. అవసరం అనుకుంటే మరింత గడువు సైతం పెంచుతామన్నారు. ఏదిఏమైనా ప్రజాభిప్రాయం తెలుసుకున్నాకే ఆలయ నిర్మాణంపై స్థపతి, దేవదాయ అధికారులతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. కుప్పంలో సిఎం చంద్రబాబునాయుడు చొరవతో 10వేలకోట్లతో 32వేల పరిశ్రమలు వచ్చాయన్నారు. కడ ద్వారా పరిశ్రమలకు ఎలాంటి సమస్య లేకుండా వెయ్యి ఎకరాల భూమి సేకరించామన్నారు. రెండు నెలల్లోపు కుప్పం పట్టణంలో మూడో రీచ్ పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ స్టేడియం, పార్కుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని త్వరలోనే ఆర్టీసీ బస్‌స్టేషన్ పనులు మొదలుపెడతామని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ వివరించారు.

5MN 11 PG-GNT_5MN 11 PG-GNT.qxd 05-08-2026 AM 12:51 Page 1



## వైకాపాలో చేరిన గూడపాటి శ్రీనివాసరావు

రేపల్లె, ఆగస్టు 4, ప్రభాతవార్త:తెలుగదేశం పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అనుచరుడు,కాపు సామాజిక నేత గూడపాటి శ్రీనివాసరావు మంగళవారం తాడేపల్లిలో మాజీ ముఖ్యమంత్రి,వైకాపా అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.శ్రీనివాసరావు అనుచరులు కూడా వైకాపాలో చేరారు.రానున్న అసెంబ్లీ ఎన్నికలలో రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని శ్రీనివాసరావు హామీనిచ్చారు.ఎటువంటి షరతులు లేకుండా వైకాపాలో చేరానని పార్టీ బలోపేతానికి పాటుపడతానని ఆయన తెలిపారు.పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి అప్పగించే బాధ్యతకు న్యాయం చేస్తానని ప్రకటించారు.రేపల్లె పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీగా గూడపాటి శ్రీనివాసరావు,రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణ,పార్టీ నాయకులు,కార్యకర్తలు తాడేపల్లికి తరలివెళ్ళారు.వైకాపాలో శ్రీనివాసరావు చేరిన కార్యక్రమంలో గుంటూరు,బాపట్ల జిల్లాల వైకాపా అధ్యక్షులు అంబటి రాంబాబు,మేరుగ నాగార్జున,మాజీ ఎంపి నందిగం సురేష్,మంగళగిరి నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు యార్లగడ్డ మదన్‌మోహన్,పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళి తదితరులు పాల్గొన్నారు.



## వైకాపాకు చేరువవుతున్న కాపు సామాజిక వర్గం...

రేపల్లె, ఆగస్టు 4, ప్రభాతవార్త:రేపల్లె నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చేరువవుతోంది.కాంగ్రెస్,తెలుగుదేశం పార్టీలలోని నాయకులు తమ అనుచరులతో వైకాపా తీర్థం పుచ్చుకునే ప్రక్రియ కొనసాగించడం ప్రజలలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల రేపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి,రాజకీయవేత్త, ప్రముఖ వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.వైకాపాలోకి ఆహ్వానించిన పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకించి రేపల్లె నియోజకవర్గంలో పార్టీ సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణను గెలిపించాలని అధికారంలోకి వచ్చాక తమ పక్కనే కూర్చునేలా రాజకీయ ప్రాతినిథ్యం కల్పిస్తామని జగన్మోహన్ రెడ్డి బహిరంగంగానే ప్రకటించారు.అంటే ఎమ్మెల్సీ పదవి కేటాయించే దృష్టితో ఆయన ఆ విధంగా చెప్పారని పార్టీ శ్రేణులు గమనించాయి.అప్పటి నుంచి మోపిదేవి శ్రీనివాసరావు రేపల్లె నియోజకవర్గంలో పర్యటిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు.ప్రజలకు అందుబాటులో ఉంటూ అన్ని సామాజిక వర్గాలను కలుపుకుపోతున్నారు.మాజీ మంత్రి,కాపు సంక్షేమం కోసం తుది శ్వాస విడిచే వరకు శ్రమించిన ముద్రగడ పద్మనాభం మృతికి సంతాప సూచకంగా కాపు సామాజిక వర్గాన్ని సమీకరించి రేపల్లె,తెనాలి పట్టణాలలో సంస్మరణ సభలు నిర్వహించిన మోపిదేవి శ్రీనివాసరావు సఫలీకృతులయ్యారు.ముద్రగడ పద్మనాభం,వంగవీటి మోహన్‌రంగాల సేవలను దృష్టిలో ఉంచుకుని కాపు సంఘీయులు సంఘటితంగా సంక్షేమం,రాజకీయ ఫలాలు పొందాలని ఆయన పిలుపునిచ్చారు.రేపల్లెలో జరిగిన ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు తన సహచరులతో ఎట్టకేలకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరటం చర్చనీయాంశమైంది.శాసనసభ ఎన్నికలకు సుదీర్ఘసమయం ఉన్నందున ప్రస్తుతం జరగాల్సిన మున్సిపల్,పంచాయతీ వంటి స్థానిక సంస్థల ఎన్నికలలో కాపు సామాజిక వర్గం ఏమేర ప్రభావం చూపుతుందో వేచి చూడాల్సిందే.వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాత్రం వైకాపాలో చేరే వారిలో ఉత్సాహాన్ని నింపుతూ పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిస్తున్నారు.రేపల్లె నియోజకవర్గంలో వైకాపా నాయకుల సంఖ్య పెరుగుతోంది.ప్రతి నాయకుడికి అనుచరగణం ఉంది.భేషజాలకు పోకుండా అందరూ ఐక్యమత్యంతో వైకాపా బలోపేతానికి కృషి చేస్తారా అనే సందేహం ప్రజలలో నెలకొంది.పార్టీ పరంగా ఎటువంటి కార్యక్రమాలు జరిగినా గ్రూపు రాజకీయాలకు ఆస్కారం లేనివిధంగా నిస్పక్షపాతంగా అందరినీ కలుపుకుపోవాల్సిన బాధ్యత వైకాపా రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త పీటా నాగమోహన్ కృష్ణపై ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించాలి

రేపల్లె, ఆగస్టు 4, ప్రభాతవార్త:విధి నిర్వహణకు సంబంధించి ఆశా వర్కర్లకు పనిభారం తగ్గించాలని సిఐటియు బాపట్ల జిల్లా కోశాధికారి సిహెచ్.మణిలాల్ కోరారు.మంగళవారం మండలంలోని మోళ్ళగుంట,విశ్వేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అధికారులకు ఆశా వర్కర్లు వినతిపత్రాలు



అందజేశారు.ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ కోవిడ్ అనంతరం ఆశా వర్కర్లకు పనిభారం పెరగడంతో మానసిక,శారీరక శక్తిని ఎదుర్కొంటున్నారని చెప్పారు.బ్రూ డైరీ పేరుతో మిగిలిన రికార్డులు రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.మెడికల్ హెల్త్ కమీషనర్ ఆదేశాలను అమలు చేయాలని ఆయన కోరారు.ఆశా వర్కర్లకు సంబంధంలేని ఎన్‌సిడిసిడి సర్వేలు చేయించరాదని,కుటుంబ అవసరాలు,అనారోగ్యం దృష్టిలో ఉంచుకుని సెలవులు కేటాయించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు,ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు కొప్పుల గోపి,సిహెచ్.వీరలక్ష్మి,గ్రోరీ,వెంకటేశ్వరమ్మ,లక్ష్మి,నాంచారమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మండలి.. సేవలు చిరస్మరణీయం

రేపల్లె, ఆగస్టు 4, ప్రభాతవార్త:ప్రముఖ గాంధేయవాది,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి,పార్లమెంట్ సభ్యునిగా మండలి వెంకటకృష్ణారావు అందించిన సేవలు చిరస్మరణీయమని రేపల్లె మానవత స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు కోడె గౌరీశంకర్ అన్నారు.మంగళవారం పట్టణంలోని చైతన్య జూనియర్ కళాశాల ఆవరణలో మండలి వెంకటకృష్ణారావు శత జయంతి కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ 1977 నాటి దివిసీమ ఉప్పెన సందర్భంగా అనితరమైన సేవలు అందించిన ఘనత మండలికే దక్కిందన్నారు.అధికార భాషా సంఘానికి మండలి కృష్ణారావు పేరు పెట్టడం తెలుగు భాష పట్ల ఆయనకు ఉన్న మక్కువను తెలియజేస్తున్నదని గుర్తు చేశారు.1975 నాటి ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు,1980లో మలేషియాలో ద్వితీయ ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో మండలి వెంకటకృష్ణారావు కీలకపాత్ర పోషించారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజనీబాబు,వి.బుచ్చిరావు,కె.లక్ష్మీనారాయణ,కన్నా నటరాజు,కె.శివశంకరరావు, పి.వి.కె. సాంబశివరావు,వి.మస్తాన్‌రావు,విద్యార్థులు,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల్లో ఎన్సిసి ద్వారా క్రమశిక్షణ .

ప్రత్తిపాడు (వట్టిచెరుకూరు), ఆగస్టు 4, ప్రభాతవార్త : ఎన్సిసి ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, నైతిక విలువలు పెరుగుతాయని 25వ బెటాలియన్ ఎన్సిసి అధికారి సుబేదార్ మేజర్ ఎస్.ఎం గులాబ్ పేర్కొన్నారు. మండలంలోని వింజనంపాడు గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎన్సిసి విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 25వ బెటాలియన్ ఎన్సిసి అధికారి సుబేదార్ మేజర్ ఎస్ఎం గులాబ్ హాజరై మాట్లాడుతూ...ఎన్‌సిసి ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, దేశభక్తి, సేవాభావం పెంపొందుతాయని పేర్కొన్నారు. బి మరియు సి సర్టిఫికెట్లు సాధించడం క్యాడెట్ల జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయని అభినందించారు. భవిష్యత్తులో రక్షణ దళాలు, ప్రభుత్వ సేవలు మరియు ఇతర పోటీ పరీక్షల్లో ఈ సర్టిఫికెట్లు ఎంతో ఉపయోగపడతాయని తెలియజేశారు. ప్రతి క్యాడెట్ ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేయాలని ఆ లక్ష్యసాధనకు విశేష కృషి చేయాలని వివరించారు. అప్పుడే మీకు, మీ తల్లిదండ్రులకు, కళాశాల యాజమాన్యానికి, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతులు లభిస్తాయని తెలియజేశారు. సర్టిఫికెట్ పొందిన ఎన్‌సిసి క్యాడెట్లందరికీ అభినందనలు తెలియజేశారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి శిబిరాలు, నాయకత్వ కార్యక్రమాల్లో పాల్గొని కళాశాలకు, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఎన్సిసి క్యాడెట్లకు బి మరియు సి ధృవపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ కోయ సుబ్బారావు, సెక్రెటరీ కోయ శేఖర్, అకాడమిక్ డైరెక్టర్ డా.కె.హరిబాబు, ప్రిన్సిపాల్ డా.పి.బాబు, ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ ఎం.నవీన్ కుమార్, ఎన్‌సిసి ట్రైనర్ అబ్దుల్లా బేగ్, తదితరులు పాల్గొన్నారు.



## ఆరంభాక స్మశాన వాటిక అభివృద్ధి పనులు ప్రారంభించిన డిసి చైర్మన్ ఎంఆర్కే

చెరుకుపల్లి ,ఆగస్టు 4, ప్రభాతవార్త : స్మశాన వాటిక అభివృద్ధి పనులు పూర్తిచేసి గ్రామస్తులకు అందుబాటులోకి తీసుకొస్తామని డిస్ట్రిబ్యూటర్ కమిటీ చైర్మన్ ముఖమాటం రాధాకృష్ణమూర్తి అన్నారు. మంగళవారం స్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణం పరిశీలించిన అనంతరం మట్టి తోలకం పనులను స్వయంగా పరిశీలించారు. గత 30 సంవత్సరాలుగా అభివృద్ధికి నోచుకోని స్మశాన వాటికను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ చొరవతో పనులు చేపట్టడం సంతోషంగా ఉందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక గ్రామస్తులు పలువురు పాల్గొన్నారు.



## పరిశ్రమల స్థాపనకు కూటమి ప్రభుత్వం కృషి

### -మండల టీడీపీ అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి

కొల్లిపర,అగస్టు 4 ప్రభాతవార్త: పరిశ్రమల స్థాపనకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుర‌న్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు భీమవరపు చిన కోటిరెడ్డి చెప్పారు.మంగళవారం మండల కేంద్రం కొల్లిపరలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం నాయకులతో కలసి నిర్వహించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా చినకోటిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు చెప్పారు.పేద ప్రజలను అన్ని విధాల ఆదుకోవటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు.ప్రతి మహిళ కూడా ఈ రాష్ట్రంలో ఎక్కడకు వెళ్ళాలన్నా ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందన్నారు.నాడు సూపర్‌సిక్స్‌లో ఏమైతే చెప్పాయో వాటిని అన్నింటినీ ఖచ్చితంగా కూటమి ప్రభుత్వం అమలు చేసిందన్నారు.పెన్షన్‌ను రూ.4 వేలు పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కిందన్నారు.తల్లికి వందనం పథకం ద్వారా చదువుకునే ప్రతి బిడ్డకు నగదు జమచేయటం జరిగిందన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆరిమండ రాధాకృష్ణారెడ్డి,కంచర్ల అమృతరాజు,ఆరిమండ వెంకటరెడ్డి,ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## యాప్‌తో కాంప్లెక్స్ఎరువులు కొనుగోలు విధానాన్ని రద్దు చేయాలి

కొల్లిపర,అగస్టు 4 ప్రభాతవార్త: యాప్ ద్వారానే కాంప్లెక్స్ ఎరువులను కొనుగోలు చేయాలనే విధానాన్ని రద్దు చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు కళ్ళం వెంకటప్పారెడ్డి అన్నారు.మంగళవారం గ్రామంలో వైసీపీ నాయకులు ర్యాలీ నిర్వహించి తహశీల్ధార్ కార్యాలయానికి చేరుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా వెంకటప్పారెడ్డి మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు నీరు అందిస్తామని చెప్పిన ప్రభుత్వం..మరలా సాగు నీరు అందించలేమని..ఆరుతడి పంటలు వేసుకోమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.ప్రభుత్వం వెంటనే సాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమంలో ఎంపీపీ భీమవరపు పద్మావతి,నాయకులు భీమవరపు సంజీవరెడ్డి,నెర్ల కుటుంబరెడ్డి,చెంచల రామిరెడ్డి,వంగా బూషిరెడ్డి,అవుతు సాంబిరెడ్డి,మర్రెడ్డి బ్రహ్మారెడ్డి,అవుతు నగేష్‌రెడ్డి,పిల్లి గంగాధర్,మంద్రు రాజు తదితరులు పాల్గొన్నారు.



## రైతులు పియం ఫసల్ భీమా యోజనలో చేరాలి..

గుంటూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త: రైతులు ఈ నెల 15వ తేదీ లోపు వరిపంట పండించే రైతులు పంటల భీమా చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడిఏ ఎన్.మోహన్రావు తెలిపారు. పెదకాకాని మండలంలోని నంబూరు గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ, పకృతి వ్యవసాయం మరియు డిఆర్డిఏ సంయుక్తంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏడిఏ మోహన్రావు హాజరై మాట్లాడుతూ..మండలంలో వరి పంట వేసిన ప్రతిఒక్క రైతు ఈ నెల 15వ తేదీ లోపు పీఎంఎఫ్ బివై పంటల బీమా చేయించుకోవాలన్నారు. ఈ ఏడాది ఎల్నినో ప్రభావం ఉండటం వల్లా పంట దిగుబడుల మీద ప్రభావం ఉంటుందని తెలియజేశారు. ప్రతిఒక్క రైతు వరిపంటకు ఎకరానికి రూ.800లు కామన్ సర్వీస్ సెంటర్ లో చెల్లించు కోవాలని సూచించారు. బ్యాంకు లో వరి పంటకు లోన్ తీసుకున్నవాళ్లు బ్యాంకులో ప్రీమియం కట్టుకోవచ్చని, మిరప పంటకు ఎకరానికి రూ. 2700లు, మినుము పంటకు ఎకరానికి రూ.200లు చొప్పున చెల్లించుకుని భీమాలో చేరవచ్చని పేర్కొన్నారు. ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారానే ఎరువులు ఇస్తామని, ఎరువులకు ఎటువంటి కొరత లేదని తెలిపారు. డిస్టిక్ ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ..ప్రతిఒక్క రైతు విత్తనం విత్తే ముందు బీజామృతంతో విత్తన శుద్ధి చేసిన ఎడల పంట కాలంలో వచ్చు తెగుళ్ళ తగ్గించుకోవచ్చున్నారు. ఏపిఎం బి.రాజు మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు డిఆర్డిఏ వెలుగు సిబ్బంది అందరూ సంయుక్తంగా ప్రతి గ్రామంలో పంటల భీమా గురించి రైతులకు అవగాహన కల్పించాలని వివరించారు. వ్యవసాయ అధికారి రమణ కుమార్, విఏ ఏలు, జెడ్బిఎన్ఎఫ్ సిబ్బంది, వెలుగు సిబ్బంది మరియు ఆదర్శ రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఎన్ సీసీ పూర్తి చేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల ప్రదానోత్సవం

నగరం, ఆగస్టు 4, ప్రభాతవార్త: ఎన్ సీసీ కేవలం శిక్షణ మాత్రమే కాదు యువతలో క్రమశిక్షణ ,నాయకత్వం పెంపొందించి గొప్ప వేదికని 22 ఏ బెటాలియన్ ఎన్ సీసీ తెనాలి కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ ఎ. ఉదయ్ కుమార్ అన్నారు. మంగళవారం ఎస్ వి ఆర్ ఎం కళాశాల లో ఎన్ సీసీ సర్టిఫికెట్ల ప్రదానోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 22 ఏ బెటాలియన్ ఎన్ సీసీ తెనాలి ఆధ్వర్యంలో ఎన్ సీసీ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులకు బి అండ్ సి సర్టిఫికెట్ల ప్రదానోత్సవం నిర్వహించారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ దేశం మనకు ఏమిచ్చిందని కాకుండా దేశానికి మనం ఏమి ఇవ్వగలమో ఆలోచించాలని, స్ఫూర్తితో అభ్యర్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్యతోపాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవర్చుకుని భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా తయారవ్వాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ సర్టిఫికెట్లు పొందిన అభ్యర్థులను ప్రశంసించారు. క్రమశిక్షణ, సేవాభావాన్ని ప్రతి ఒక్క విద్యార్థి అలవర్చుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ పి. శ్రీనివాసరావు, ఐ క్యు ఏ సి కోఆర్డినేటర్ ప్రసన్న బాబు, సూపరెండెంట్ పి. అమరేష్ రెడ్డి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కోడి పందాలపై టాస్క్ ఫోర్స్ ఆకస్మిక దాడి

గుంటూరు క్రైమ్,ఆగస్టు4,ప్రభాతవార్త: నిర్మానుష్య ప్రదేశంలో కోడిపందాలు నిర్వహిస్తున్నట్టు టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం అందడంతో దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మంగళవారం నగరంపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని విఐపి రోడ్,కావేరినగర్,3వ లైన్‌లో ఉన్న ఖాళీ ప్రదేశంలో కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు స్పెషల్ బ్రాంచ్ నగరంపాలెం,టాస్క్ ఫోర్స్ సిబ్బందికి విశ్వసనీయ సమాచారం అందింది.ఈ సమాచారాన్ని డియస్బి డిఎస్పీకి తెలియజేసి, టాస్క్ ఫోర్స్ సిఐ2 ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఆకస్మికంగా దాడి నిర్వహించారు.పోలీసులను గమనించిన నిర్వాహకులు,పాల్గొన్న వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు.ఘటన స్థలంలో నుంచి 2 పందెం పుంజులు,4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని,తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నగరంపాలెం పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. గుంటూరు జిల్లా పోలీసులు కోడి పందాలు,జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తూ,ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎల్‌నినో ప్రభావంతో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి

యడ్లపాడు, ఆగస్టు 4, ప్రభాతవార్త : ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎడ్లపాడు పశు వైద్య సహాయ సంచాలకులు వై రాధాకృష్ణ సూచించారు. ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో కారణంగా ఉష్ణోగ్రతలు, వాతావరణ పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున పశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పాడి రైతులు పశుసంవర్ధక శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

## చిరుజల్లులతో పత్తి రైతుల్లో ఆనందం

యడ్లపాడు, ఆగస్టు 4, ప్రభాతవార్త : ఇటీవల కురుస్తున్న చిరుజల్లులు పత్తి రైతులకు ఊరటనిచ్చాయి. ఈ వర్షాల ప్రభావంతో పత్తి విత్తనాలు సుమారు 90 శాతం వరకు మొలకెత్తడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో కురిసిన తేలికపాటి వర్షాల వల్ల భూమిలో తగినంత తేమ ఏర్పడి, విత్తనాలు సమృద్ధిగా మొలకెత్తాయని రైతులు తెలిపారు. దీంతో పొలాలన్నీ పచ్చని మొక్కలతో కళకళలాడుతున్నాయని పేర్కొన్నారు.

## తల్లిపాలే శిశువుకు తొలి టీకా - డాక్టర్ భరద్వాజ్

యడ్లపాడు, ఆగస్టు 4, ప్రభాతవార్త : ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని ఆగస్టు 1 నుంచి 7 వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎడ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి భరద్వాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు పట్టించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి కుటుంబం అవగాహన పెంచుకుని, శిశువుల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## మిట్టపల్లి కళాశాలలో ప్రాంగణ ఎంపికలు

యడ్లపాడు, అగస్టు 4, ప్రభాతవార్త : మండల పరిధిలోని బోయపాలెం గ్రామ సమీపంలోని మిట్టపల్లి కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ కళాశాల నందు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ గోపి కృష్ణ మరియు కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం సంయుక్త అధ్వర్యంలో బిటెక్ 4వ సంవత్సరం చదువుతున్న సిఎస్ఇ, ఎఐ, డిఎస్, ఐటి అండ్ ఈసిఈ విద్యార్దిని, విద్యార్దులకు క్యాస్పైడర్ కంపెని కళాశాల ఎంపికలు నిర్వహించింది. వీరికి వార్షిక వేతనం 3.5నుండి9.5లక్షలు వరకు ఉంటుందని కంపెని హెచ్‌అర్ ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ ఎంబివి సత్యనారాయణ ఎంపికైన విద్యార్దిని, విద్యార్దులను అభినందించి మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో రాణించాలంటే అధునిక సాంకేతికను అందిపుచ్చుకొని అన్ని రంగాలలో అత్యుత్తమ ప్రతిభ కనపరచాలని అకాంక్షించారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎమ్ కిషోర్ కుమార్ ఎంపికైన విద్యార్దిని, విద్యార్దులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎడి సిహెచ్ శ్రీనివాసరావు, టిపిఒ కె విజయ్‌కుమార్ వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



## కాకాని శ్రీ మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో సన్నిధిలో శాస్త్రోత్తముగా పవిత్రోత్సవములు

గుంటూరు, ఆగస్టు 4,ప్రభాతవార్త :శ్రీ మల్లేశ్వరస్వామి వారి సన్నిధిలో మంగళ వారం నుండి గురువారము వరకు నిర్వహించు పవిత్రోత్సవములు మంగళ వారము ఉదయం 9శైవాగమ ఆగమము ననుసరించి ఆలయ స్థానాచార్యులు, ప్రధాన అర్చక, అర్చకస్వాములు, వేదపండితుల పర్యవేక్షణలో శాస్త్రోత్తముగా ప్రారంభించినట్లు ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ తెలిపారు పాలకమండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు తెలిపారు. పవిత్రోత్సవములలో భాగముగా మంగళవారము ఉదయం పవిత్రములు గల వెదురుపేటికలతో ఆలయ యజ్ఞశాల ప్రదక్షిణ పూర్వకముగ యగాశాలా ప్రవేశము శివానుజ్ఞ శ్రీ విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనము, పంచగవ్య పూజ, ప్రాశన, రక్షాసూత్రపూజ, ధారణ, ఋత్విగ్వరణ, దీక్షాధారణ, అఖండ దీపస్థాపన, యాగేశ్వర కుంభస్థాపన, పూజ, వాస్తు కుంభస్థాపన, పూజ, వాస్తు శాంతిహోమము, బలి పర్యాగ్నికరణ, బలిహరణ తీర్థప్రసాద వినియోగము జరిగింది.సాయంత్రం గం.5.30 నుండి మంగళవాయిద్యం, చతుర్వేదపారాయణలు, గోపూజ అనుజ్ఞ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యం, వాస్తుశాంతి, వాస్తుపర్యగ్నీకరణ, మృత్సగ్రహణం, అంకురార్పణం, రక్షాబంధనం, మంత్రపుష్పం, హారతి విభూతి, కుంకుమ ప్రసాద వితరణ జరిగినట్లు తెలిపారు.2వ రోజు పవిత్రోత్సవముల కార్యక్రమములలో భాగముగా పవిత్ర సమర్పణ, విశేష ద్రవ్య హోమం, పూర్ణాహుతి, ఉపచారం, మంత్రపుష్పం, హారతి, విభూతి, కుంకుమ ప్రసాద వితరణలు తదితర కార్యక్రమములు జరుగునని, 3వ రోజు పవిత్రోత్సవముల కార్యక్రమములో విశేష సంధి, ద్వితీయ కాలయాగశాల పూజ, అవభృదయాగం, చతుర్వేదపారాయణలు, మహాపూర్ణాహుతి, యాత్రాదానం, కలశాభిషేకం, అలంకారం, పరివార దేవతా పవిత్ర సమర్పణ శ్రీ గంగా భ్రమరాంభ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వారికి విశేష వ్రత చరితపూజ, పవిత్ర సమర్పణ, స్వామి వారి మూల మంత్ర తత్వార్చన, మంత్రపుష్పం, హారతి, విభూతి, కుంకుమ ప్రసాద వితరణతో పవిత్రోత్సవములు ముగియునన్న ఆలయ ఉపకమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి గోగినేని లీలాకుమార్ తెలిపారు పాలకమండలి చైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు తెలిపారు.మంగళవారం పూజా కార్యక్రమాలలో ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలా కుమార్ , ఛైర్మన్ కోసూరి పూర్ణచంద్రరావు దంపతులు, బండారు మల్లేశ్వరి దంపతులు, వుల్లం రాజేశ్వరి దంపతులు, ధూపాటి శివశంకరరావు, బైరపనేని ధనలక్ష్మి దంపతులు, ఎక్స్ అఫీషియో సభ్యులు పేటేటి ధన మహేశ్వర ప్రసాద్ భక్తులు తదితరులు పాల్గొన్నారు. పై పవిత్రోత్సవములు కార్యక్రమములకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి వార్ల కృపకు ప్రాతులు కాగలరని ఆలయ ఉపకమీషనరు గోగినేని లీలాకుమార్ విజ్ఞప్తి చేసినారు.

## పండరిపురంలో ఇంటింటికి కూటమి ప్రభుత్వం - సంక్షేమ విజయాల్లు కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఆగస్టు 4,ప్రభాతవార్త :రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసేందుకు నిర్వహిస్తున్న "ఇంటింటికి కూటమి ప్రభుత్వం - సంక్షేమ విజయాలు" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు.మంగళవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 33వ డివిజన్ పండరిపురంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. గతంలో కనీసం ఇంటి ముందు సరైన రహదారి కూడా లేని ప్రాంతాల్లో నేడు మెరుగైన రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థలు, తాగునీటి సౌకర్యాలు, విద్యుత్ దీపాలు వంటి మౌలిక వసతులు కల్పిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.గత ప్రభుత్వాల మాదిరిగా పార్టీలు, వర్గాలు, రాజకీయ అనుబంధాల ఆధారంగా కాకుండా ప్రతి ఒక్కరినీ సమానంగా చూస్తూ పారదర్శక పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలందరూ సమానమే అన్న సంకల్పంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, ఎక్కడా వివక్షకు తావులేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు .ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా దూసుకుపోతోందని ఎమ్మెల్యే తెలిపారు. స్వర్ణాంధ్ర2047 లక్ష్య సాధన దిశగా ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోందని, రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.



## మహిళా గ్రీవెన్స్‌లో మహిళల నుండి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, ఆగస్టు4,ప్రభాతవార్త :గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం నిర్వహించిన మహిళా గ్రీవెన్స్ కార్యక్రమంలో మహిళల నుంచి పలు వినతులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు స్థల వివాదాలు, పెన్షన్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ల జారీ, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి హామీ ఇచ్చారు. వినతులన్నింటినీ పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.

## ఆయుష్ వైద్యశాలకు స్థల పరిశీలన చేసిన కేంద్ర బృందం..

ప్రత్తిపాడు, ఆగస్టు 4, ప్రభాతవార్త : ఆయుష్ ఆసుపత్రి, అనుబంధ సంస్థల ఏర్పాటుకు సంబంధించి ప్రత్తిపాడు మండలం నడింపాలెం గ్రామ పరిధిలో కేంద్ర యోగ మరియు పకృతి వైద్య పరిశోధన మండలి (సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగ నాటురోపతీ (సీసీవైఎన్ఆర్) సంచాలకులు డా.జ్యోతి కేశ్వాణి, ఆయుష్ మంత్రిత్వశాఖ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ కన్సల్టెంట్ ప్రమోద్ వర్మ, పరిశోధనాధికారి డా.ఎన్వి.జ్ఞానదీప్ తటావర్తి బృందం మంగళవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ సియం.సాయికాంత్ వర్మ ఆయుష్ వైద్యశాల స్థలానికి సంబంధించిన వివరాలను కేంద్ర బృందానికి తెలియపరిచారు. గుంటూరు పట్టణానికి అతి సమీపంలో ఆయుష్ ఆసుపత్రి, అనుబంధ సంస్థలు రావడం వలన ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డా.బూర్ల రామాంజనేయులు, రాష్ట్ర ఆరోగ్యశాఖ జాయింట్ సెక్రటరీ, ఆయుష్ విభాగం సంచాలకులు ఆర్.గోపాలకృష్ణ, గుంటూరు రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాసరావు, తహసిల్దార్ వెంకటేశ్వరావు, మండల టిడిపి అధ్యక్షులు గింజుపల్లి శివరాంప్రసాద్, మీడియా కోఆర్డినేటర్ గింజపల్లి వెంకటేశ్వరరావు, జిడిసిసి బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ కుర్రి పున్నారెడ్డి, మాజీ జెడ్పిటిసి సభ్యులు దొక్కుమల్ల భాగ్య రావు, తదితర కూటమి నేతలు పాల్గొన్నారు.



## ఇది మాటల ప్రభుత్వం కాదు, చేతల ప్రభుత్వం.. ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రత్తిపాడు, ఆగస్టు 4, ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే, పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని నడింపాలెం గ్రామ పరిధిలో మంగళవారం కేంద్రం ఆయుష్ బృందం జిల్లా కలెక్టర్ తో కలిసి ఎమ్మెల్యే రామాంజనేయులు స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అతి త్వరలో ప్రత్తిపాడు నియోజకవర్గం నడింపాలెం గ్రామ పరిధిలో 100 పడకల ఆయుష్ మరియు యోగ హాస్పిటల్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలియజేశారు. ప్రజల ఆరోగ్యమే కూటమి ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమనే సంకల్పంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే కేంద్ర బృంద నిపుణులను మరియు కలెక్టర్ ను శాలువాతో సత్కరించి హృదయపూర్వక ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోరినట్టుగా కేంద్ర ప్రభుత్వం మన రాష్ట్రానికి రూ.100 కోట్ల వ్యయంతో 100 పడకల హాస్పిటల్ను ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోనే నిర్ణయించడం, ఈ మేరకు కేంద్ర నిపుణులు ఇప్పటికే రెండవసారి పర్యటించడం జరిగిందన్నారు. మొదటిసారి కొన్ని అభ్యర్థనలు సమర్పించగా వాటిని కలెక్టర్ సాయి కాంత్ వర్మ, ఆయుష్ డైరెక్టర్ ఆ ప్రశ్నలన్నింటికీ జవాబు ఇవ్వడం జరిగిందని వివరించారు. వాటిని దృష్టిలో పెట్టుకొని కేంద్ర మంత్రివర్యులు పెమ్మసాని చంద్రశేఖర్ చొరవతో రెండోసారి కేంద్ర బృందం పరిశీలించడం జరిగిందని పేర్కొన్నారు. నడింపాలెంలో 15 ఎకరాల భూమిని ఇవ్వడానికి స్థానిక ప్రజలు, కలెక్టర్ మరియు ప్రజా ప్రతినిధిగా నేను అంగీకరించామని తెలిపారు. సీఎం చంద్రబాబు విషన్ 2047, ఆరోగ్య ఆంధ్ర ఆలోచనలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందని వెల్లడించారు. ఇది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వం మని, మా ప్రభుత్వం ఏదైతే చెబుతుందో అది కచ్చితంగా చేసి చూపిస్తాం అనే అవగాహన ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా అతి త్వరలోనే ఆయుష్మ హాస్పిటల్ మరియు యోగ హాస్పిటల్ ప్రారంభం అవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేంద్ర బృందం ప్రకృతి వైద్య పరిశోధనా మండలి సంసాలకు డాక్టర్ జ్యోతి కేశ్వాణి, ఆయుష్ మంత్రిత్వ శాఖ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ ప్రమోద్ వర్మ, పరిశోధన అధికారి డాక్టర్ ఎన్వి జ్ఞానదీప్ తటావర్తి, కలెక్టర్ సాయి కాంత్ వర్మ, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ వెంకటేశ్వరరావు, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



05-08pg10exK_05-08pg10exK.qxd 04/Aug/26 10:56 PM Page 1



ఆట

# సన్‌రైజర్స్ ప్రక్షాళన

## ఐదుగురు ప్లేయర్లు ఔట్



**న్యూఢిల్లీ:** ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఊరించి ఊసురుమనిపించింది. అద్వితీయమైన ప్రదర్శనతో ప్లే ఆఫ్స్ చేరిన ఆరెంజ్ ఆర్మీ కీలక ఎలిమినేటర్‌లో చేతులెత్తేసి ఇంటిబాట పట్టింది. టైటిల్ అందుకోకపోయినా అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. తృటిలో టైటిల్ అందుకునే అవకాశం కోల్పోయిన ఆరెంజ్ ఆర్మీ వచ్చే ఏడాది మరింత బలంగా తిరిగి రావాలనే పట్టుదలతో ఉంది. తదుపరి సీజన్ కోసం జట్టును బలోపేతం చేయడంపై కావ్యమారన్ నేతృత్వంలోని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. ఐపీఎల్ 2027 మినీ వేలం ఈ ఏడాది నవంబర్ లేదా డిసెంబర్ తొలి వారంలో జరిగే వీలుండటంతో జట్టుకు భారంగా ఉన్న ఐదుగురు ఆటగాళ్లను వదిలేయనుంది. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్‌ను వదిలేయనుంది. మినీవేలంలో అన్‌సోల్డ్ లివింగ్ స్టోన్‌ను చివరి నిమిషంలో ఆరెంజ్ ఆర్మీ రూ.13 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. కానీ అతనికి తుది జట్టులో అవకాశాలు ఇవ్వకుండా రెండు మ్యాచ్‌ల్లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వీలు కల్పించినా 15 పరుగులు మాత్రమే చేసి ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయలేదు. దీంతో అతన్ని వదిలేసి ఆల్‌రౌండర్ కొనుగోలుకు సన్‌రైజర్స్ భావిస్తోంది. ఇక సీనియర్ పేసర్‌గా జట్టు బౌలింగ్ విభాగాన్ని నడిపిస్తాడని ఆశించిన జయదేవ్ ఉనాద్కత్ నిరాశపర్చాడు. పేలవ బౌలింగ్ ప్రదర్శనతో తుది జట్టులో చోటు కూడా కోల్పోయాడు. 4 మ్యాచ్‌లు మాత్రమే ఆడి 4 వికెట్లే తీసాడు. 10.91 ఎకానమీతో ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. స్పిన్ ఆల్‌రౌండర్ జీషన్ అన్సారీకి కూడా గుడ్‌బై చెప్పనుంది. ఈ ఐపీఎల్‌లో ఒక్క అవకాశం కూడా ఇవ్వలేదు. యువ స్పిన్నర్లు శివాంగ్ కుమార్, హర్ష్ దూబే సత్తా చాటడంతో జీషన్ అన్సారీ పూర్తిగా బెంచ్‌కే పరిమితమయ్యాడు. దీంతో అన్సారీని వదిలేసి యువ స్పిన్నర్‌ను ఎంచుకోవాలనే యోచనలో సన్‌రైజర్స్ ఉంది. హర్షల్ పటేల్ ప్రదర్శనపై కూడా అసంతృప్తిగా ఉంది. ఐపీఎల్‌లో 5 మ్యాచ్‌లు ఆడిన హర్షల్ 10.83 ఎకానమీతో ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. తొలి నాలుగు మ్యాచ్‌ల్లో 11.48 ఎకానమీతో పరుగులు సమర్పించుకొని తుది జట్టులో చోటు కోల్పోయాడు. 2 మ్యాచ్‌లే ఆడిన డేవిడ్ పేన్ ఆర్‌సీబీతో తొలి మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసాడు. కానీ కేకేఆర్‌తో మరుసటి మ్యాచ్‌లో తేలిపోయాడు. రెండు మ్యాచ్‌ల్లో 35 పరుగుల చొప్పున సమర్పించుకొని తుది జట్టులో చోటు కోల్పోయాడు.

### మహిళల టి20 ర్యాంకింగ్స్..

## నం.1 బెత్ మూనీ

### ఆరో స్థానానికి చమరి



**న్యూఢిల్లీ:** ఇటీవల ముగిసిన ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శనల తర్వాత, ఆస్ట్రేలియా ఓపెనర్ బెత్ మూనీ ఐసీసీ మహిళల టీ20ఐ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో పాకిస్థాన్‌పై జట్టు సిరీస్ విజయంతో శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టు తాజా ఐసీసీ మహిళల టీ20ఐ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తన కెరీర్‌లోనే అత్యుత్తమమైన ఆరో స్థానాన్ని సాధించింది. ఆమె నిలకడైన ప్రదర్శనలు ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం పైకి ఎగబాకి ఆరో స్థానానికి చేరడంతో పాటు, తన కెరీర్‌లోనే అత్యధిక రేటింగ్ పాయింట్లను కూడా సంపాదించిపెట్టాయి. పాకిస్థాన్‌తో జరిగిన తొలి టీ20లో చిరస్మరణీయమైన అజేయ 101 పరుగులు చేసిన తర్వాత, శ్రీలంకకు చెందిన ఇమేషా దులానీ ర్యాంకింగ్స్‌లో 33 స్థానాలు పైకి ఎగబాకించి, కెరీర్‌లోనే అత్యుత్తమమైన 23వ స్థానానికి చేర్చింది. అలాగే వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 4స్థానాలు ఎగబాకిన హర్షిత సమరవిక్రమ, 13వ స్థానానికి చేరుకుంది. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో ఆమె చేసిన అజేయ 73 పరుగులు, శ్రీలంక ఎనిమిది వికెట్ల విజయంలో కీలక పాత్ర పోషించాయి. శ్రీలంకకు చెందిన హసిని పెరేరా రెండు స్థానాలు ఎగబాకి 35వ స్థానానికి చేరుకోగా, పాకిస్థాన్‌కు చెందిన గుల్ ఫిరోజా తొమ్మిది స్థానాలు ఎగబాకి 45వ స్థానానికి, కెప్టెన్ ఫాతిమా సనా ఆరు స్థానాలు ముందుకు దూసుకెళ్లి 56వ స్థానానికి చేరుకున్నారు. వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో, పాకిస్థాన్ ఎడమచేతి వాటం స్పిన్నర్ నష్రా సంధు మూడు స్థానాలు ఎగబాకి టాప్10కు చేరుకుంది. శ్రీలంక కెప్టెన్ అటపట్టు కూడా వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఒకస్థానం మెరుగుపడి 31వ స్థానానికిచేరుకోగా, ఆల్‌రౌండర్ కవిషా దిల్‌హరి మూడు స్థానాలు ఎగబాకి 33వ స్థానానికి చేరుకుంది.

## హండ్రెడ్ ఉమన్ కాంపిటేషన్.. సదరన్ బ్రేవ్ ఉమన్ తొలి ఓటమి

### జెమీమా మెరుపులు వృథా

**న్యూఢిల్లీ:** హండ్రెడ్ వుమెన్ కాంపిటేషన్‌లో సదరన్ బ్రేవ్ వుమెన్ తొలి ఓటమి చవిచూసింది. సదరన్ బ్రేవ్‌తో జరిగిన మ్యాచ్‌లో వెల్ష్ ఫైర్‌తో ఆఖరి బంతికి విజయాన్ని అందుకుంది. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సదరన్ బ్రేవ్ వుమెన్ 100 బంతుల్లో 5 వికెట్ల నష్టానికి 121 పరుగులు చేసింది. లారా వోల్వార్ట్ 45 బంతుల్లో 48 పరుగులు, జెమీమా రోడ్రిగ్స్ 21 బంతుల్లో 25 పరుగులతో రాణించారు. వెల్ష్ ఫైర్ బౌలర్లలో హెథర్ గ్రహమ్, గ్రేస్ పాట్స్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం వైల్ష్ ఫైర్ నిర్ణీత 100 బంతుల్లోనే 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. వెల్ష్ ఫైర్ బ్యాటింగ్‌లో టాపార్డర్, మిడిలార్డర్ విఫలమైన చోట లోయర్ ఆర్డర్‌లో హెథర్ గ్రహమ్ 28 బంతుల్లో 35 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును గెలిపింది. ఆమెకు గ్రేస్ థాంప్సన్ 16 పరుగు, నిమ్వా హోలండ్ 12 పరుగులతో నాటౌట్‌గా సహకారం అందించారు. సదరన్ బ్రేవ్ బౌలర్లలో టిల్లీ కోర్టిన్ 3 వికెట్లు తీయగా, ఇస్సి వాంగ్ 2 వికెట్లు తీసింది. ఈ విజయంతో వెల్ష్ ఫైర్ 5 మ్యాచ్‌ల్లో రెండో విజయంతో పట్టికలో నాలుగో స్థానంలో ఉండగా, సదరన్ బ్రేవ్ ఓటమి పాలైనప్పటికీ టాప్‌లోనే కొనసాగుతోంది.





### ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో..

## తొమ్మిదో సీడ్‌గా సింధు

### ఐదో సీడ్‌గా సాత్విక్, చిరాగ్ జోడీ

**న్యూఢిల్లీ:** ఈ నెల 17 నుంచి 23 వరకు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరగనున్న 2026 బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల కోసం, మహిళల సింగిల్స్ ఈవెంట్‌లో పివి సింధుకు తొమ్మిదో సీడ్ లభించగా, పురుషుల డబుల్స్ జోడీ సత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలకు ఐదో సీడ్ లభించింది. ఈ టోర్నమెంట్‌లో భారత్ ఐదు విభాగాలలో ఒక్కోదానిలో రెండు జట్లను బరిలోకి దించుతుంది. వాటిలో నాలుగు విభాగాలలో కనీసం ఒక సీడెడ్ ఆటగాడు లేదా జంట ఉంటుంది. సింధు, మాజీ ఆసియా క్రీడల ఛాంపియన్‌లు అయిన సత్విక్, చిరాగ్‌లతో పాటు, పురుషుల సింగిల్స్ డ్రాలో లక్ష్య సేన్‌కు 14వ సీడ్ లభించింది. ధ్రువ్ కపిల, తనిషా క్రాస్టోల మిక్స్‌డ్ డబుల్స్ జోడీ 15వ సీడ్‌గా ఛాంపియన్‌షిప్‌లలోకి ప్రవేశిస్తుంది. అలాగే షి యుకి మరియు ఆన్ సే యంగ్ సింగిల్స్ సీడింగ్‌లలో ముందున్నారు. ప్రస్తుత పురుషుల సింగిల్స్ ప్రపంచ ఛాంపియన్, చైనాకు చెందిన షి యుకి టాప్ సీడ్‌గా ఎంపిక కాగా, మహిళల సింగిల్స్ విభాగంలో దక్షిణ కొరియాకు చెందిన ఆన్ సే యంగ్ అగ్రస్థానంలో ఉంది. ప్రస్తుత మహిళల సింగిల్స్ ప్రపంచ ఛాంపియన్, జపాన్‌కు చెందిన అకానె యమగుచి రెండవ సీడ్‌గా నిలవగా, ఆ తర్వాత చైనాకు చెందిన వాంగ్ జియి మరియు చెన్ యుఫెయి వరుసగా మూడవ మరియు నాల్గవ స్థానాల్లో ఉన్నారు.

### తొలి స్నేహపూర్వక మ్యాచ్‌లో..

## భారత్ జట్టు గెలుపు

### 3-0తో సింగపూర్ ఓటమి

**న్యూఢిల్లీ:** తొలి స్నేహపూర్వక మ్యాచ్‌లో సింగపూర్‌పై 3-0 తేడాతో భారత్ విజయం సాధించింది. తద్వారా భారత అండర్20 జట్టు, ఏఎఫ్‌సి అండర్20 ఆసియా కప్ చైనా 2027 క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించింది. భారత్ తరఫున ఒమాంగ్ డోడుమ్ (45+2) తొలి గోల్ సాధించాడు. 63వ నిమిషంలో సింగమయుమ్ షమీ గోల్ చేసి ఆతిథ్య జట్టుకు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. 83వ నిమిషంలో సింగపూర్ చేసిన ఓన్ గోల్ కారణంగా భారత్ 3-0 ఆధిక్యాన్ని కోల్పోయింది. సింగపూర్ అండర్20 జట్టు రెండు స్నేహపూర్వక మ్యాచ్‌ల కోసం భారత పర్యటనలో ఉంది. రెండో మ్యాచ్ ఈ నెల 6వ తేదీన జరగనుంది. కాగా భారత్, సింగపూర్‌ల మధ్య 1966లో తొలిసారిగా ఒక అండర్20 మ్యాచ్‌లో తలపడ్డాయి. ఆ తొలి పోరులో భారత్, సింగపూర్‌ను 4-1 తేడాతో ఓడించింది. 1974లో, ఏఎఫ్‌సీ యూత్ ఛాంపియన్‌షిప్ క్వార్టర్ ఫైనల్‌లో పెనాల్టీ షూటౌట్‌లో భారత్, సింగపూర్‌ను ఓడించింది. ఆ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌ను భారత్ గెలుచుకుంది. భారత్, సింగపూర్ జట్లు అండర్19 ఫుట్‌బాల్‌లో కూడా తలపడ్డాయి. ఇరు జట్లు చెరొక మ్యాచ్ గెలుచుకున్నాయి. కాగా భారత్ ఎఎఫ్‌సి అండర్ 20 ఆసియా కప్ క్వాలిఫికేషన్‌లో గ్రూప్ బి లో ఉన్నారు. వారు ఈనెల 31న జరిగే తమ మొదటి గేమ్‌లో సిరియాతో తలపడతారు. బ్లూ కోల్ట్స్ తమ తదుపరి రెండు గేమ్‌లలో వరుసగా సెప్టెంబర్ 3, 6 తేదీలలో ఉజ్బెకిస్తాన్ మరియు బంగ్లాదేశ్‌లతో తలపడతారు.






## ఎయిర్‌టెల్ నికరలాభం రూ.8167 కోట్లు

### ఆదాయం రూ.58,539 కోట్లు

**ముంబయి,ఆగస్టు 4:** దేశంలో రెండో అతిపెద్ద టెలికాం సంస్థ భారతి ఎయిర్‌టెల్ తొలి త్రైమాసికం ఏకీకృత నికర లాభం 37.3 శాతం పెరిగి రూ.8,167 కోట్లకు చేరుకుంది. కంపెనీ మొత్తం ఆదాయం 18.4 శాతం పెరిగి రూ.58,539 కోట్లకు చేరుకుంది. మాత్రం మార్కెట్ అంచనాలను మించి ఆదాయం నమోదైంది.కంపెనీ లాభాలపై కొన్ని ప్రత్యేక అంశాలు ప్రభావం చూపాయి. గ్రూప్‌కు చెందిన ఒక అనుబంధ సంస్థలో వాణిజ్య వివాదానికి సంబంధించి సూత్రప్రాయ పరిష్కారం కోసం రూ.353.4 కోట్ల ప్రత్యేక కేటాయింపు చేయగా, గత సంవత్సరాలకు సంబంధించిన వ్యాపార నష్టాలపై అనుకూల తీర్పు రావడంతో రూ.389.8 కోట్ల ప్రత్యేక పన్ను ప్రయోజనం కూడా లభించింది.గత త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ ఆదాయం రూ.55,383 కోట్ల నుంచి రూ.58,539 కోట్లకు చేరి 5.7 శాతం పెరిగింది. అదే విధంగా నికర లాభం రూ.7,325 కోట్ల నుంచి రూ.8,167 కోట్లకు పెరిగి 11.5 శాతం వృద్ధి నమోదు చేసింది. భారత కార్యకలాపాల పరంగా ఎయిర్‌టెల్ ఆదాయం రూ.41,214 కోట్లకు చేరింది. ఇది గత ఏడాది ఇదే కాలంలోని రూ.37,584 కోట్లతో పోలిస్తే 9.7 శాతం అధికం. మొబైల్ సేవల్లో ప్రీమియం ప్లాన్లకు వినియోగదారులు మారడం, హోమ్ బ్రాడ్‌బ్యాండ్, ఎంటర్‌ప్రైజ్ సేవల్లో బలమైన వృద్ధి ఈ ఫలితాలకు ప్రధాన కారణాలుగా కంపెనీ పేర్కొంది.కంపెనీ మొత్తం ఆదాయంలో 73 శాతం వాటా కలిగిన మొబైల్ సేవల విభాగం ద్వారా రూ.29,928 కోట్ల ఆదాయం లభించింది.



## నైకా నికరలాభం రూ.80 కోట్లు

### రాబడులు రూ.2782 కోట్లు

**ముంబయి,ఆగస్టు 4:** నైకా మాతృసంస్థ ఎఫ్ఎస్ఎన్ ఈకామర్స్ వెంచర్స్ కంపెనీ నికర లాభం రూ.80 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.23.3 కోట్లతో పోలిస్తే ఇది 243.3 శాతం పెరుగుదల. అంచనా వేసిన రూ.83 కోట్ల కంటే స్వల్పంగా తక్కువగా నమోదైంది. కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 29 శాతం పెరిగి రూ.2,782 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.2,155 కోట్లు కాగా, విశ్లేషకుల అంచనా రూ.2,762 కోట్లను కూడా అధిగమించింది.ఆపరేటింగ్ పనితీరు కూడా బలంగా నమోదైంది. కంపెనీ ఈబిట్డా 67.8 శాతం పెరిగి రూ.236 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.140.7 కోట్లు. మార్కెట్ అంచనా రూ.230 కోట్లను కూడా అధిగమించింది.ఈబిట్డా మార్జిన్ 6.5 శాతం నుంచి 8.5 శాతానికి పెరిగి 200 బేసిస్ పాయింట్ల మెరుగుదలను నమోదు చేసింది. ఇది విశ్లేషకుల అంచనా అయిన 8.3 శాతం కంటే మెరుగ్గా ఉండటం విశేషం. మొత్తం స్థూల వాణిజ్య విలువలు 34 శాతం వృద్ధిని నమోదయ్యాయి. ముఖ్యంగా ఫ్యాషన్ విభాగం అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి నెట్ సేల్స్ వ్యాల్యూ 54 శాతం పెరిగింది. బ్యూటీ విభాగం కూడా 29 శాతం ఎన్ఎస్‌వీ వృద్ధితో స్థిరమైన పనితీరును ప్రదర్శించింది.ఇక వ్యాపార విస్తరణలో భాగంగా అమిను సంస్థలో పూర్తిగా డైల్యూటెడ్ ప్రాతిపదికన 51 శాతం వాటాను గరిష్టంగా రూ.32 కోట్ల పెట్టుబడితో కొనుగోలు చేయడానికి నైకా డైరెక్టర్ల మండలి ఆమోదం తెలిపింది.



## వాణిజ్యం

## లాభాలకు బ్రేక్.. నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, ఆగస్టు 4:** ఈక్విటీ మార్కెట్లలో కొత్త ట్రేడింగ్ సెషన్ విధానం అమలులోకి వచ్చిన తర్వాత, సెషన్ చివర్లో ఊపందుకున్న స్టాక్ మార్కెట్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 50 మంగళవారం సెషన్‌లో తీవ్ర నష్టాలను చవిచూశాయి. దీంతో గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న మార్కెట్ లాభాల పరంపరకు బ్రేక్ పడింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో పెట్టుబడిదారులు తీవ్ర అప్రమత్తత వహించడం.. లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం మార్కెట్ పతనానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. చివరకు బీఎస్ఈ సెన్సెక్స్ 210.08 పాయింట్లు క్షీణించి 78,428.95 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 159.40 పాయింట్లు పడిపోయి 24,614.90 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సెషన్ ఆసాంతం బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, ఐటీ స్టాక్‌లు తీవ్ర ఒత్తిడిలోనే కొనసాగాయి. ఈ రంగాలు మార్కెట్ సూచీలలో ఎక్కువ వెయిటేజీ కలిగి ఉండటం వల్ల వాటిలో వచ్చిన అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి కారణమైంది. ఆర్‌బిఐ ద్రవ్య సమీక్ష కోసం ఎదురుచూస్తున్న పెద్ద పెట్టుబడిదారులు కొత్తగా నిధులు కేటాయించే కంటే వేచి చూసే ధోరణికే మొగ్గు చూపారు. రంగాల వారీగా పరిశీలిస్తే నిఫ్టీ రియల్టీ అత్యధికంగా రెండు శాతానికి పైగా నష్టపోయి అత్యంత బలహీనమైన విభాగంగా నిలిచింది. దీంతో పాటు ఐటీ, సిమెంట్, ఎఫ్ఎంసీజీ, ప్రైవేట్ బ్యాంకింగ్, ఫార్మా, హెల్త్‌కేర్ రంగాలు కూడా బలహీనంగా ముగిశాయి. నిఫ్టీ 50 జాబితాలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, హిందుస్తాన్ యూనిలీవర్ షేర్లు అత్యధిక నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.29 శాతం నష్టంతో ముగియగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ మాత్రం 0.23 శాతం కొద్దిపాటి లాభాన్ని సాధించింది.





### గ్లోబల్ ఏవియేషన్ కంపెనీ ఇండిగో

## ఉద్యోగులనుద్దేశించి కొత్త సిఇఒ తొలి కాల్..

**ముంబయి, ఆగస్టు 4:** ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ ఇండిగో కొత్త సీఈఓగా విల్లీ వాల్ష్ బాధ్యతలు స్వీకరించాక సంస్థ ఉద్యోగులను ఉద్దేశించి తొలిసారి ప్రసంగించారు. ఇండిగో ప్రపంచంలోని అగ్రశ్రేణి విమానయాన సంస్థల్లో ఒకటిగా ఎదగడాన్ని తాను ప్రత్యక్షంగా గమనించానని చెప్పారు.' బలమైన పునాది, స్పష్టమైన వ్యూహం, ప్రాథమిక విలువలను ఎప్పుడూ మరవని సంస్థ సంస్కృతి ఈ విజయానికి కారణమని వాల్ష్ పేర్కొన్నారు.భారతదేశంలోనే అతిపెద్ద విమాన యాన సంస్థగా మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా అత్యంత గౌరవనీయమైన ఎయిర్‌లైన్స్‌లో ఇండిగో ఒకటిగా నిలిచిందని ఆయన అన్నారు. కోట్లాది మందికి విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో ఇండిగో కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఐఏజీ, ఐఏటీఏ వంటి ప్రముఖ సంస్థల్లో పనిచేసిన అనుభవాన్ని ప్రస్తావించిన వాల్ష్, ఒక విమానయాన సంస్థను విజయవంతంగా నిర్మించడం ఎంత కష్టమో తనకు తెలుసని చెప్పారు.గత పదేళ్లలోనే ప్రపంచవ్యాప్తంగా 408 విమానయాన సంస్థలు కార్యకలాపాలు నిలిపివేసిన పరిస్థితుల్లో ఇండిగో సాధించిన విజయాలు నిజంగా అసాధారణమైనవని ఆయన అన్నారు. ప్రయాణికుల విశ్వాసమే ఇండిగో విజయానికి అసలైన బలం అని పేర్కొన్న వాల్ష్ గొప్ప విమానయాన సంస్థను నిర్వచించేది ప్రయాణికుల నమ్మకం, సంస్థ ప్రతిష్ఠ" అని అన్నారు.

## ఇటిఎఫ్ మార్కెట్‌లోకి జియో

**ముంబయి, ఆగస్టు 4:** ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ మార్కెట్లోకి జియో ఎంట్రీ ఇచ్చింది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ప్రపంచంలోనే అతిపెద్ద అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ బ్లాక్ రాక్ కలిసి జాయింట్ వెంచర్ జియోబ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్స్ ఏర్పాటుచేసాయి. ఈసంస్థనుంచే తొలి ఈటీఎఫ్ ఫండ్ మార్కెట్లోకి వచ్చింది. జియో బ్లాక్ రాక్ నిఫ్టీ 50 ఈటీఎఫ్ పేరుతో న్యూ ఫండ్ ఆఫర్ తీసుకురావడంతో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్‌లోకి అడుగుపెట్టింది. జియో బ్లాక్ రాక్ మ్యూచువల్ ఫండ్ మంగళవారం రోజున తొలి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ జియో బ్లాక్ రాక్ నిఫ్టీ 50 ఈటీఎఫ్‌ను లాంచ్ చేసి పెట్టుబడులను సులభతరం చేసింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ ఇప్పటికే మొదలవగా ఈనెల 11, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. నిఫ్టీ 50 ఇండెక్స్‌ను ట్రాక్ చేస్తూ దీర్ఘకాలంలో మూలధన లాభాలు అందించడమే లక్ష్యంగా ఈ ఈటీఎఫ్ ఫండ్ రూపొందించినట్లు జియో బ్లాక్ రాక్ పేర్కొంది.ఒకే పెట్టుబడి ద్వారా ఇన్వెస్టర్లు దేశంలోని 50 అతిపెద్ద లిస్టెడ్ కంపెనీల్లో పెట్టుబడి పెట్టే అవకాశాన్ని ఈ స్కీమ్ కల్పిస్తుందని తెలిపింది. 2026, మార్చి 30 నాటికి ఈ ఇండెక్స్ దేశంలోని మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో 53.7 శాతం మేర ప్రాతినిధ్యం వహించడం గమనార్హం. భారతదేశ ఈక్విటీ మార్కెట్లో కీలకమైన బెంచ్‌మార్క్‌గా నిలిచింది. ఈఫండ్‌లో వచ్చిన నిధులు ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయనుంది. ఈ ఫండ్ పనితీరును నిఫ్టీ 50 టోటల్ రిటర్న్స్ ఇండెక్స్‌తో పోల్చి చూడనున్నారు.





## ఎల్‌ఐసిలో 6.5% వాటా విక్రయం

### నేటినుంచే బిడ్డింగ్ షురూ!

**ముంబయి, ఆగస్టు 4:** కేంద్ర ప్రభుత్వం కొంత కాలంగా ప్రభుత్వ సంస్థల్లో పెట్టుబడి ఉపసంహరణలు, వాటా విక్రయం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎన్ఎల్‌సీ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, కోల్ ఇండియా, ఐఆర్ఎఫ్‌సి,భెల్ ఇలా చాలా సంస్థల్లో ఆఫర్ ఫర్ సేల్ విజయవంతంగా నిర్వహించింది. ఇప్పుడు అతిపెద్ద ప్రభుత్వ రంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో కూడా వాటా విక్రయించేందుకు ఆఫర్ ఫర్ సేల్ ప్రకటించింది కేంద్రం. ఇది బుధవారమే ప్రారంభం కానుంది. మొత్తంగా 6.5 శాతం వాటా విక్రయించాలని నిర్ణయించింది. అయితే అంతా ఒకేసారి కాదు. ముందుగా 2.5 శాతం వాటా విక్రయించనుంది. మరో 4 శాతాన్ని గ్రీన్ షూ ఆప్షన్ కింద వినియోగించనుంది. రెస్పాన్స్ బాగుంటే మిగతా వాటా విక్రయిస్తుంది. నాల్గవ తేదీ నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు షేర్లు కొనేందుకు ఛాన్స్ ఉంటుంది. ఇక్కడ సంస్థాగత ఇన్వెస్టర్లు, హై నెట్ వర్త్ ఇన్వెస్టర్లు పాల్గొంటారు. ఇక రిటైల్ ఇన్వెస్టర్లు బుధవారం రోజు బిడ్స్ దాఖలు చేయొచ్చు. తొలిరోజు అంటే 4న రెస్పాన్స్ బాగుంటే నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు గ్రీన్ షూ ఆప్షన్ కింద మళ్లీ ఆగస్ట్ 5న పార్టిసిపేట్ చేసేందుకు అవకాశం ఉంటుంది.ఆఫర్ ఫర్ సేల్ కింద ఇన్వెస్టర్లకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. సోమవారం సెషన్ ఎల్ఐసీ క్లోజింగ్ ప్రైస్ ఎన్ఎస్ఇలో రూ. 424.40 గా ఉండగా ఇప్పుడు ఫ్లోర్ ప్రైస్ రూ. 382 గా ప్రకటించింది. అంటే కిందటి రోజు ధరతో పోలిస్తే ఏకంగా 10 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. ఓఎఫ్ఎస్‌లో మొత్తంగా 6.5 శాతం వాటాకు సమానమైన 82.2 కోట్లకుపైగా షేర్లను అందుబాటులో ఉంచింది. ఇక్కడ పూర్తి స్థాయిలో సబ్‌స్క్రిప్షన్ జరిగితే ఖజానాకు ఏకంగా రూ. 31,400 కోట్లు వచ్చి చేరనున్నాయి. తొలుత 2.5 శాతం వాటాకు సమానమైన 31.6 కోట్ల షేర్లు అందుబాటులో ఉంటాయి. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం లిస్టెడ్ కంపెనీల్లో కనీసం 25 శాతం వాటా షేర్లుప్రజలు లేదా సంస్థాగత పెట్టుబడిదారులవద్ద ఉండాలి. దీనినే మినిమం పబ్లిక్ షేర్ హోల్డింగ్ రూల్ అంటారు. గరిష్ఠంగా సంస్థ/ప్రమోటర్ల దగ్గర 75 శాతం వరకు వాటా ఉంచుకోవచ్చు. ప్రస్తుతం 2026 మార్చి నాటికి ఎల్ఐసీలో ప్రభుత్వ వాటానే ఏకంగా 96.5 శాతంగా ఉంది. దీంతో సెబీ మార్గదర్శకాల కింద 26.5 శాతం వరకు వాటా విక్రయిస్తుంది. ఆఫర్‌ఫర్‌సేల్‌ప్రకటించగానే ఎల్ఐసి షేర్లు భారీగా క్షీణించాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14